జమీన్‌రైతు ప్రత్యేకానుబంధం

23, జూలై 1993, శుక్రవారం



# జీవితావలోకనం

నెల్లూరు శ్రీరామమూర్తి



## ముందుమాట

'జమీన్‌రైతు' వార పత్రికను నలభై ఐదేళ్లపాటు జవ జీవాలతో నడిపించిన నెల్లూరు శ్రీరామమూర్తి గారు తన ఆత్మకథను "జీవితావలోకనం" పేరుతో వ్రాయడం మొదలు పెట్టారు. ఎన్ని సంవత్సరాల పాటో కోరగా, కోరగా 1993 ఫిబ్రవరి 1 తేది రచనకుపక్రమించారాయన. తీరిక, ఓపిక వున్నప్పుడు కొద్దికొద్దిగా వ్రాస్తూ, మార్చి 20 తేదీతో నిలిపివేశాడు. దురదృష్టవశాత్తు తన బాల్యజీవితం దగ్గరే రచన ఆగిపోయింది. జీవిత కథను ఆరు ప్రకరణాలు చేసి బాల్యం, చదువు, జమీన్‌రైతుతో అనుబంధం, ఎమ్మెల్సీ, జిల్లా రాజకీయ నాయకులు, జమీన్‌రైతు సిబ్బందిల గురించి వివరంగా వ్రాయాలని తలపెట్టారు. కాని అది బాల్యం, చదువుల దగ్గరే ఆగిపోయింది. దానిని పూర్తి చేయడానికి శ్రద్ధ చూపలేదు. తన పినతండ్రి, జమీన్‌రైతు జనకుడు స్వర్గీయ నెల్లూరు వెంకట్రామానాయుడు గారు చేసిన పొరపాటె తానూ చేశాడు. ఆయనా తన ఆత్మకథ ప్రారంభించి బాల్యంతో నిలిపివేశాడు. జమీన్‌రైతు స్థాపనాది విషయాల ప్రస్తావన అందులో రాలేదు. ఆ కొరత తనను ఎంతగానో బాధించిందని శ్రీ రామమూర్తి గారు పలుమార్లు చెప్పేవారు. తానూ ఇప్పుడదే కొరత మాకు మిగిల్చి వెళ్లిపోయారు. జీవితావలోకనం పూర్తి చేసివుంటె జిల్లా చరిత్రకు, జిల్లా రాజకీయాలు ఈ ఐదు దశాబ్దంలో చెందిన పరిణామాలకు అదొక సాధికార గ్రంథంగా వుండేది.

కొంతలో కొంత ఉపశమనం – జమీన్‌రైతు స్వర్ణోత్సవ (1980) వజ్రోత్సవ (1991) ప్రత్యేక సంచికలలో శ్రీరామమూర్తి గారు తన జర్నలిజం అనుభవాలను సూచన ప్రాయంగా పరామర్శించి వున్నారు. జమీన్‌రైతుతో ఆయన అనుబంధము, అనుభవాలు తెలుసుకోవడానికి అవి పరోక్షంగా వుపకరిస్తాయి. అందువల్ల అర్థాంతరంగా ముగించిన జీవితావలోకనంతోపాటు, ఈ రెండు వ్యాసాలనూ కలిపి ప్రత్యేక అనుబంధంగా ఇస్తున్నాము. పాఠకులకే కాక జర్నలిజం, జిల్లా రాజకీయాల చరిత్ర అధ్యయనం చేయదల్చిన వారికి కరదీపికల వంటివి ఈ వ్యాసాలు.

– సంపాదకుడు

# జీవితావలోకనం


## నెల్లూరు శ్రీరామమూర్తి

నాకు వూహ తెలిసినప్పటి నుండి 68 వ ఏడు జరుగుతున్న ఈనాటి వరకు నన్ను వీడకుండా వెన్నాడుతున్న నేస్తాలు – పేదరికం, లేమి! సుఖం, సంతోషం, సంతృప్తిని అనుభవించిన రోజా ఒక్కటీ లేదు. సంతృప్తి అంటే, దానికి పరిమితి లేదు. తిండి, గుడ్డా, నీడ, ఇతర జీవితావసరాలకు కొరతలేని స్థితి సంతృప్తి చెంద దగిందనేది నా విశ్వాసం. నాడు నేడు కూడా ఆ స్వభావంలో మార్పు లేదు. లక్షలు, కోట్లు గడించడం, పరిమితి లేని ఆశతో పరుగులు తీయడం, ధనార్జనకు ఏ అప్రాచ్యపు పనినైనా చేయుటకు వెనుకాడక పోవడం అంటే నాకు అసహ్యం. ఒక పరిమితికి మించిన తర్వాతడబ్బు ప్రయోజనం ఏమిటి? దానివల్ల సుఖమేమిటి? సంఘంలో వారి స్థానం ఏమిటి? ఎందుకింత తపన, తాపత్రయం? ఇటువంటి అమాయక భావాలు అనేకం నాలో కలుగుతూ వుంటాయి. కాకి అరుస్తూంటుంది; కరవాడు ఎండుతుంటుంది అన్న సామెత లాగా నావంటి వాడికి ఇటువంటి పిచ్చి ఆలోచనలు కలుగుతుంటాయి. జనం ధనదాహంతో అనంత పరుగుపందెంలో నిర్విరామంగా పరుగులు తీస్తూనే వున్నారు. నేను ఇట్లనే వున్నాను!





మాది పోట్లపూడి. మా నాయన బసివి నాయుడు గారు చనిపోయే సరికి మా కుటుంబం నిరాధారమై పోయింది. నాకు బాగా వూహలేని వయస్సు. మా నాయన నాకు గుర్తు తెలియదు. ఆయన ఆ వూరి కరణం. అప్పుడు గ్రామాధికార్ల వుద్యోగాలకు వారసత్వ హక్కు వుండేది. మా అన్నకు అప్పటికి 14 ఏండ్ల వయస్సు. వుద్యోగానికి మరో నాలుగేళ్లు గడిస్తే గాని అర్హత రాదు. మాది భూమి పుత్ర. పాడి గీడి గలిగిన కుటుంబమే. మా నాయనతో బాటు అవీ చెల్లుకున్నాయి. స్వదేశీ వుద్యమంలో మా ఇంటి ఆవరణంలోనే నేత మగ్గాలు పెట్టారట. దివాలా తీశారు. నాకు తెలిసి కూడా మా ఇంటి అటక మీద మగ్గాల అవశేషాలుండేవి. మగ్గాలు పెట్టడానికి గాని, కుటుంబం ఆర్థికంగా దెబ్బ తినడానికి గాని మా చిన్నాయన నెల్లూరు వెంకట రామానాయుడు గారే కారకుడని మా అమ్మ ఆయన్ను నిందిస్తుండేది. స్వాతంత్ర్యయోధులు రేబాల కృష్ణమ్మ, అతని భార్య అక్కడే వుండినారట. ఆ అనుబంధం వల్లనేమో, నేను ఎదిగిన తర్వాత కృష్ణమ్మ గారికి నా పట్ల ప్రేమాను రాగాలుండేవి. కుటుంబానికి ఆధారభూతుడైన తండ్రి పోవడం, జరుగుబాటుకు ఆధారం లేక పోవడం, మా అన్న వెంకట సుబ్బరాఘవయ్య (వెంకయ్య) మైనరు కావడం ఈ పరిస్థితుల వల్ల మా కుటుంబం ఆ వూరు వదలి పెట్ట వలసి వచ్చింది. మా పిన తండ్రి రామానాయుడు గారు జమీన్దారీ ఉద్యమంలోను, స్వాతంత్ర్య పోరాటంలోను మునిగి వున్నందువల్లనే, లేక మా అన్న కరణీకం లెక్కలలో శిక్షణ పొంద వలసి వున్నందువల్లనో తెలియదు గాని, మా అమ్మ మీనమ్మ ముగ్గురు పిల్లల్తో – మా అన్న, అక్క, నేను – మైపాడు కరణంగా వుండిన మా మేనమామ రాయసం రాఘవులు నాయుడు పంచన చేరింది. మేనమామ



జీవితావలోకనం రచనకుపక్రమించే ముందుగా ఆరు ప్రకరణాలతో గుర్తుకు వ్రాసుకున్న చిత్తు ప్రణాళిక

అంటే మా అమ్మ సొంత అన్న తమ్ముడు కాదు; పెద్ద తల్లి కుమారుడు.

రాఘవులు నాయుడు గారి కాపురం గంగపట్నం; ప్రొద్దున్నే మైపాడుకు వచ్చి సాయంత్రం తిరిగి పోయే వాడు. తన కొరకు వచ్చి పోయే వారి సౌకర్యానికి, లెక్కలు వ్రాసుకోడానికి వసతిగా కాబోలు మైపాడులో ఒక పూరిల్లుండేది. అందువల్ల మాకు మెయిన్ రోడ్డులో కుడి వైపుగా ఒక పూరి పాక వేయించాడు. ఆ ఇంటికి మరుగు అనేది లేదు; చుట్టూ తాటాకు దడి కూడా లేదు. ఇల్లు వీధి ఒకటిగా వుండేవి. ఆ నిరాధారపు పరిస్థితుల్లో ఆ మాత్రం నీడ, ఆదరణ దొరకడం మా భాగ్యమే అనుకోవాలి!

ఇక్కడ మా నాయనగారిని గూర్చి రెండు మాటలు: చనిపోయే నాటికి ఆయన వయస్సెంతో తెలియదు. ఆయన మరణం సంవత్సరం తేదీ కూడా రామానాయుడు గారు ఒక నెల ముందు ప్రారంభించిన " జమీన్దారీ రైతు"లో ప్రకటింప బడిన వార్తవల్ల తెలిసికో గలిగాను గాని లేకుంటె దానికి ఆధారమే లేదు. 13.4.1930 తేది సంచికలోని కవి వర్యుని మరణం అనే శీర్షికలో వచ్చిన ఆ వార్త ఇది – "పోట్లపూడి గ్రామకరణమున్నూ, సహజకవితా ధురీణుడు అయిన నెల్లూరు బశ్వినాయుడు గారు ఈనెల 2 తేది 12.30 గంటలకు గ్రహణ వ్యాధిచే మరణించిరి" ఇందులో వయస్సు వెయ్యలేదు. ఆయన మరణించింది నెల్లూరులో; అంత్యక్రియలు జరిగింది పోట్లపూడిలో. వివాహమైన తర్వాత షుమారు పాతిక సంవత్సరాల లోపు జీతించి వుంటారేమోనని నా వూహ. ఆ వార్తకు రామానాయుడు గారు ఒక కరణం మరణం అని కాకుండా, ఒక కవివర్యుని మరణం అని శీర్షిక పెట్టడంలోనే రామానాయుడు గారి దృష్టిలో మా తండ్రి ఒక కవే గాని కరణం కాదు. మా తండ్రి గారి కవిత్వం శ్రీనాథుని కవిత్వం వలె వుండేదని రామానాయుడు గారు



ఎంతగా మురిసిపోయే వారో చెప్పలేను. రామానాయుడు గారు తన ''జీవిత విశేషాలు''లో రెండు పేజీలు మా తండ్రి కవితా ప్రాశస్త్యాన్ని గూర్చి వ్రాసుకున్నాడు. కళాప్రపూర్ణ డాక్టర్ మరుపూరు కోదండ రామరెడ్డి, కీర్తిశేషుడు వై.బి. రెడ్డి వంటి ఆయనను బాగా ఎరిగిన పెద్దలెందరో ఆయన కవిత్వాన్ని గూర్చి అత్యంతంగా శ్లాఘించేవారు. ప్రతి చిన్న సంఘటనను, సన్నివేశాన్ని ఆశువుగా కమ్మని పద్యాలలో చెప్పేవాడని అంటారు. నాకు తెలిసేటప్పటికి మా తండ్రి గారి పద్యాలు గాని, ఇతర వ్రాతలకు సంబంధించిన ఒక్క కాగితం ముక్క కాని దొరకలేదు. మా అమ్మనడిగితే, భద్రపరచలేక పోయాననే నిస్సహాయతను వ్యక్తం చేసింది. రామానాయుడు, కోదండ రామరెడ్డి గారల నోట మాత్రం కొన్ని పద్యాలు వినే అదృష్టం మాత్రం లభించింది. మా తండ్రి ఎంత అభ్యుదయ భావాలు గల వాడంటే ఆయనకు వివాహమయ్యే సరికి మా అమ్మ నిరక్షరాస్యురాలు. అక్షరం చదవ గలిగేది కాదు, వ్రాయ గలిగేది కాదు. ఒక ఉపాధ్యాయుని నియమించి ఆమెకు చదువు నేర్పించాడు మా నాయన. వృత్త చదువేకాదు. మరొక అధ్యాపకుని ద్వారా ఆమెకు సంగీతం కూడా నేర్పించాడు. ఆమె ఎక్కువగా వ్రాయగలిగేది కాదు గాని, భారత భాగవతాది వుద్గ్రంథాలను ధాటిగా చదివి, అర్థం కూడా చెప్పగలిగిన భాషాజ్ఞానం ఆమెకు కలిగింది. అదే విధంగా అధ్యాత్మ రామాయణ కీర్తనలు, మేలుకొలుపు పాటలు శ్రావ్యంగా పాడగలిగేది. ఆమెకు అక్షర జ్ఞానం కల్గించడంలో మా తండ్రి తీసుకున్న చొరవ శ్రద్ధాసక్తుల వల్ల ఆమెలో జీవితాంతం నిరంతర పఠనా సక్తి వుండేది. ఆ రోజుల్లో తన ధర్మపత్నికి తన వలె భాషా జ్ఞానం కల్గించడానికి మా తండ్రి అంత శ్రద్ధ తీసుకో గలిగాడు. ఇప్పుడు ఎందరు తమ భార్యల విద్య పట్ల ఆసక్తి చూపగలుగుతున్నారు? ఈ విషయంలోనే సిగ్గుతో తలవంచు కోవలసి వస్తుంది. నా భార్య లలితమ్మకు ఇంగ్లీషు, హిందీ నేర్చుకోవాలని ఎంతో అభిలాష వుండేది. జీవిత నిత్య పోరాటానికే కాలం సరిపోయినందు వల్ల నా ధర్మాన్ని నిర్వర్తించ లేక పోయాను.

మా తండ్రి మరణానంతరం మా కుటుంబం మైపాడుకు చేరిందని చెప్పాను గదా! నాకు తెలిసిన తొలి బాల్యదశ అక్కడే. అక్కడ మేము నాలుగు సంవత్సరాలు వున్నట్లు జ్ఞాపకం. నాకు అక్షరాభాస్యం అంటూ జరిగిందో లేదో, జరిగి వుంటే ఎక్కడ జరిగిందో నాకు తెలియదు. మైపాడు ప్రాథమిక పాఠశాలలో ఓనమాలు దిద్దుకోవడం మాత్రం నాకు బాగా జ్ఞాపకం వుంది. చదువులో మొద్దునో ఏమో గుంట ఓనమలు దిద్దవలసి వచ్చింది. అది జిల్లా బోర్డు పాఠశాల; విశాలమైన ప్రాంగణం; చుట్టూ ప్రహరీగోడ; పెంకు కప్పు గలిగిన స్కూలు భవనం. 1931 ప్రాంతంలో నేను అక్షరా భ్యాసం మొదలు పెట్టిన ఆ స్కూలు భవన ప్రాంగణంలో 1979-80 ప్రాంతంలో ఎం.ఎల్.సి.గా ఆనాటి రెవిన్యూ మంత్రి, శ్రీ నేదురుమల్లి జనార్దన రెడ్డి, టూరిజం మంత్రి శ్రీమతి రోడామిస్త్రిలతో కలసి పాల్గొనే అవకాశం లభించింది. దాదాపు అర్థ శతాబ్దం తర్వాత కూడా ఆ స్కూలు భవనం ఎటువంటి మార్పు లేకుండా, చెక్కుచెదరకుండా యథాతథంగా వుండడం ఆశ్చర్యమే. ఆ రోజు అక్కడ సభావేదిక మీద కూర్చొని వుంటే, తల్లి ఒడిలో చేరిన అనుభూతితో పరవశం కలిగింది. మంత్రుల వుపన్యాసాలు, సభాకార్యక్రమాల మీద నాధ్యానం లేదు; నా మనసంతా బాల్య స్మృతులతో నిమగ్నమై పోయింది.

ఆ పాఠశాలలోని ఒక వుపాధ్యాయుడు నాకు ఈనాటికీ జ్ఞాపకం. ఆయనకు పాపిష్టి గూని; అందువల్ల గూని అయ్యవారనే వారు. ఆయన బహుశా నాలుగున్నర అడుగుల పొడగరిగా వుంటాడు; చొక్కా వేసుకునే వాడు కాదు, గ్లాస్కో అంగవస్త్రం మాత్రం వుండేది. స్కూలు భవనానికి తూర్పు వైపు ప్రహరీ గోడ పొడవునాజామచెట్లు వుండేవి. సాయంకాలం ఆ చెట్ల సమీపంలోని ఆరుబయలులో క్లాసు పెట్టుకునే వాడు ఆ అయ్యవారు. జామచెట్లకు ఎన్ని ఆ పండ్లు వున్నా దొంగతనంగా ఎవ్వరూ కోసే వారు కాదు. గూని అయ్యవారు పండ్లు కోయించి పిల్లలకు పంచేవాడు. ఆహ్లాదకరమైన సముద్రపు గాలి, జామ ఫలహారం ఎంత ఆనందంగా వుండడే మరి! చదువు వల్లకాదు; జామపండ్ల పందారం వల్ల ఆ అయ్యవారు నా స్మృతిలో నిల్చిపోయేడేమో ననిపిస్తుంది. ఆయన ఫ్లాస్కులో కాఫీ డికాషన్ తెచ్చుకొని మా ఎదుటే తాగేవాడు; అవేమిటి అని అడిగితే కషాయం అని చెప్పేవాడు. ఆ రోజుల్లో అమలులో వుండినది ప్రజావైద్యం ఆయుర్వేదం కాబట్టి పోలిక సరిపోయింది. ఆ స్కూలులోనే మా అక్క రమణమ్మ ఐదవ తరగతి; ఆ తరగతిలోనే ఆడిగోపుల కోదండ రామయ్య అనే చేనేత కులానికి చెందిన అబ్బాయి వుండేవాడు. కోదండరామయ్య చాలా మంచివాడు. ముక్కుకు పోగు కూడా వున్నట్లు జ్ఞాపకం. నన్ను తన ఇంటికి తీసుక పోయి అడుకునే చిన్న గూడు బండికి అవసరమైన, నూలు అయిపోయిన తర్వాత ఖాళీ అయిన చక్రాలు, రంగు రంగుల దారాలు ఇచ్చేవాడు. ఒక్కోసారి తానే బండి చేసిచ్చేవాడు కూడా. అడి గోపుల కోదండరామయ్య గారంటే మద్రాసు గిండీ ఇంజనీరింగు కళాశాల పుట్టినప్పటి నుండి అప్పటి వరకు ఏ విద్యార్థికి





రానన్ని అత్యధిక మార్కులతో ప్రతిభావంతుడైన విద్యార్థిగా కీర్తిగన్నవాడు. మద్రాసులో కాపురం వుండి, వైద్యం నిమిత్తం అక్కడకు పోయే నెల్లూరీయులకు అనుపమానమైన సేవ జేసిన ధన్యజీవి కీ.శే. వాకాటి వీరారెడ్డి కోదండరామయ్య నెల్లూరు గర్వించ దగిన విద్యార్థి అని శ్లాఘించేవారు. కోదండరామయ్య ఇంజనీరుగా రైల్వేలో చేరి, ఛీఫ్ ఇంజనీరుగా కాబోలు రిటైరై, హైదరాబాదులో స్థిరపడి కాలధర్మం చెందాడు. ఎవరిలో ఏ ప్రతిభ ఎంతగా దాగి వుంటుందో చిన్నతనంలో తెలియదు గదా అని కోదండరామయ్య జ్ఞాపకాని కొచ్చినప్పుడు అనిపిస్తూంటుంది.

మైపాడులో ఎంతో మంది స్నేహితులుండేవారు. అందులో ఆ రోజుల్లో తాలూకా బోర్డు ప్రెసిడెంటు జేసిన కాకుటూరు లింగారెడ్డి గారి మేనల్లుని కుమారుడు రాఘవరెడ్డి నాకు సన్నిహితుడు. అతనిని బాబు అనేవారు. మాది పూరికొంప, వారిది రెండంతస్తుల భూరి భవనం. సంపన్న కుటుంబం. బాబు తండ్రి అప్పుడు పాంటియాక్ కారుకొని అబ్బ అనిపించుకున్న వ్యక్తి. మిద్దె మీద హాలంతా ఫర్నిచరుతో నిండి వుండేది. రివాల్వింగ్ ఛేర్స్ వగైరా లెన్నో వుండేవి. బాబుతో నాకు గాని, మాతల్లి అక్క విషయంలో వారింట్లోని పెద్దల మధ్యగాని అంతరాలు వుండేవి కావు. చాలా కలసి మెలసి వుండేవారు. నేను బాబుతోటి విశాలమైన వారి లోగిలిలో ఎప్పుడూ ఆడుకునే వారం. మా అమ్మ నా పట్ల కాస్త ప్రత్యేక ప్రేమాభిమానాలు కనబరచేది. ఒకసారి రెండు కొత్త చొక్కాలు కుట్టించింది. ఆ రోజుల్లో ఇంగ్లండు నుండి దిగుమతైన 'సీమ' గుడ్డ తప్ప వేరొకటి వుండేది కావు. నాకు కుట్టించినవి మంచి పాప్లేన్ చొక్కాలు. ఒక రోజు వాటిలో ఒకటి తొడుక్కుని బాబు ఇంటికి పోయి, చొక్కా తీసి ప్రక్కన పెట్టి, ఆటలలో నిమగ్నమై వుండినాము. ఆ సమయంలో ఆ చొక్కా కాస్త ఎవరో దొంగలించుకొని పోయారు. వుత్త ఒంటితో మొహం మాడ్చుకుంటూ ఇంటికి పోయాను. చొక్కా పోగొట్టుకొని వచ్చిన దానికి మా అమ్మ తిట్టినట్లు, కొట్టినట్లు జ్ఞాపకం లేదు. రాఘవరెడ్డి దేవాలయాల శాఖలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగా పని చేసి రిటైరై నెల్లూరులోనే వున్నాడు. పాపం, విధి వంచితుడై, అంత భోగభాగ్యాల మధ్య అతి గారాబంగా పెరిగిన బాబు, ఆఖరకు సామాన్యుడయ్యాడు. అతను ఈనాటికీ నాకు ఆ నాటి బాబుగానే అనిపిస్తాడు. సిరి ఎంత అస్థిరమైందో గదా! నారపరెడ్డి కోదండరామ రెడ్డి అని మరో స్నేహితుడు. కోదండరామరెడ్డి బి.ఎ. ఆనర్స్ చదివి, వుద్యోగానికి పోకుండా వ్యాపార రంగంలో దిగి బాగా గడించి వృద్ధికి వచ్చిన పిల్లలతో స్థిమితంగా నెల్లూరులోనే వున్నాడు.

మైపాడుకు బేసిన్ ఒక మైలు దూరంలో వుంటుంది. బేసిన్ అంటే బకింగ్‌హామ్ కాల్వమీద పడవలు ఆగే స్థలం అన్నమాట. ఆ కాల్వ దాటిన కొద్ది దూరంలో సముద్రం. పడమటి గాలి రోజుల్లో తాటాకును గుండ్రంగా చక్రంగా చుట్టి బేసిన్ రోడ్డు మీద వదిలితే చక్కని రోడ్డు కాబట్టి గాలికి అత్యంత వేగంగా పరుగెత్తేది; దాని వెనుక మేమూ పరుగెత్తేవారం. ఆ విధంగా రోజుకు ఎన్నిసార్లు పరుగెత్తేవారమో, రోజుకు మొత్తం ఎన్ని మైళ్ల పరుగు వుండేదో లెక్కలేదు. అదే విధంగా ఎవరో ఒకరిని ఆధారం చేసుకొని సముద్రానికి పోయి మునిగి ఒళ్లు ఆరిన తర్వాత ఇంటికి చేరుతుండే వారం. అప్పుడు అంతటి ధైర్యం ఎక్కడిదో మరి! నాకు గాలి పటాల పిచ్చి ఒకటి. సొంతంగా చేసుకొని ఎగుర వేస్తూ వుండే వాణ్ణి. ఎక్కడ తిరిగినా సకాలానికి ఇంటికి చేరుతుంటే మా అమ్మ ఏమీ అనేది కాదు. ఒక రోజు ప్రొద్దున చద్దెన్నం తిని కొందరు పిల్లలతో బోసి పండ్లకని ఎక్కడో తిరిగి సాయంత్రం మూడుకో నాలుక్కో ఇంటికి చేరాను. మా అమ్మ వుతికి పారేసింది. అంతే, మళ్లీ ఎక్కడకూ పోయేవాణ్ణి కాదు. గోలీలు, బొంగరాల ఆటకు కూడా పోనిచ్చేది కాదు; చెడు స్నేహంలో పడి చెడిపోతానని ఆమె భయం. అందువల్లే ఆ ఆటలు నాకు రావు.

ఆ రోజుల్లో మైపాడు పెద్ద భూజల మార్గ రవాణా కేంద్రం. నెల్లూరు వ్యాపారస్తులకు అవసరమైన సకల వస్తువులు మద్రాసు నుండిగాని, ఇతర చోట్ల నుండి గాని బకింగ్‌హామ్ కెనాల్ మీద మైపాడు బేసిన్‌కు చేరేవి. అప్పుడు లారీలు బొత్తుగా వున్నట్లులేదు. బేసిన్‌కు చేరే ఆ సరకుంతా రెండెడ్ల బండ్ల మీద నెల్లూరుకు రవాణా కావాలి. బండ్లవారు సాయంత్రానికి బండ్లను సరకుతో నింపుకొని వూరిలో నిలిపి, రాత్రి భోజనం అయిన తర్వాత నెల్లూరుకు బయలు దేరేవారు. రోజూ ఏ వంద రెండు వందల బండ్లో సరుకులు రవాణా చేస్తుండేవి. అదే విధంగా మద్రాసుకు పోవలసిన వస్తువులను నెల్లూరు నుండి బేసిన్‌కు చేరవేసేవి; చక్కెర బస్తాలతో పెద్ద బండ్లు వూళ్లో నిలిపి వుంటే, కాకి వెదురు గొట్టాలను బస్తాకు దూర్చి చక్కెరను పీల్చుకొనే వాళ్లం. తినే వస్తువు ఏది వున్నా అదే పని!

మైపాడుకు అప్పుడే ఒక సౌకర్యం వుండేది. అయితే ఒక్క బస్సు వచ్చి పోయేదనుకుంటాను. అందువల్ల నెల్లూరు ప్రయాణానికి గ్రామస్తులు ఒంటెద్దు బండ్ల మీద ఆధారపడేవారు. ఒంటెద్దు బండి బాడుగ పోను అర్థ రూపాయ; మునిసిపల్ లైసెన్సు లేనివై నందువల్ల పట్టణంలోకి వచ్చేవి కావు; గేటు వద్దనే ఆపి వేసేవారు. అక్కడ నుండి వేరొక బండిలో టవున్‌కు చేరాలి. రాత్రి



భోజనానంతరం బండి కడితే తెల్లవారే సరికి గేటు వద్దకు చేరేది. ఒక రోజు నేను మా అమ్మ బండిలో నెల్లూరు వస్తున్నాము. నిద్రా సమయం; మేమూ నిద్ర పోతుండినాము. బండి వాడు కూడా తూగుతూ పగ్గం ఎడమ వైపుకు వేశాడేమో, బండిపోయి మైపాడు కాల్వలో తల్లక్రిందులుగా పడిపోయింది. ఎవ్వరికీ దెబ్బలు లేవు. నన్ను కొత్తూరులోని మా మేనత్త వద్ద వదలి, మా అమ్మ వేరొక బండిలో ప్రయాణం కొనసాగించింది.

మైపాడు రాజకీయంగా కూడా ప్రసిద్ధమైనదే. 1930లో ఉప్పు సత్యాగ్రహ ప్రధాన కేంద్రం అది. డాక్టర్ బెజవాడ గోపాల రెడ్డి, పుచ్చలపల్లి సుందరయ్య ప్రభృత నాయకులెందరినో మొదటి సారి జైలుకు పంపిన స్వాతంత్ర్య పోరాట పుణ్యక్షేత్రాలలో ఒకటి అది. దువ్వూరు బలరామరెడ్డి గారు దేశభక్తుడు; స్వాతంత్ర్య పిపాస గలవాడు; ఆ వూళ్లో పెద్ద రైతు. ఆయన అండ వున్నందు వల్లనే అది సత్యాగ్రహ కేంద్రమైందేమో ననిపిస్తుంది. 1988 ఏప్రెల్‌లో ఉప్పుసత్యాగ్రహ పునర్‌ప్రదర్శన జరిగినప్పుడు గోపాలరెడ్డి గారి చొరవతో ఉప్పుసత్యాగ్రహ జ్ఞాపక చిహ్నంగా ఒక స్థూపం కూడా నిర్మింప బడింది. ఆ స్థూప ప్రారంభోత్సవ సభలో ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ జలగం వెంగళ రావు, గోపాలరెడ్డి, వుత్సవ అధినేత నేదురుమల్లి జనార్దన రెడ్డి గారలు పాల్గొన్నారు. ఆ వుత్సవంతో సత్యాగ్రహ దినాల నాటి చైతన్య వాతావరణం ఆ రోజు వెల్లివిరిసింది. ఆనాటి సభలో సజీవంగా వుండిన ఉప్పు సత్యాగ్రహులు గోపాలరెడ్డి, దొడ్ల సుబ్బరామ రెడ్డి, మేనకూరు వీర రాఘవరెడ్డి గారలు సన్మానింప బడ్డారు. ఆనాటికి జీవించి వుండిన గూడూరు వాసి గుద్దేటి వీర సుబ్రహ్మణ్యం గారు రాలేక పోయారు. ఉప్పు సత్యాగ్రహం మొదటి జట్టు సత్యాగ్రహి అయిన మైపాడు వాసి దువ్వూరు బలరామరెడ్డి గారు కూడా ఆనాటికి స్వర్గవాసి అయిపొయ్యాడు.

మైపాడులో మా ఇల్లు, వీధి ఒకటిగా వుండేవని చెప్పాను గదా! మేము ఇంటి ముందు మంచాలు వేసుకొని పడుకునే వారం. భయం గియం వంటివేమీ లేదు. అది 1933 నో, 1934 నో తెలియదు. ఒక రోజు అర్ధరాత్రి సమయంలో ఒక కారు వచ్చిపోయింది. తెల్లవారే సరికి వూరంతా ప్రాకిపోయింది. పోలీస్ వచ్చి దువ్వూరు బలరామ రెడ్డి, పట్నం బాలిరెడ్డి గార్లను అరెస్టు చేసి తీసుక పోయింది అని. అప్పుడు ఎందుకు అరెస్టు చేసిందో తెలియదు గాని, తర్వాత తెలిసికున్నాను- మద్రాసు కుట్ర కేసులో వీరు ముద్దాయిలని, అందువల్ల అరెస్టు చేసి తీసుక పోయారని తెలుసుకొన్నాను. ఏ సంవత్సరమో గుర్తు లేదు గాని, ఒక రోజు సహ పంక్తి భోజనం జరిగింది. అంటరానితనం రాజ్యం చేస్తుండిన పాడు రోజులవి. ఆ భోజనానికి మా అన్న వెంకట సుబ్బ రాఘవయ్య హాజరయ్యారట. అంతే; మాకు సాంఘిక బహిష్కరణ ఎదురైంది. బావికి నీళ్లకు కూడా రానిచ్చేవారు కాదు. మా ఇంటి ప్రక్కనే కాకుటూరు లచ్చారెడ్డి గారి ఇల్లు వుండేది. వారిదీ పెద్ద రైతు కుటుంబం; విశాలమైన పెంకుటింటి భవంతి. ఆయన ఖద్దరు వేసుకునే వాడు. ఆయన సతీమణి కూడా వుత్తమురాలు. ఆ సమయంలో మమ్ము ఆదుకున్న వారు వారు; చిరస్మరణీయులు.

మేము మైపాడుకు ఎందుకు పోయామో ఆ సంగతే మళ్లీ ప్రస్తావించలేదు. మా అన్న కరణీకపు లెక్కలలో శిక్షణ పొందడానికి. ఆయన లెక్కలు నేర్చుకున్నాడో లేదో తెలియదు గాని, త్రాగుడు తప్ప ఎన్ని వ్యసనాలున్నాయో అన్నిటికీ ఆయన అలవాటు పడి చీట్లాటలో అక్కడ "ప్రవీణ" పాస్ అయ్యాడు. ఇంటికి వచ్చే వాడు కాదు. ఆయన్ను వెతుక్కు రమ్మని మా అమ్మ నన్ను పురమాయించేది. ఒక రోజు శివాలయం గాలి గోపురం మీద ఆడుతున్నారని చెప్పారు. పైకి ఎక్కడానికి ఒక పెద్ద మోకు వ్రేలాడుతుండేది. చిన్న వయస్సు, పెద్ద మోకు, ఎక్కువ ఎత్తు. చచ్చీ చెడి ఎక్కిపోతే అయ్యగారు అక్కడ ప్రత్యక్షం! చిన్న డబ్బో, అర్ధణో చేతిలో పెట్టి అమ్మకు చెప్ప వద్దన్నాడు. డబ్బులు తీసుకున్నాను గాని మా అమ్మతో చెప్పకుండా వుండలేదు. నాటి నుండి 1971 లో ఆయన మరణించే వరకు ఆయనలో ఎటువంటి మార్పూ రాలేదు; ఆయనది నాకు నిత్యం సమస్యగా వుండేది. మైపాడులో వుండగా ఆయన వయస్సు 16, 17 వుండవచ్చు; ఆయనకు మా తండ్రి గారి కవనం అబ్బినట్లుంది; అప్పటికే పద్యాలు వ్రాసేవాడు. ఏం లాభం - దుర్వ్యసనాల వల్ల పూర్వ జన్మ సుకృత ఫలితమైన ఆ కవితా ధార వ్యర్థమై పోయింది. ఆ కవితా సరస్వతి ఆయన కుమారుడు డోలేంద్ర ప్రసాద్‌ను కూడా వరించింది కాని, బహు కార్యనిమగ్నత, శ్రద్ధాసక్తుల లేమి వల్ల ఆయనలోనూ అది వికసించడం లేదు. సృష్టి వైచిత్ర్యం చూడండి - మా తండ్రి కవితా వారసత్వం మా అన్నకు, ఆయన కుమారుడికి సంక్రమించాయి గాని, నా పై గాని, నా కుమారుల పై గాని దాని ఛాయలు కూడా పడలేదు.

మేము మైపాడులో వుండగా నెల్లూరులోని వినాయక సినిమాకు మొదటి చిత్రం వచ్చింది. సావిత్రో మరేదో! అప్పుడు నెల్లూరులో అదొక్కటే సినిమా హాలు. క్రొత్తహాలు కూడా వుండిందో లేదో తెలియదు. ఒక రోజు మా అమ్మతోటి పెద్ద బండిలో ఆ మొదటి టాకీక్ పోయాను. బండి నిండా జనం. కొత్తగా టాకీ రావడం ఆ





రోజుల్లో గొప్ప వింత. హాలు చిన్నది; ప్రేక్షకులు తండోప తండాలు. టాక్ రాకముందు మూగ సినిమాలొచ్చేవి. ప్రస్తుతం పాత పోస్టాఫీసు రోడ్డులో టెలిఫోన్ ఆఫీసు వున్న చోట 'కృష్ణ సినిమా' అనే థియేటర్ వుండేది. తెర మీద బొమ్మలు కనబడుతూంటే తెర ముందు ఒక వ్యక్తి నిల్చొని రన్నింగ్ కామంటెరీ గా ఆ దృశ్యాలను వివరిస్తూండే వాడు. మూగ సినిమా, ఆ పిమ్మట తొలి టాకీ చిత్రం చూడ గలగడం అపూర్వమైన అనుభూతి, అనుభవం.

* * *

సంవత్సరం ఏదో గాని, మైపాడు తర్వాత మజిలీ నెల్లూరు 1934, 35, 36 వుండవచ్చు. అప్పుడు జమీన్‌రైతు కార్యాలయం పొగతోటలో వుండేది. అక్కడ కొంజేటి వారి కొట్లు అని భవనం ఒకటి వుండేది. ముందు భాగంలో ఆఫీసు, ప్రెస్సు, వెనుక భాగంలో మా కాపురం. తర్వాత కరణాల వీధిలోని ఒక అద్దె కొంపలోకి మారాము. పొట్లపూడి నుండి మైపాడుకు పోయే మధ్య కాలంలోనో మరెప్పుడోనో బొత్తుగా జ్ఞాపకం లేదు గాని, ప్రస్తుతం జిల్లా ట్రెజరీ వెనుక ప్రస్తుతం జిల్లా పౌరసంబంధ శాఖాధికారి కార్యాలయం వున్న భవనంలో పొణకా వారు వుండే వారు. ఆ భవన ప్రాంగణంలోని సర్వెంటు క్వార్టరో లేక మరేదో ఒక పెంకుటింటి భాగంలో మేముండే వారం. అప్పుడు దీన్నిబట్టే వూహించుకోవచ్చు. కుటుంబ స్థితిని. అక్కడున్నప్పుడే బారకాసులో లంగర్ ఖానాకు పడమరగా ఒక వీధి బడి వుండేది. ఆ బడికి పలక బలపంతో పోతుండినట్లు బాగా జ్ఞాపకం. ఆ స్కూలు అధిపతి ముఖం ఎప్పుడూ తీక్షణంగా వుండేది; చెయ్యి కూడా దుడుకే! ఇప్పటికీ శిథిలావస్థలో ఆ ఇల్లు అట్లాగే వుంది. ఆ దారిన పోయేటప్పుడంతా నేను చదివిన బడి గదా అనే అభిమానంతో పొరపాటున



జర్నలిస్టుగా తన భాషా పరిజ్ఞానాన్ని చిన్న తనంలో చాది పోసిన సరస్వతిగా శ్రీరామమూర్తి గారు ధన్యవాదాలు తెల్పిన కవయిత్రి జయలక్ష్మమ్మగారితో (కుర్చీ వెనుకకూర్చున్నామె. చిన్న నాటి ఫోటో)

కూడా చూడకుండాపోను. పొగతోటలో వున్నప్పుడు స్కూలు, చదువు వున్నట్లు లేదు. అక్కడ ఆ చిన్న వయస్సులోనే జమీన్‌రైతుతో గాఢమైన అనుబంధం ఏర్పడి, పత్రికకు సంబంధించిన అన్ని విభాగాలనూ నిత్యం పరిశీలిస్తుండడం, ఆ విధంగా అవి కంఠస్తం చేసిన పాఠాల వలె నా మనసులో నిల్చి పోవడం జరిగింది.

కరణాల వీధిలో కాపురం వున్నాము. అప్పుడు మా పిన తండ్రి రామానాయుడు గారి పోషణను కుంటాను. ఆయనతో మా అమ్మకు సరిపడేది కాదు. ఆమెకు ఆస్తిపాస్తులు లేకపోయినా పెండ్లికాక ముందు, వివాహానంతరం మా తండ్రి పోషణలో బాగా బ్రతికారామె. కాస్తధారాళమైన చెయ్యి; ఇతరులకు కాస్త పెట్టె గుణం. కోపము, నోరు కొంత ఎక్కువే. కాని అవి తాత్కాలికమే. మనసు నిర్మలం, నిష్కల్మష స్వభావం. ఆమెతో వచ్చిన లోపమంతా పరిస్థితుల కనుగుణంగా మారలేక పోవడమే! మంచి రోజుల వలె కాని రోజులలో కూడా జరగాలను కోవడం, సర్దుబాటు తత్వం కాకపోవడం ఆమెలోని పెద్ద లోపం. మా చిన్నాయనది దిన భత్యపు వ్యవహారం. యానాదుల వలె ఏ పూట



కాపూట నిత్యావసర వస్తువులు తెచ్చుకోవాలి. అందులో కూడా పొదుపు. మొలగొలుకు బియ్యం బదులు ఎర్రకేసరి బియ్యం తినమనేవాడు. ఆయన ఆ ఎర్ర అన్నాన్నే ప్రీతిగా తినేవాడు. కాని ఆమె మనసు ఆ నిర్బంధాలకు సమ్మతించేది కాదు. పాలు మీగడ నెయ్యి ఇష్టం వచ్చినట్లు తిన్న మనిషిని ఎర్రకేసరి తినమంటే ఎట్లా సమాధాన పడుతుంది? ఆమె న్యూనతగా అవమానంగా భావించేది. మా పిన తండ్రి మీద అదే ఆమె మంట. ఆయనతో తగువు పెట్టుకొనని పూట వుండేది కాదు. అది ఆయనకు మామూలై పోయింది; వింటుండిన మాకూ అలవాటై పోయింది. అట్లనే రోజులు దొర్లిపోయాయి.

కరణాల వీధిలో వుండేటప్పుడు నేను, మా అక్క రమణమ్మ, మా పిన తల్లి కుమారుడు పార్లపల్లి వెంకట రమణయ్య ముగ్గురం మండపాల వీధిలోని నరసయ్య ఎయిడెడ్ స్కూలుకు పోయేవారం. ఆ స్కూలులో ఒకటవ తరగతి నుండి ఐదవ తరగతి వరకు ఏడవ తరగతి వరకూ వుండేది. మొదటి మూడు తరగతులు మంగలి వీధి చివర, ఆచారి వీధిలో కలిసే సమీపంలోని ఒక ఇంట్లో వుండేది. తక్కిన తరగతులు మండపాల వీధిలో ప్రస్తుతం రాఘవేంద్రస్వామి గుడి వున్న భవనంలో వుండేది. నేను రెండవ తరగతి; వాళ్లిద్దరు ఐదవ తరగతి అనుకుంటాను. మా అక్కకు నెల్లూరు మునిసిపల్ గరల్స్ హై స్కూలు ప్రధానోపాధ్యాయినిగా పనిజేసి రిటైరైన రత్నమ్మ ఆ స్కూలులో సహపాఠి. రెండవ తరగతి తర్వాత నన్ను డబుల్ ప్రమోషన్‌లో నాల్గవ తరగతికి వేశారు. ఆ స్కూలులో బోధన గాని, క్రమశిక్షణ గాని అద్భుతంగా వుండేవి. బాలబాలికలు, ఉపాధ్యాయుల సంఖ్య అధికంగా వుండేది. ఆ స్కూలు మేనేజరు నరసయ్య గారు ఎంత వరకు చదువుకున్న వాడో ఏమోగాని, స్కూలును మాత్రం కడు సమర్థంగా నిర్వహించేవాడు. మోకాళ్ల దిగు వరకు ఎత్తికట్టుకునే అతి నాజూకైన గ్లాస్కో ధోవతి, తెల్లం పాప్లెయిన్ ఫుల్ షర్టు, ముక్కుకు బంగారు పోగు, సన్నగా పొడవుగా వుండిన నరసయ్య గారి రూపం సజీవంగా ఈనాటికి కండ్ల ముందు నిలుస్తుంది. అక్కడ నాల్గవ తరగతిలో నెల్లూరు జిల్లా భూగోళం వుండేది. ఆనాడు ఆ భూగోళంలో చదువుకున్న జిల్లా సమగ్ర రూపం నా బుర్రలో ఇప్పటికీ పదిలంగా వుంది. జిల్లాలోని నదులు, పెన్నా ఉపనదులు, కొండలు, నైసర్గిక స్వరూపం వగైరాలన్నీ సమగ్రంగా అందులో వుండేవి. కనిగిరి రిజర్వాయరు కంటే అప్పుడు మోపాడు రిజర్వాయరు ప్రముఖంగా పేర్కొన బడేది, మ్యాప్‌లో చూపబడేది. మోపాడు రిజర్వాయరు ఈనాడు దుస్థితి పాలై పోయింది. ఆ స్కూల్లో చదివిన ఆ రెండు సంవత్సరాలలోనే కాపువీధి, చిన్న బజారు, దానికి అటు ఇటుగా వున్న సందులు, మార్కెట్లు వగైరా లన్నీ పచారు చేసినట్లు గమనం.

ఆ సమయంలో మా అమ్మది కఠినమైన శిక్షణే. బడికి పోయి రావడం, ఇంటికి కావలసిన బయట పనులు చేయడం తప్ప ఇంకెక్కడికీ పోవడానికి, కడకు ఆడుకోవడానికి గూడా అంగీకరించేది కాదు. మా పిన తల్లి కుమారుడు రమణయ్య అనే, ఆయన నాకంటే రెండేళ్లు కాబోలు పెద్దవాడు– తల్లి లేదు; ఒక్కడే బిడ్డ; తండ్రి గారాబంగా చూచుకునే వాడు. ఆయన కాస్త తులిపి. గోలీలాటలో ప్రవీణుడు. ఎడమ చేత్తో గురి చూచి గోలిని గోలితో కొట్టాడంటే అది ముక్కలు కావలసిందే! ఒక రోజు నన్నూ గోలీలాటకు తీసుక పోయాడు; నాకు గోలీ పట్టుకోవడానికి కూడా చేతవచ్చేది కాదు. రాక పోయినా ఆడి వచ్చాను. గోలీలాటలో పిల్లల మధ్య తగవులు సహజం. నేను గోలీలాడ డానికి పోయినట్లు మా అమ్మకు ఎట్లానో తెలిసింది. పట్టుకొని వుతికి పారేసింది. అంతే; ఆ తర్వాత ఆ ఆటకు పోయేవాణ్ణి కాదు. చిన్న వాణ్ణని కాబోలు, మా అమ్మకు నా పట్ల కొంత ప్రత్యేక అభిమానం. మా అక్క, మా పిన తల్లి కొడుకు రమణయ్యకు కాణీ యిస్తే, నాకు అర్ధణా ఇచ్చి వారితో చెప్పవద్దనేది; బయటకు పోయిన తర్వాత వారికి చెప్పివేసే వాణ్ణి. వాళ్లు మా అమ్మ పక్షపాతానికి ఆమెతో మారాం వేసుకునే వాళ్ళు. నేను ఆ చిన్న వయస్సులోనే అబద్ధం చెప్పలేక పోయేవాణ్ణి. కాని, మనసులో ఏదీ దాచుకోలేక పోయేవాణ్ణి. ఆ రెండు గుణాలు ఎంత నష్టదాయకమో ఆ తర్వాత తెలిసి వచ్చింది. ఆ రోజుల్లో కాణీ (చిండబ్బు) విలువ ఎంతో తెలుసా? చిండబ్బుకు మూడు రువ్వలు; రువ్వకు సెనగ వుండగాని, మసాల వడ గాని, మరేదైనా గాని ఒకటొచ్చేది– అంటే కాణీకి మూడన్నమాట. రెండు చిండబ్బులు అర్ధణా. అర్ధణా నాణెం రూపాయి ప్రమాణంలో కల్తీలేని రాగితో చేయ బడి వుండేది. కొనుక్కోడానికి చిండబ్బిస్తే ఎగిరి గంతు వేసేది; అర్ధణా అంటే ఇంకెంతో వూహించండి. అర్ధణా ఇస్తే గంతులేసే వాణ్ణి. ఇప్పుడు రూపాయికి కూడా వస్తు రూపంలో దాని విలువ వుండదు.

ఆ సమయంలో నా హృదయాన్ని ఒక సంఘటన కలిచి వేసింది; దాన్ని యిప్పుడు తలచుకున్నా చెప్పలేని బాధ కలుగుతుంది. మా మేనత్త కుమారుడు – పురిణి వెంకట రమణయ్య – గూడూరులో చదువుకుంటుండే వాడు; అప్పుడు ఫోర్తు ఫారం అనుకుంటాను. పేదరికం కాబట్టి మా చిన్నాయన రామానాయుడు గారు ఆయనకు ఎవరింటి వద్దనో భోజనము వసతి ఏర్పాటు చేశాడు. ఆయన ఒక రోజు





బస్ ఛార్జీకూడా లేదేమో. 24 మైళ్లు నడిచి మధ్యాహ్నం భోజనం సమయానికి మా ఇంటికి వచ్చాడు. పాపం, అస్వతంత్రత, ఆత్మాభిమానం, అన్నం పెట్టమని మా అమ్మను అడుగలేదు. అప్పుడామె అన్నం తినమని పిలువలేదు. ఆకలితో నకనక లాడుతూ, దీనంగా వుండిన ఆయన్ను చూచినపుడు నా మనస్సు అల్లల్లాడి పోయింది. ఆయన ఆకలికి ఓర్చుకో గలిగాడు గాని, నేను మా అమ్మ నిరాదరణను సహించలేక పోయాను. నాకై నేను చొరవ తీసుకొని మా అమ్మతో చెప్పాను; ఆమె ఆయన్ను పిలిచి అన్నం పెట్టింది; నా మనసు శాంతించింది! పదిన ఆడబిడ్డల సహజ పోరు, కనీస మానవత్వాన్ని కూడా ఎట్లా మంట కలుపుతుందో గదా అనిపించింది! సంఘటనను ఈనాటికి నేను మరచిపోలేకున్నాను. ఆయన ప్రభుత్వోద్యోగంలో చేరి తాసిల్దారుగా రిటైరై, కీర్తిశేషుడైనాడు కూడా! రమణయ్య నిజాయితీ పరుడు, నీతి వంతుడు, నిష్కపటి, ఆ అనర్హతల వల్లనే వుత్తచేతులతో, తర్వాత కూడా అవసరం కొద్దీ ఒక కంట్రాక్టరు వద్ద దూరప్రదేశంలో పనిజేయవలసి వచ్చి అనారోగ్యం పాలైనాడు. ఆయనది జాలిగుండె, ఆయనంటే నాకు చెప్పలేని జాలి, గౌరవములు. ఈనాటికి రోజా కొక్కసారైనా మనసులో మెదలు తుంటారు.

కరణాల వీధిలో వుండగా మా యింటి ప్రక్కన శ్రీహరి నాయుడు గారని ఒక అమీనా వుండేవాడు. మితభాషి, శాంతస్వభావి, బహుసంతాన వంతుడు. ఆయనకు అందరూ కూతుళ్లే; ఒకే ఒక కొడుకు, పేరు రామమూర్తి, నా వయస్సే వుంటుంది. మేము అక్కడ వుండగానే ఆ అబ్బాయికి టైఫాయిడ్ జ్వరం వచ్చి చనిపోయాడు. ఒక్క కొడుకు కావడంతో వారి కుటుంబం ఒక శోకసాగరమైంది. అంత మంది పిల్లలుంటే ఆ అబ్బాయి మీదనే మృత్యువు కు ఎందుకు కన్ను పడాలి? దేవుడనే వానికి అంత అసూయ ఎందు కుండాలి? సమాధానం దొరకని శేష ప్రశ్నలివి. శ్రీహరి నాయుడు హరనాథ భక్తుడు; కరణాల వీధి నుండి ఎప్పుడు ఎందువల్ల నివాసం మార్చాడో గాని, ప్రస్తుతం హరనాథ పురంగా పిలువబడే చోట మొదటి ఇల్లు ఆయనదే అంటారు; దానికి ఆయనే హరనాథపురంగా నామకరణం చేశాడంటారు. శ్రీహరి నాయుడు పోయాడు; హరనాథ పురం శాశ్వతమై విస్తరించి పోతున్నది!

ప్రస్తుతం గాంధీ విగ్రహం సమీపంలో, స్వతంత్ర పార్కు పడమర చివరన వున్న వెంగళరావు షాపుల కాంప్లెక్సు స్థలంలో ఒక కాల్వ వుండేది. బహుశా దాని పేరు మల్లపు కాల్వ. ఆ కాల్వ గట్టున గంగిరేగు చెట్ల వరుస వుండేవి. వాటికెదురుగా రోడ్డుకు పడమరగా యునైటెడ్ బస్ సర్వీస్ ఆఫీసు, షెడ్డు వుండేది. ఆ బస్సులన్నీ గంగిరేగు చెట్ల క్రింద వుండేవి. ఆ రోజుల్లో యు.బి.ఎస్. (U.B.S) నెల్లూరులో ప్రధానమైన మోటారు రవాణా సంస్థ. రంగనాయకుల పేటలో ఆండాళ్ బస్ సర్వీస్ పేరిట మరో బస్ సంస్థ వుండేది. నజీరియా



రాపూరులో విద్యాభ్యాసం చేస్తున్నప్పుడు తోటి విద్యార్థులతో కలసి తీయించుకున్న ఫోటో

(కుడి చివర )





బస్ సర్వీస్ అప్పటికి అసలు వుండినదో లేదో తెలియదు యు.బి.ఎస్. (U.B.S.) ఆండాళ్ సర్వీసులు అదృశ్యమై, అవన్నీ నజీరియా హస్తగతమై మహబూబ్ ఖాన్‌ను నెల్లూరులో గుత్త బస్ యజమానిగా వెలుగులోకి తెచ్చాయేమోనని జ్ఞాపకం. ఇందిరా భవన్ రోడ్డు (క్రొత్తహాలు రోడ్డు) ఇప్పుడు చిన్ని ఇంటర్నేషనల్ హోటల్ వున్న చోట పాడుబడ్డ రైస్ మిల్లు ఒకటి వుండేది. ఆ శిథిలాలు అన్ని రకాల వ్యసనాల వారికి నిలయం. చిన్న పిల్లలకు ఆ పాడు బడ్డ రైస మిల్లు అంటే భయం. మా అన్న అక్కడ చీట్లాడే వాడు. అక్కడ దయ్యం వుంది, రావద్దు అని ఆయన నాతో ఒకసారి చెప్పాడు. మా అమ్మ ఆయన ఎక్కడున్నాడో వెతికి తీసుక రమ్మన్నది. పోవడానికి భయం; పోక తప్పలేదు. బిత్తర బిత్తర గానే పోయాను. వుండినాడు; కాని లేడని చెప్పమంటూ నా చేతిలో కాణీయో, అర్ధణో పెట్టాడు. సంబరం కలిగింది. మా అన్న వద్ద డబ్బులేమో తీసుకున్నాను; మా అమ్మతో ఫలాని చోట వున్నాడు. రాలేదు అని చెప్పాను. తరువాత ఏమైందో నాకు తెలియదు.

ఆ భూత శిథిలాల నుండి ఇంటికి తిరిగి వచ్చేటప్పుడు యు.బి.ఎస్. బస్సులుండే గంగిరావి చెట్లవద్ద కుక్కలు కొట్లాడుకుంటూ నా మీద పడ్డాయి. ఒక కుక్క పన్నే, గోళ్లో నాకు గుచ్చుకుంది. అది కుక్క పన్ను గాటని, విషమని భావించి మా చిన్నాయన రామానాయుడు గారు పెద్దాసుపత్రిలో ఇంజక్షన్‌లు వేయించుకోమన్నాడు. పెద్దాసుపత్రి అంటే సంతపేట రోడ్డు పడమటి చిట్ట చివర, మునిసిపల్ ఆఫీసు ఆనుకొని పెన్నగట్టున వుండేది. ఆస్పత్రే ఆ వైపు టవున్‌కు హద్దు. మేముండిన కరణాల వీధి నుండి అక్కడకు కనీసం రెండు మైళ్లు వుంటుంది. నడిచి పోవాలి, నడిచి రావాలి. మంచి ఎండ, అప్పుడు రిక్షాలు లేవు. జట్కాలు, ఒంటెద్దు బండ్లు తప్ప టవున్‌లో మరొక రవాణా సౌకర్యం లేదు. జట్కాకు బాడుగ ఎవరిస్తారు? అందువల్ల ఆచారివీధి, శిఖరం వారి వీధి, చిన్నబజారు, గిడ్డంగి వీధి గుండా హాస్పిటల్ రోడ్డుకు చేరి అక్కడకు చేరడం అడ్డదారి. నేను, నాకు తోడు మా పిన్నమ్మ కుమారుడున్నాడే – ఆ పార్లపల్లి వెంకట రమణయ్య 14 రోజులు పెద్దాస్పత్రి కొలువు చేశాము. కుక్క మందు ఇంజక్షన్ సిరంజీ, సూది చూస్తేనే భయమేసేది. బొడ్డు దగ్గర పొట్టమీద ఒక రోజు ఇటు, ఒక రోజు అటు చేసేవారు. ఇప్పుడు గొడ్డుకు చేసే సూది కూడా అంత మొరటుగా వుండదు. ఇంజక్షన్ చేయించుకొని నడిచి ఇంటికి రావడం మహా బాధాకరంగా వుండేది

కుక్క కాటుకు ఆ రోజుల్లో కఠిన పథ్యం, ఇంట్లో మా అమ్మ పథ్యాన్ని ఖచ్చితంగా అమలు జరిపేది. నూనె, ఆవాలు వగైరాలు నిషేధం. మేము ఆస్పత్రి నుండి తిరిగి వచ్చేటప్పుడు గిడ్డంగి వీధిలో చిరుతిండి పదార్థాలు అమ్మే బండి వుండేది. నా తోటి వచ్చే మా సోదరుడు రమణయ్య వద్ద ఎప్పుడో డబ్బులుండేవి. తల్లిలేని బిడ్డ కాబట్టి ఆయన తండ్రి పుష్కలంగా ఇచ్చేవాడు. నా వద్ద చిల్లిగవ్వ వుండేది కాదు. ఆయన ఆ బండిలోని పదార్థాలలో పులిహోరా కొని ఇచ్చేవాడు. ఇద్దరం తిని, వీధి కుళాయిలో నీళ్లు త్రాగి ఇంటికి చేరే వాళ్లం. ఇంట్లో పథ్యం; వీధిలో స్వేచ్ఛ అన్నమాట!

నాకు చిన్నతనంలో ఎప్పుడూ మా పిన తల్లి వూరు పార్లపల్లెలో కుక్కకరిచింది. ఎడమ చెయ్యి మోచేతి వద్ద లోపలి వైపు. రెండు పళ్లు లోతుగా దిగబడినట్లున్నాయి. ఇప్పటికి ఆ గుచ్చులు నా చేతికున్నాయి. అప్పుడు ఇంజక్షన్లు గింజక్షన్లు వున్నట్లు లేదు. నల్లేరు నలగగొట్టి చిండబ్బు గాయం మీద పెట్టి దాని పైన నల్లేరు వుంచి కట్టుకట్టేవారు. మానిపోయేది. అప్పుడు ఆ నాటు వైద్యంతో నయమయ్యేది. ఇప్పుడు 14 బదులు 7 ఇంజక్షన్లు; అదీ ప్రభుత్వ ఆస్పత్రిలో కాక ప్రైవేటు డాక్టర్ల వద్ద కూడా చేయించుకునే వెసలు బాటు వుంది. ఆ వైద్యం ఇటీవల మరీ నవ నాగరికమైంది. మన దేశంలో తయారయ్యే వాక్సిన్ సరిగా పని చేయడం లేదని, పది పన్నెండు వందల రూపాయల వ్యయంతో విదేశాల నుండి దిగుమతైన మందు వాడుతున్నారు. పేదవారికి ప్రభుత్వ ఆస్పత్రిలో సాదా కుక్క మందుకు కూడా గతి వుండడం లేదు; కలిగిన వారికి ఇంపోర్టెడ్ వాక్సిన్! నల్లేరు వైద్యంతో బ్రతికున్న వారు వున్నారు; వేలు ఖర్చు పెట్టుకున్న వారు పోతున్నారు. అంటే ఆయుస్సున్న వారు చిట్కా వైద్యాలతో నిక్షేపంగా వుంటున్నారు; లేని వారు క్షణంలో పోతున్నారు. పేదవారి ప్రాణం మొండిది; సంపన్నుల ప్రాణం అతి సున్నితం అన్నమాట!

పాత పెద్దాసుపత్రి భవనం ఆస్పత్రిగా కట్టింది కాదు. మునిసిపాలిటీకి సంబంధించి మరేదో వుపయోగానికి కట్టబడింది. ఏటి గాలి, చెట్ల నీడ ఆ ప్రాంగణ మంతా చల్లగా వుండేది. వార్డులలో ఫ్యాన్లు కూడా అవసరం లేదన్నట్లుగా వుండేవి. ఆ పాత భవనం అప్పటి జనాభాకు సరిపోయేదేమో! అక్కడే డి.ఎం.ఓ. ఆఫీసుకూడా. మిద్దె మీద ఆఫీసు. డి.ఎం.ఓ. అంటె ఆ రోజుల్లో జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులన్నింటికి అధిపతి; పెద్దాస్పత్రికి సూపరింటెండెంటు. అందువల్ల డి.ఎం.ఓ. రోజూ విజిట్స్‌కు వచ్చే వారు కాదు; వారానికో, పది రోజులకో వచ్చేవారు. ఆయన వార్డులకు వస్తున్నాడంటె సిబ్బందికి భయం; పారిశుధ్యం మొదలు అన్నీ సక్రమంగా వుండేటట్లు జాగ్రత్త పడేవారు. ఇప్పుడు సిబ్బందికి సూపరింటెండెంటు కాదు





కదా. సాక్ష్యాత్తూ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వస్తాడన్నా లక్ష్యం లేదు. కాలం మనుషుల మానసాలలో తెచ్చిన చెడు మార్పు ఇది! ఆస్పత్రిలో రోగులకు మంచి ఆహారం ఇచ్చేవారు. ఇప్పటి వలె బూజు పట్టిన రొట్టె కాదు. ఘుమఘుమ లాడుతూ తినాలనిపించేది. రొట్టెలోకి బూరా చక్కెర పెట్టేవారు. నీళ్ల పాలు కాదు. చిక్కని పాలు. ఆస్పత్రికి పాలు సరఫరా చేసేవారు తమ ఆవులను గాని, బర్రెలను గాని ఆస్పత్రి వద్దకు తోలుకొని వచ్చి. ఒక హెడ్ నర్సు సమక్షంలో పిండి పోసి పోవాలి. దానికిగా ప్రత్యేకంగా ఒక పెద్దు కూడా వుండేది. కొల్తలలో మోసం వుండవచ్చునేమో గాని. నీళ్లు కలిపే వారు కారేమోనని నా అభిప్రాయం. అన్నము, కూరలు కూడా కొందరురోగులకు పెట్టేవారు. అప్పుడూ విమర్శలు లేకుండా పోయేవి కాదు. ఆస్పత్రి మందులు అమ్ముకున్నారనే మాట మాత్రం వినబడేది కాదు. పెద్దాసుపత్రిలో ప్రభుత్వ డాక్టర్లే గాక, టవున్‌లోని సీనియర్ ప్రైవేటు డాక్టర్లు కూడా వచ్చి తమకు కేటాయించిన వార్డులలోని రోగులను చూచి. చికిత్స సూచించి పోయేవారు. కుబేర్ సింగ్, కొండూరు రామకృష్ణ మూర్తి, అల్లాడి అనంత నారాయణ వగైరా డాక్టర్లందరూ ఆస్పత్రి డాక్టర్లుగా వ్యవహరించేవారు. నా కుక్క కాటుతో ప్రారంభమైన ఈ అంశం ఇప్పటికే నిడివై పోయింది.

* * *

నన్ను నెల్లూరు నుండి రాపూరుకు బదిలీ చేశారు మా చిన్నాయన రామానాయుడు గారు. అప్పటికి మా అన్నకు కరణీకం వుద్యోగం వచ్చి. మా కుటుంబం పొట్లపూడికి పోయి వుండాలి. అందు వల్ల వుంటుంది నా బదిలీ. రాపూరులో మా మేనమామ కుమార్తె జయలక్ష్మి వుంది; పెనుబల్లి చెంచు వెంకట సుబ్బయ్య గారి భార్య. భార్యా భర్తలు, ఆయన సోదరి— ఆమె పెద తల్లి, ఆమె తల్లి – నలుగురుండే కుటుంబం అది. ఆయనకు సేద్యం వుండేది. పైగా ఏపూరు కరణీకం. నేను అక్కడుండిన ప్రాథమికోన్నత పాఠశాలలో 5 వ తరగతి చేరాను. 6, 7 తరగతులు కూడా అక్కడే. అంటే మూడేళ్ల పాటు రాపూరులో మకాం అన్నమాట.

స్కూల్లో చదువు ఒక ఎత్తైతే ఇంట్లో జయలక్ష్మి గారి బోధన శిక్షణ మరో ఎత్తు. ఆమెకు అనారోగ్యం. నెల్లూరు, మద్రాసు డాక్టర్లందరికీ చూపించి ప్రయోజనం లేక ఆరోగ్యం కుదుట పడుతుందనే ఆశ వదలి పెట్టి వూరిలోనే వుంటుండీనది. ప్రఖ్యాత ఆయుర్వేద వైద్యుడు ఆచంట లక్ష్మీపతి గారి మందులు కూడా సేవించింది. అన్నం తింటే ఇందేది కాదు కాబట్టి, ఆవు పాల కాఫీ ఆహారం మీదనే ఆధార పడి వుండేది. ఆమె లలితోపాస కురాలు; పూజలు పురస్కారాలు ఎక్కువ. భూత వైద్యుల మీద కూడా నమ్మకం ఎక్కువే ననుకుంటాను. ఆమె బడి ముఖం చూడలేదు. అయ్యవారి వద్ద చదువుకోలేదు. పూర్వ జన్మ సుకృతమో ఏమో స్వయంకృషితో పండితురాలైంది. సహజ కవయిత్రి, అఖండమైన ప్రజ్ఞ, అసాధారణమైన పట్టుదల, అసాధారణమైన ఆత్మవిశ్వాసం, మనస్థైర్యం, రెప్పపాటు కాలాన్ని కూడా వృధా పుచ్చకుండడం, స్వతంత్రత, వ్యక్తిత్వం ఆమెలోనే చూడాలి. నిరాహారం, వూపిరాడని వుబ్బసంతో దేహం శుష్కించి పోయినా, కుటుంబ పరిస్థితులు దయనీయంగా పరిణమించినా, మనశ్శాంతి లోపించినా తుది శ్వాస వరకు – 1979లో కన్ను మూసే వరకు– ఆమె లోని విశ్వాసం సడలలేదు, అధైర్యం చోటు చేసుకోలేదు. దేవుడా మనిషా అనిపించేది.

ఆమెకు భారత భాగవతాది మహాకావ్యాలు, ప్రబంధాలు, శతకాలు సకలం ఆమె నాలుక మీద వుండేవి. శబ్దరత్నాకరం అధ్యయనం చేసి, ఆయుర్వేద వైద్య పరిజ్ఞానాన్ని సైతం పొందింది. ప్రమాణంగా ఏదో ఒక పద్యమో, శ్లోకమో వుదహరించ కుండా మాట మాట్లాడేది కాదు. ఎప్పుడూ నలుగురు పిల్లలకు చదువు చెప్తుండేది. ఆమెకు మాట్లాడే సరస్వతి అంటే అత్యుక్తిగా వుంటుందేమో గాని. నా అభిప్రాయంలో అది సహజోక్తే.

పగలంతా స్కూలుకు పోవాలి; అంగడికి అనేక సార్లు తిరగాలి; ఇడుగు దొడుగుగా ఇంటి పనులు చేయాలి; నీళ్లు చేది పోయడం, అంట్లు తోమడం; సెలవు రోజుల్లో సేద్యపు మందటకం పోవడం; వేకువున, రాత్రి తెనుగు చదువుకోవడం – మరొక ఆలోచనకు పోకుండా ఆస్కారం లేకుండా రోజు గడిచి పోయేది; ఎంత ఎక్కువగా పనో, అంత ఎక్కువగా తిండి కూడా! మరచాను – ఒక్కోసారి పశువులను మంద వుండే స్థలానికి చేర్చి రావడం, సాయంత్రం ఇంటికి తోలుకొని వచ్చి కట్టేయడం కూడా చేయవలసి వచ్చేది. ఏ పని చేయాలన్నా అభిజాత్యం లేక పోవడం, శ్రమ విలువ ఆ చిన్న వయస్సులోనే తెలియ రావడం నా అదృష్టమే ననుకుంటాను. నేటి నా నిరాడంబర జీవితానికి పునాది అక్కడే పడింది. వేకువన లేవాలి; భారతమో, భాగవతమో, మరొకటో చదువుతుంటే ఆమె అర్థం చెప్తుండేది. మనుచరిత్రలోని పెద్ద వచన భాగాన్ని కూడా కంఠస్థం చేసి అప్పజెప్పవలసి వచ్చేది. "అది మాతుంగ లవంగ తుండ......." అంటూ అటవీకర నాను గూర్చి మనచరిత్రలోని వచనం చదవాలంటే నోరు తిరిగేది కాదు. సంస్కృత భూయిష్ఠమైన దీర్ఘమైన వద్దుసమపాలతో కూడిన పద్య గద్యాలు చదవ గలిగిన వయస్సా అది? అయినా తప్పేది కాదు. అమరం శ్లోకాలు నోటికి వచ్చేవి. సుమతి శతకం సరేసరి అనుకొంటె; దాశరథి శతకం వంటి శతకాలు కూడా ఆమె కంఠస్థం చేయించింది. అర్థం తెలియక





పోవడమే కాదు, చదవడం కూడా రాదు. కష్టంగానే వుండేది! అంతే కాదు పగలంతా బడి, ఇతర పనులు చేసి, రాత్రి – వేకువ గంటల పర్యంతం పఠనం అంటే ప్రాణానికొచ్చేది! ఆమె కఠినంగా మాట్లాడేది కాదు; సౌమ్యంగానే వ్యవహరించి, చదువులో చాచే ఆ చిన్న వయస్సులో, ఆ వూహ తక్కువైన వయస్సులో, ఆ గ్రంథాల ప్రాధాన్యత విలువ తెలియని వయస్సులో మూడేళ్లలో నాకు అంత చదువు నూరి పోసింది ఆమె; ఆసక్తి అభిరుచి కల్గించింది. ఆనాడు ఆమె వద్ద గారని మరొక ఉపాధ్యాయుడు. బహుశా బి.ఎ.బి.ఇడి., ఆ స్కూలుకు ఈయనొక్కడె ననుకుంటాను. మనిషి పొట్టి, ఖద్దరు వేసుకునే వాడు. బడికివచ్చి నాలుగక్షరాలు చెప్పి, స్పృహన్ముఖంతో గంట కోసం ఎదురు చూచే అధ్యాపకుల వంటివాడు కాదు శ్రీ శేషగిరి రావు. చక్కని విద్యాబోధనే కాకుం విద్యేతర కార్యకలాపాలతో కూడా విద్యార్థులను నిమగ్నం చేసేవాడు. జాగ్రఫీ వంటి సబ్జెక్టులు శాశ్వతంగా తలలో నిల్చిపోయే టట్లుండేది ఆయన బోధన. విద్యార్థుల చేత పెద్ద సైజులో మీదకు పోయే వారందరికి అదే నీటి ఆధారం. శేషగిరి రావు గారు ఒక సారి స్కౌట్లను ఆ కొండ మీదకు తీసుక పోయారు. కొండ మీదకు కాలిబాట, చుట్టూ అడవి, ఆ అడవుల్లో చిరుత పులులుంటాయని చెప్పేవారు. నేనూ పోయాను, ఆ వుత్సాహంలో ఎత్తు, అడవులు, పులుల భయం మనసుకే రాలేదు. కొండ క్రింద అడవిలో రేగు వంటి పండ్ల చెట్లు ఎక్కువిగా వుండేవి. స్కౌట్లు స్వేచ్ఛగా ఆ చెట్ల మీద పడి ఓపికున్నంత వరకు తిని, జేబులో పట్టేంత వరకు నింపుకున్నాము.

# నాకు తల్లీ తండ్రి గురువు దైవం నా సర్వం 'జమీన్‌రైతే'!

**(1980 స్వర్ణోత్సవ సంచిక నుంచి పునర్ముద్రితం)**

చదువుకున్న తెనుగు తప్ప, తర్వాత అంత సాధన ఎరుగను– తెలుగులో ఈనాడు ఈ నాలుగు మాటలు వ్రాయగలు తున్నానంటే ఆ మహాతల్లి చలువే. నా విద్యా బుద్ధులకు పునాదియైన శ్రీమతి జయలక్ష్మమ్మ నాకు ప్రాతః కరణీయురాలు.

ఇక బడి సంగతి: సుబ్రహ్మణ్యం గారని ఒక సాధు స్వభావి, గట్టిగా మాట్లాడలేని సౌమ్యుడు, పిల్లలో బెట్టు కల్గించుకోలేని అశక్తుడు హెడ్మాస్టరు. అనంతయ్య గారు మరో టీచరు. సన్నగా చెలాకీగా ముఖంలోనే కరకుదనం, సమర్థత ప్రతి బింబించే టీచరు ఒకరుండేవారు. పేరు సుబ్రహ్మణ్యం గారిదైనా ప్రధాన నోపాధ్యాయుడు అనంతయ్యగారనీ విద్యార్థు లనుకునేవారు. శేషగిరి రావు మ్యాపులు గీయించేవాడు; అట్లాస్‌లో వున్నట్లు రంగులు వేయించేవాడు. నేను గీచిన మ్యాపులు రెండు మూడు అన్నిటికంటే బాగున్నాయని వాటిని స్కూల్లో గోడకు తగిలించాడు. వ్యాసరచన, వక్తృత్వం, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఆయన కొత్తగా ప్రవేశ పెట్టాడు. అన్నిటికంటే ఎన్న దగింది. సంఘ సేవ పట్ల అనురక్తి కల్గించడం శేషగిరి రావు గారు స్కూల్లో స్కౌట్ సంఘాన్ని ఏర్పాటు చేశాడు; వారి చేత స్కౌట్ యూనిఫారం వగైరాలు సమకూరే టట్లు చేశారు. రాపూరు సమీపంలో మాసుంసాహెబ్ కొండ ఒకటుండేది. అక్కడొక దర్గా, ప్రతి బేస్తవారం ప్రార్థనలు వుండేవి. ఆ కొండలోని ఒక బిలంలో స్వచ్ఛమైన మంచి నీరు వూరుతుండేవి. ఆ కొండ రాపూరులో ముస్లింలు అధికంగా వున్నారు; అక్కడొక కోట కూడా వుంది. అక్కడ పీర్ల పండుగ చాలా వేడుకగా జరిగేది. జనాన్ని ఎక్కువగా ఆకర్షించేది. ఆ పండుగలో ప్రజల సేవకు శేషగిరి రావు గారు మా స్కౌట్లను వినియోగించే వారు. స్కౌటుగా పోయానో, లేక మా బంధువులతో పోయానో గాని 1938 లో అనుకుంటాను పెంచలుకోన సందర్శించాను. మూడు కొండల మధ్య వున్న ఆ క్షేత్రాన్ని మరలా చూచే అవకాశం ఈనాటికీ కలుగలేదు. చదువు, సంఘసేవ పట్ల కూడా అభిరుచి కల్గించిన శేషగిరి రావు గారంటే నాకు చాలా గౌరవంగా వుండేది. నేను జమీన్‌రైతు సంపాదకుడుగా వున్నప్పుడు హై స్కూలు





హెడ్మాస్టరుగా శేషగిరి రావు నా వద్దకు వచ్చారు. దీర్ఘ కాలం తర్వాత ఒక ఆత్మీయుణ్ణి కలుసు కొన్నంత సంబరం కలిగింది. సంక్షిప్తంగా రాపూరులో నా పాఠశాల జీవితం ఇదీ!

రాపూరులో నాకు ఎందరో స్నేహితులుండేవారు. పేదవారు, పెద్ద రైతు కుటుంబాల వారు కూడా వుండేవారు. నాకు చిన్న పెద్ద అనే తేడా అప్పుడూ లేదు, ఇప్పుడూ లేదు. మేము కొందరం విద్యార్థులం ఒక టీచరు వద్దకు ట్యూషన్‌కు పోయేవారం. మాకు రెండు గ్రూపులు, దాయాదులైన ఏటూరు శంకర రెడ్డి, ఏటూరు కృష్ణారెడ్డి వేర్వేరు గ్రూపుల్లో వుండేవారు. కృష్ణారెడ్డిది కాస్త దుడుకు స్వభావం, శంకర రెడ్డి వుపాయశాలి. నేను శంకర రెడ్డి ఒక పక్షం. ఒక రోజు ట్యూషన్ నుండి తిరిగి వచ్చేటప్పుడు ఏదో తగాదా పడి కృష్ణారెడ్డి నా మీద చెయ్యి చేసుకున్నాడు. నా చేతిలో సిరాబుడ్డి వుండినది. మూత లేనందు వల్ల వ్రేలు అడ్డంపెట్టి వుండినాను. కృష్ణారెడ్డిని నేను తిరిగి కొట్టకుండా సిరాబుడ్డికి వున్న వ్రేలు తీసివేశాను; సిరాతో ముద్దయి పోయాడు. పాపం, మంచి శిల్కు చొక్కా వేసుకొని వుండినాడు; పాడైపోయింది. తర్వాత తగాదాలు పరోక్షంగా సాగేవి. నేను ఒక అరటావు తెల్లకాగితాన్ని మడచి నాలుగు పేజీలు చేసి, వార్తా పత్రికలో వలె పేజీని కాలంలుగా విభజించి నా అమిత్రుడైన కృష్ణారెడ్డి వంటి సహపాఠుల మీద ధ్వజమెత్తుతూ వ్రాసేవాణ్ణి. ఆ వ్రాత పత్రికకు నేను ఏదో పేరు కూడా పెట్టుకున్నట్లు గుర్తు. జర్నలిజం అంశ నాలో ఆ చిన్నతనంలోనే వుండి రాపూరులోనే బీజం పడిందేమో ననడానికి ఈ సంఘటనను వివరించ వలసి వచ్చింది. నేను రాపూరుకు చేరిన రోజు 1937 ఎన్నికల పోలింగు దినం; 1939 లో రాపూరును వదిలాను. అప్పటికి జమీన్‌రైతు వుద్యోగిగా వుండిన మా అక్క భర్త తూపిలి పార్థసారధి గారిని నా తోటి రాపూరుకు తోడుగా పంపాడు మా చిన్నాయన.

* * *

నా హై స్కూలు చదువు గూడూరులో ప్రారంభమైంది. జమీన్‌రైతు గుమాస్తాగా వుండిన పార్థసారధిగారు నేను హై స్కూలులో ప్రవేశించే సమయానికి మా అక్క భర్త అయ్యాడు. ఆయన స్వగ్రామం గూడూరు. అక్కడ ఆయన తల్లి తమ్ముడు వుండినారు. మా చిన్నాయన తెలివి గలవాడు కదా. నేను తనకు భారం కాకుండా సారధి గారి ఎదాన తోశాడు. మా అన్న అప్పటికి పొట్లపూడి కరణంగా వుండినాడు; బాగా సంపాయించేవాడు. న్యాయంగా నా బాధ్యతా ఆయన వహించి వుండ వలసింది. ఆయన లోకం ఆయనది; ఆయన సొసైటీ ఆయనది; అటువంటి వాడు ఇటువంటి బాధ్యతలు ఎట్లా నిర్వహించ గలుగుతాడు? సారధి గారు అప్పుడు నెల్లూరులో వుండేవాడు; తర్వాత మా అక్కతోటి కాపురం గూడూరుకు వచ్చి, గూడూరు పంచాయితీ యూనియన్ బోర్డులో గుమాస్తాగా చేరాడు. అప్పుడు మేజర్ పంచాయితీల కంటే పెద్ద వాటిని యూనియన్ బోర్డు అనేవారేమో. గుమాస్తాగా చేరాడు. నా భోజనాదికాలు వాళ్ల ఇంటిలోనే.

అప్పుడు జిల్లా బోర్డు హై స్కూళ్లలో కొత్తగా చేరేవారికి ప్రవేశ పరీక్షలుండేవి– ఫస్టు ఫారం నుండి నాల్గవ ఫారం వరకు పరీక్షలు నిర్వహించేవారు. నేను రాపూరులో ఏడవ తరగతి పాస్ అయివుండినాను. హై స్కూలులో మూడవ ఫారం పరీక్షకు కూర్చొని వుండవచ్చు. రాపూరు చదువు వల్ల నాకు ఫోర్తు ఫారం ప్రవేశానికి కూడా స్టాండర్డు వుందని, ఆ పరీక్షకు కూర్చో వలసిందిగా చాలా మంది ప్రోత్సహించారు. కాని నేను స్వతంత్రుణ్ణి కాదు కదా; సారధి గారు నన్ను మూడవ ఫారంలో కాకుండా పునాది వుంటుందని రెండవ ఫారం పరీక్షకె కూర్చోబెట్టారు. అక్షరాలు వచ్చీరాని వాడు కూడా పాస్ అయ్యే పరిక్ష అది. రెండవ ప్రపంచ యుద్ధము. నా వున్నత విద్యా ప్రారంభం దాదాపు ఒకేసారి తటస్థించాయి.

హై స్కూలు పాత భవనం ప్రక్కన తుంగ కప్పు కలిగిన పెద్ద పూరిల్లు వుండేది. మా క్లాసు అందులో జరిగేది.

*(ఇక్కడితో ఆత్మ కథను అసంపూర్తిగా వదలేశారు శ్రీ రామరామూర్తి గారు. దీనికి క్రిందిస్తున్న రెండు వ్యాసాలు కలిపి చదువుకుంటే ఆయన జీవిత గమనం అర్థమౌతుంది)*

* * *

జమీన్‌రైతుతో నా అనుబంధం నేను 1948లో సహాయ సంపాదకుడుగా చేరినప్పటి నుండేకాదు; నా చిన్న తనంనుండి కూడా పత్రికతో వీడని బంధమే వుంది.


నేనప్పటికి ఐదవ క్లాసులో కూడా చేరలేదు. పొగతోటలో జమీన్‌రైతు ఆఫీసు; అందులో ఒక భాగంలో మా కుటుంబం. అందువల్ల నా కాపురం ప్రొద్దస్తం జమీన్‌రైతే. ఆడుకునే వయస్సు ; అయినా రామా నాయుడుగారు ఒక్క క్షణం ఊరకె వుండనిచ్చేవారుకాదు. ఏదో ఒకపని, శక్తికి తగిన పని చేయాల్సిందే. పనికి ఎరగా ప్రొద్దున్నే అర్ధణా ఇచ్చేవాడు. ఆ ఆకర్షణతో దినమంతా ఆఫీసులోనే కనిపెట్టుకొని వుండే వాణ్ణి. పేపర్లకు అడ్రసులు, బిళ్ళలు అంటించడం మొదలు, పత్రికలు మడవడం వరకు అన్ని పనులూ చేస్తుండేవాణ్ణి. అంతే కాదు శుక్రవారం పత్రికలు తీసుకొని వీధుల్లో అమ్మే వాణ్ణి ; ఎంతో కొంత కమీషన్ ఇచ్చేవాడు . అంతటితో సరిపోదు. బిల్లులు తీసుకొని తిరిగి చందాలు వసూలు చేయాలి. టవున్‌లో నేను తొక్కని జమీన్‌రైతు చందాదారు





గడపలేదంటే అతిశయోక్తికాదు. నాకు బాగా జ్ఞాపకం వుంది కాని, అప్పుడు పిల్లవాణ్ణి కాబట్టి తమ వద్దకు చందాలకు వచ్చిన వాణ్ణి నేనేనని, బహుశా ఇప్పుడు ఒక్కరికి కూడా తెలియదనుకుంటాను. పెద్ద మిషన్‌కాని, ట్రెడిల్‌కాని ఆ రోజుల్లో ఎలక్ట్రిక్ మోటార్లతో పనిచేసేవి కావు. మిషనూ మనిషి తిప్పేవాడు, ట్రెడిలూ మనిషి వేసేవాడు. మిషన్ త్రిప్పడం అందరికీ సాధ్యమైన పనికాదు యానాదులే దానికి పడుకునేవాళ్లు; తెల్లవారి ఆరుగంటలకు ముందే వులిక్కిపడి లేచి స్టిక్కు పట్టుకునేవాళ్లు.

పత్రిక అచ్చయ్యే మిషన్‌కూడా అంతే. రాత్రింబవళ్లు పనిచేస్తుండ వలసిందే. అప్పుడు పత్రిక 16,20,24 పేజీలతో వెలువడేది. 1934, 1937 ఎన్నికల సమయంలో సప్లిమెంటులు, గిప్లిమెంటులు వుండేవి. అంతపని వొత్తిడి వున్నప్పుడు, చేతితో తిప్పే మిషను ఇరవై నాలుగు గంటలు రామానాయుడుగారు చక్రం పట్టుకొని త్రిప్పేవారు. చందా దార్ల అడ్రసులు వ్రాసేవారు; బిళ్లలు అంటించే వారు; వర్కర్లందరితో భాటు కూర్చుని పత్రికలు మడిచేవారు. అప్పుడు కటింగ్ మిషన్లు, ప్రూఫ్ మిషన్లు లేవు. అసలే లేవో, వుండీ కొనలేక జమీన్‌రైతుకే లేవో నాకు తెలియదు. డబుల్ డెమ్మీ సైజుకు వుండే న్యూస్ ప్రింటును మడిచి డెమ్మీ సైజుకు కత్తితో కోయాలి; సమయానికి మనిషి లేనప్పుడు మిషన్



1951 లో నెల్లూరు వచ్చిన గవర్నరుతో, నెల్లూరు జర్నలిస్టులందరూ కలసి తీయించుకున్న ఫోటో. శ్రీరామమూర్తి గారు కుడి వైపు చివర కుర్చీలో వున్నారు

తగినవారు. ఇప్పటివలె ఎనిమిది గంటల పనికాదు, గంట కొట్టడానికి ముందే చేతులు కడుక్కొని పోవడానికి సిద్ధంగా వుండడంకాదు; వర్కర్లు, సిబ్బంది కూడా ఇరవై నాలుగు గంటలూ పనిచేసేవాళ్లు. ఎప్పుడు భోజనం చేసేవాళ్లో, ఎప్పుడు నిద్రపోయేవాళ్లో, ఎన్ని రోజుల కొకసారి ఇంటికి పోయే వాళ్లో చెప్పలేము. నాకు లీలగా జ్ఞాపకం, పట్టలేనంత నిద్ర వచ్చేవరకు పనిచేస్తూ, ఇక నిలబడలేక చింపిరి కాగితాలు (చిరుచాపలుకాదు) పరచుకొని ఆడకుంటే, ఆరోజుల్లో పత్రిక ఎట్లా వచ్చివుండేది? అన్ని సౌకర్యాలు కలిగిన ఈనాటివలె ఆనాడు పత్రిక ఒక గంట కూడా ఆలస్యం అయ్యేది కాదు. వర్కర్లు, సిబ్బంది ఒక్క కుటుంబంగా ఎంత శ్రద్ధా భక్తులతో పనిజేయందే, అది ఎట్లా సాధ్యమో వూహించండి!

మిషన్‌ను యానాదులు షిప్టుల వారీగా త్రిప్పేవారు. యానాది పది నిమిషాలు సేద తీర్చుకోడానికో, బీడి ముక్క కాల్చుకోవడానికో పోతే, ఆ పది నిమిషాలు వృధా పోతుందని, నడుస్తూవుంటే అది ఆగిపోకుండా నాయుడుగారు తానే కాగితాలు కోసి అందించేవారు. ఒక గ్యాలీ కంపోజ్ పూర్తి అయితే, వర్కర్లు వేసి ఇవ్వడం ఆలస్యమవుతుందని, తానే కాగితం తడిపి, ఇంక్ పూసి, ప్రూఫ్ వేసుకొని, చేతితోనే గాలికి ఆరబెట్టుకొని, చూచి ఇచ్చేవారు. ప్రెస్‌లో, ఆఫీసులో, సంపాదక విభాగంలో అన్నిట్లో ఆయన చేయి వుండేది. అందుకే నాయుడుగారనేవారు- సంపాదకుణ్ణి, మేనేజర్ని, గుమాస్తాని, స్వీపర్ను అన్నీ





నేనే అనేవారు. అందులో అతిశయోక్తి ఏమీలేదు. స్వీపరు రాకుంటే, నాయుడుగారే చిమ్మడం నేను చూశాను.

రామానాయుడుగారిది అతి నిరాడంబర జీవితం. ఒక పంచ, ఒక చొక్కా, ఒక తుండుగుడ్డ వుండేవి. స్నానం చేసి, వాటిని తానే వుతుక్కొని, ఆరిన తర్వాత తొడుక్కునేవాడు. ఆయనకు పడుకొనే దానికి మంచపుకుక్కి కూడా వుండేది కాదు; ఒక వెదురు వేళ్ల మంచం, నేలకు ఒక అడుగు ఎత్తున, మనుషులు పడుకోడావడానికి యోగ్యంకానిది ఒకటుండేది. దానిమీద పడకగిడక కూడా వుండేది కాదు. దిండుకూడా వేసుకునేవాడుకాదు. నాయుడుగారి వ్రాతకు టేబిలు కుర్చీ కూడా వుండేవి కావు. చాప, దానిమీద కరణం డెస్కువంటి చిన్న వ్రాతబల్ల మాత్రం వుండేవి. తన స్వంత సుఖానికయ్యే వ్యయం పత్రికకే పెట్టాలనేది ఆయన ఆకాంక్ష;అందుకోసం కఠినమైన జీవితం అనుభవించేవాడు. ఆయన అవివాహితుడు. ఒక్కడే రూములో వుండేవాడు; అది ఆఫీసుకు కాస్త దూరంగా వుండేది, ఒక వైపు జమీన్‌దార్ల భయం, ఇంకొక వైపు రాజకీయ ద్వేషం, మరొక వైపు నిశిత నిర్మొగమోటపు విమర్శలవల్ల ఏర్పడే ఆగ్రహ ఆవేశాలు... ఇన్ని ప్రతికూలాల మధ్య, అవి మనసులో లేనట్లు, జంకు గొంకు లేకుండా ఒంటరిగానే వుండేవాడు, ఒక సారి మునిలాల్ అనే సర్కిల్ ఇన్‌స్పెక్టరనుకుంటా, ఆయన్ను కొట్టించడం జరిగింది. అట్లనే ఇంకొక సారి డాక్టర్ పుచ్చలపల్లి రామచంద్రారెడ్డి కూడా మర్యాదగా జమీన్‌రైతుకు వచ్చి ఆయనపై దౌర్జన్యం జరిపించాడు. దౌర్జన్యాలు, బెదరింపులు, నోటీసులు, కేసులు... ఆయన ఎన్నిటిని ఎదుర్కోవలసి వచ్చిందో చెప్పలేము. ఇవేవీ ఆయన్ను నిరుత్సాహ పరచలేదు, భయపెట్టలేదు, ఆయన మార్గాన్ని భంగపరచలేదు. నిత్యనూతనోత్సాహంతో, సహజ వచోవిభవంతో, విమర్శనాత్మక చతురోక్తులతో పత్రికను నిండుగా నడిపేవారు.

'జమీన్‌రైతు' పరిస్థితి ఆర్థికంగా దినగండంగానే వుండేది. జీతాల సంగతి దేవుడెరుగు, వర్కర్ల తిండికి, టిఫిన్‌కు కూడా డబ్బులుండేవికావు ; ఏ పూటకాపూటే, ఏపూటకా పూట న్యూస్ ప్రింటు తెచ్చుకోవలసి వచ్చేది. శుక్రవారం వస్తే పత్రికలు పోస్టు చేయడానికి బిళ్లలది ఒక సమస్య; భగవంతుడు సమయానికి ఎవర్ని పంపుతాడా అని ఎదురు చూచిన రోజులు. మా మరుపూరు పిచ్చిరెడ్డిగారనే వారు- శుక్రవారం రామానాయుడికి కనపడాలంటే భయం; నేనుకూడా ముఖం తప్పించేవాణ్ణి అనేవాడాయన. క్షణక్షణం ఒక గండంగా, ప్రతి నిమిషం ఒక సవాల్‌గా పరీక్షగా పత్రికా నిర్వహణ చేయవలసి వచ్చేది రామానాయుడుగారు. ఒక సారి ఒక పెద్ద రాజకీయ నాయకుని తమ్ముడైన రెడ్డిగారివద్ద ముప్పయ్ రూపాయలు చేబదులు తీసుకున్నాడట; అతను పరువుతీశాడని చెప్తుండేవారు రామానాయుడుగారు. అటువంటి ముప్పయిలు ముప్పయ్ వేలయినా రామానాయుగారి రుణం తీర్చుకోలేని కుటుంబీకుడా రెడ్డిగారు.

నాయుడుగారు చందా వసూళ్లకు పల్లెలకు తానే పోయేవాడు; చందాలు వసూలు చేయడం, కొత్త వార్ని చేర్పించడమేకాదు- సందుచూచుకొని పత్రిక వ్రాతకూడా సాగించేవారు. బస్సు రావడం ఆలస్యమైతే, రోడ్లో చెట్టుక్రింద కూర్చొని వ్రాసుకునే వారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థిగా నేను రాపూరులో వున్నాను. ఆయన ఒకసారి వచ్చారు; వేకువన నాలుగు గంటలకు లేచి, క్రింద చాపవేసుకొని, లాంతరు ముందు, పరీక్షకు వెళ్లే స్టూడెంటులాగా వ్రాసుకుంటున్నారు. తాను పల్లెలకు పోయినపుడు అక్కడి పరిస్థితులు, సమస్యలన్నిటిని 'నా సంచార డైరీ' అనే శీర్షిక క్రింద వ్రాస్తుండేవారు. ఇదంతా ఎందుకు వ్రాస్తున్నానంటే, రామానాయుడుగారు ప్రతిక్షణాన్ని, ప్రతి పైన్సు శక్తిని, ప్రతి వనరును జమీన్‌రైతు కోసం ఏవిధంగా వెచ్చించారో పాఠకుల దృష్టికి తేవడానికే.

తానెంత కఠినమైన, క్రమబద్ధమైన జీవితాన్ని గడిపేవారో తనకు సంబంధించినవారు కూడా ఆ విధంగానే వుండాలని రామానాయుడు గారు ఆశించే వారు. ఆయన క్రమశిక్షణ అనుభవించిన వారికే తెలుస్తుంది. తెల్లవారి ఐదుగంటలకే లేవాలి; కాల కృత్యాలు తీర్చుకోవాలి; చన్నీళ్లు స్నానంచేయాలి; ఎవరి గుడ్డలు వారే వుతుక్కోవాలి. ఒక్కటిగాదు ప్రతిదీ అంతే. నా వరకు వచ్చేవరకు ఆ కాఠిన్యం తగ్గినదన్నారు; కాని నాకు ఆ విధంగా అనిపించలేదు. జండా సత్యాగ్రహం రోజులట. మా అన్న ప్రొద్దున్నే స్నానం చేసి, విభూతి పెట్టుకోలేదట; అంతే కర్రతీసుకొని వుతికాడట. దానితో మా అన్న అలిగి కాంగ్రెస్ జండా పట్టుకొని పోలీస్ స్టేషన్ ముందుకు పోయాడట. అరెస్టు చేశారు. ఆ విధమైన క్రమశిక్షణ ఆయనది. నాకు సంబంధించి సాయంకాలంపూట ఆడుకోవడానికి కూడా అవకాశ మిచ్చేవాడుకాడు; తానొచ్చే వరకు ఆఫీసులో వుండమనేవాడు; ఆయన రాత్రి ఏతొమ్మిదికో వచ్చేవాడు. ఈలోగా ఆకలై భోంచేసి వస్తామని పోయానా, ఆ పూట తలవాచి పోయేది. విద్యార్థిగా అరుదుగా కూడా సినిమాకు పోవడానికి లేదు; అందువల్ల మోసానికి పాల్పడ వలసి వచ్చేది. ఒక రోజు రూంలో వున్నామనే భావం కల్గించడానికి లాంతరు తగ్గించకుండా పెట్టి, రెండో ఆటకు నిర్భయంగా బయలుదేరాము; ఇరవై గజాలు పోయామో లేదో, నాయుడు గారు వీధిలో నిల్చొని ఎవరితోనో మాట్లాడుతున్నారు.





చచ్చామనుకోండి. స్కూలు పాఠాలు చదువుకోక పోయినా అడిగేవాడు కాదు; జమీన్‌రైతు ఆఫీసును కనిపెట్టుకొని వుంటే సరి;

నేను 'జమీన్‌రైతు' లో చేరకముందు నుంచి విద్యార్థి దశలో జర్నలిజంలో నాకు శిక్షణ ప్రారంభమైంది. 1946 జూన్ 2తేదిన అప్పడి ఉమ్మడి మద్రాసు రాష్ట్ర మంత్రి వర్గంలో పి.డబ్ల్యూ.డి మంత్రి శ్రీ భక్తవత్సలం పొదలకూరు వద్ద కండ్లేరు బ్రిడ్జికి ప్రారంభోత్సవం జరిపారు, మంత్రులంటే ఈనాడువలెకాదు; ఆనాడు బాగా విలువ వుండేది . మంత్రుల పర్యటనలూ ఈనాటి వలె సలీసు కాదు, బెట్టుగా హుందాగా వుండేవి. ఆనాడు మంత్రి వస్తున్నాడంటే కాంగ్రెస్ పెద్ద లందరూ వెంటవుండేవారు. భక్తవత్సలం గారి కండ్లేరు కార్యక్రమానికి నెల్లూరునుండి కాంగ్రెస్ వాదులతో ఒక ప్రత్యేక బస్సు బయలు దేరింది; రామానాయుడుగారు నన్నూ తనతోటి ఆ బస్సులో తీసుకపోయారు. నేను హాజరైన, రిపోర్టింగ్ చేసిన మొట్టమొదటి సభ అది. నేనూ, ఆయనా ఇద్దరం సభ వివరాలు వ్రాసుకున్నాము. నన్ను రిపోర్టు వ్రాసివ్వమన్నారు; ఈ విధంగా వుండాల అని దాన్ని సవరించి వ్రాసి ఇచ్చారు. అప్పటి నుండి చాలా కార్యక్రమాలకు తీసుక పోయేవారు. ముఖ్యమంత్రిగా ప్రకాశం పంతులుగారు వెంకటగిరికి వస్తుంటే, నన్నూ తీసుకెళ్లారు. ఆ సభలో రామానాయుడు గారు కూడా ఉపన్యసించారు. జమీన్‌రైతు ప్రబోధపు పాటలతో మేళవించిన ఆయన ప్రసంగాన్ని మొదటిసారిగా నేను అప్పుడే విన్నాను. ఆవేశము, ఉద్రేకంతో ఆయన వణికిపోయేవాడు. రాష్ట్ర జమీన్‌రైతు సంఘ సమావేశాలకు కూడా నన్ను తీసుకపోయేవాడు. రిపోర్టింగ్ కోసమేకాదు, ఆ సమస్యలు నాకు అవగతం కావా .ని, వ్యక్తుల పట్ల తన వైఖరిని నేను గ్రహించ గలగాలని ఆయన ఉద్దే ం. ఆయన ఒకటి రెండ సార్లు అ ట అన్నారుకూడా. ఈ విధంగా విద్యార్థి దశలోనే నన్ను 'జమీన్‌రైతు'లో ప్రవేశ పెట్టారు; చదువు మధ్యలో నిలిపి వేయిం చి నన్ను దానికి అంకితం చేశారు. డబ్బు దొరుకుతుందికాని, సంస్థలకు తగిన మనుషులు దొరకరని ఆయన దృఢ నమ్మకం. 'జమీన్‌రైతు' శాశ్వతంగా నడవాలనే సంకల్పంతో దాన్ని ఏ విధంగా ట్రస్టుపరం చేశారో, దానికి ఆలంబనంగా నన్ను, సారధిగారిని బాధ్యులను చేశారు; జమీన్‌రైతులో వేరే ఆలోచన రాకుండా బంధించి వేశాడు. అందువల్లనే మాకు జమీన్‌రైతు తప్ప వేరే ప్రపంచం లేకుండాపోయింది.

రామానాయుడుగారు నాకు పిన తండ్రి. కాని జమీన్‌రైతుకు సంబంధించి ఆయన నన్ను ఒక ఉద్యోగిగానే చూచాడు. ఆఫీసుకు రావడం ఐదు నిమిషాలు ఆలస్యమైనా మందలించేవాడు, పనిలో లోపం చేస్తె గట్టిగా అరచేవాడు. ఆఫీసు సిబ్బందిలో నన్నొక సభ్యుణ్ణిగా చూచేవాడేకాని, వ్యక్తిగత సంబంధం ఆయనలో కనపడేదే కాదు. టైము నియముకాదు, పనివుంటె రాత్రింబవళ్లు చేయవలసిందే. కొడుకు అనే మొగమోటం కూడా ఈయనలో లేదే అని ఆశ్చర్యపడేవాణ్ణి.

పత్రికకు సంబంధించి, వ్రాతకు సంబంధించి రామానాయుడుగారు ఎన్నో మెళకువలు చెప్పేవారు. వ్యక్తుల స్వభావాన్ని వివరించేవారు. విమర్శించిన వ్యక్తినిగూర్చి అవకాశ మొచ్చినప్పుడు ఔచిత్య భంగం లేకుండా రెండు మంచిమాటలు వ్రాయాలనేవాడు. ఒకసారి ఒక విషయంలో ఆయన అభిప్రాయంతో నేను ఏకిభవించలేక పోయాను. ఒక బంగారు వ్యాపారి కొత్తగా ఇల్లు కట్టుకొని చేరాడు; ఆ ఇంటిబొమ్మ పత్రికలో వేయమని నాయుడుగారు ఆదేశించారు. నాకు ఇష్టంలేదు. పెళ్లిళ్ల పురాణానికి, పెండ్లి బొమ్మలకే చెడ్డపేరు వుంది; ఇక గృహ ప్రవేశాలు కూడా ప్రారంభించి ఇంకా చెడ్డపేరుకు గురికావడం ఎందుకని నా అభిప్రాయం. కాని ఆయన ఇంకొక విధంగా అభిప్రాయపడ్డారు. ఆ బంగారు వ్యాపారిని గూర్చి తాను ఒకసారి చెడ్డగా వ్రాశాడట; అతను దొంగ బంగారు కొంటాడనే అర్థం వచ్చేటట్లు, సంస్కృత పదాలతో, దుర్భా సుబ్రహ్మణ్యశర్మ గారితో సలహాపడి వ్రాశాడట. ఆ వ్యాపారస్తుడు దానికి కినుక వహించి, పత్రిక మీద పరువు నష్టం దావా వేయడానికి వకీళ్లతో సలహా పడ్డాడట. కానీ దావా వేయలేదు. అప్పుడు మనసు నొప్పించాం కాబట్టి, ఇప్పుడు అతని కొత్త ఇంటి బొమ్మ వేస్తే, అది మరచిపోతాడని ఆయన అభిప్రాయం. విమర్శించవలసి వచ్చినపుడు ఆయనకు వ్యక్తిగత స్నేహ సంబంధాలు, పరిచయాలు అడ్డం వచ్చేవికావు. వ్యక్తిగతంగా ఆయన ఎవరినీ ద్వేషించే వాడు కాదు. విమర్శించ వలసి నపుడు ఎవరినీ వదలేవాడుకాదు. నాకు తెలియకుండా నాలో కూడా అటువంటి స్వభావం చోటు చేసికొన్నదా అనిపిస్తుంటుంది. అయితే ఒకతేడా; తన రచనా చాతుర్యంతో ఆయన విమర్శింపబడే వ్యక్తికూడా నవ్వుకొనేట్లు చేసేవాడు; నాకు ఆ కలం రాలేదు.

నాయుడుగారితో నేను ఏకిభవించలేకపోయిన అంశాలు ఇంకా ఎన్నో వుండేవి; ఒక్కొక్కసారి వాటి విషయంలో ఆయనతో ఘర్షణ పడవలసి వచ్చేది కూడా; పెండ్లికిపోతే కట్నం అడగమనేవాడు; అది నాకు చిన్నతనంగా తోచేది. దానికి బదులు అడ్వర్టయిజుమెంట్లు అడిగి తెస్తాననేవాణ్ణి. అది ఆయనకు కష్టం. అప్పుడు నిర్వహణ బాధ్యత నాకు తెలియుదు; కష్టసుఖాలూ తెలియదు. అందువల్ల పెండ్లికట్నాల వసూలులో



ఆయన అభిప్రాయాన్ని నేను గ్రహించలేక పోయినాననిపిస్తుంది. 'చందాలివ్వని పెద్దలు' శీర్షిక నాకు గిట్టని మరొకటి. చందాదారుణ్ణి న్యూనత పరచాలనేది ఆయన ఉద్దేశ్యంకాదు; దానివల్ల ఇతర చందాదార్లు డబ్బు పంపుతారనేది ఆయన అభిప్రాయం. కాని నేను ఏకీభవించలేక పోయేవాణ్ణి. డబ్బు కట్టిన వారికే పత్రిక పంపడం వుచితమని నా అభిప్రాయం. చిత్ర సమీక్షలకు సంబంధించి కూడా ఆయనతో నాటు అటువంటి పేచీయే.



ఆఫీసులో కూర్చుంటె రాత్రింబవళ్లకు తేడాయే తెలియదు ; ఒక రాత్రి నిమగ్నతతో వ్రాసుకుంటూ పోతుండగా చాటు నుంచి తీసిన ఫోటో.

చిత్రం బాగాలేదు, ఏమి వ్రాయమంటారనే వాణ్ణి. బాగలేనివి వదిలేసి, తక్కినవి వ్రాయమనేవారు. ఈ విధంగా నిత్యవ్యవహారాల్లో అనేకమైన పేచీలు వచ్చేవి. ఆయన మనసుకూ కష్టం కలిగేది. నేనూ బాధపడేవాణ్ణి. ఆయనది అనుభవ పూర్వకమైన వాస్తవిక దృష్టి. నాది అనుభవశూన్యమైన ఆదర్శ ఆకాశ విహార ధోరణి.

నేను సంస్కృతం అభ్యసించడం అవసరమని ఆయన భావించారు; నా కోసం కాదు, జమీన్‌రైతు కోసం. సంస్కృతం చదివితేగాని తెలుగులో చక్కగా వ్రాయలేరని ఆయన అభిప్రాయం. భాషా పాటవం లేకుంటే పత్రిక దెబ్బతింటుందని ఆయన భయం. ఈమాట అనడంలో ఆయన దృష్టిలో శ్రీ మరుపూరు కోదండరామరెడ్డి, ఆయన పత్రిక 'మందాకిని' వుండేవి. నాకు సంస్కృతం నేర్పడానికి వారణాసి సుబ్రహ్మణ్యశాస్త్రి గారిని ఏర్పాటు చేశారు. వేకువనలేచి పాఠం చెప్పించుకోవాలి, ఒకవైపు సంసారం, ఇంకొకవైపు పత్రిక. ఇక సంస్కృతం నేర్చుకోవడానికి వ్యవధీ, ఓపిక ఎక్కడ? రఘువంశం పూర్తి అయ్యేసరికి, నా ఓపికా పూర్తి అయింది. అంతటితో దానికి స్వస్తి జరిగింది. కాని నాయుడుగారు మాత్రం చనిపోయే వరకు అప్పుడప్పుడు ఆ కొరతను ప్రస్తావిస్తూనే వుండేవారు!

రాజకీయ విమర్శకు సంబంధించి కూడా ఒక సారి నామీద కోప్పడ్డారు. విమర్శ,విమర్శ విసురు సూటిగా కాకుండా నర్మగర్భంగా వుండాలని ఆయన అభిప్రాయం. అది నాచేత కాలేదు; ఏదైనా నాది ముక్కుసూటి స్వభావం. ఒక ఎన్నికకు సంబంధించి నా రిపోర్టు ఆయనకు నచ్చలేదు; అడిగారు. దాంతో నేను అలిగి, నాలుగైదు రోజులు ఆఫీసుకు రాలేదు. కాని గురువారం వచ్చేవరకు ఇంటివద్ద వుండలేక పోయాను; పత్రిక పనిలో నిమగ్నం కాక తప్పలేదు. ఆయన పిలిచికాదు; ఆనాటికే జమీన్‌రైతు నాకు అంత విడరానిదై పోయింది. అలిగి రాకుంటే అదేమని అడగలేదు; నాదే తప్పని చెప్పకుండా చెప్పినట్లయింది.

వీటన్నిటికంటే విసుగు కల్గించే పని ఆయన చెప్తుంటే నేను వ్రాయడం. నేను సంపాదక వర్గంలో చేరే సమయానికే ఆయనకు వ్రాసే ఓపిక తగ్గి పోయింది. మరీ ముఖ్యమైన, ఆసక్తికరమైన, ఆలోచనాకరమైన, రచనా శిల్పం అవసరమైనప్పుడు తప్ప. స్వంతంగా వ్రాసుకోగలిగేవారే కాదు. అదీగాక తానివ్వదలచుకున్న మేటరు వ్రాయడానికి చివరి నిమిషంలో కాని ఆయన కూర్చోగలిగేవాడుకాదు. అప్పుడైనా పూర్తిగా ఇవ్వగలిగే వాడుకాదు ; వచ్చిన వారితో మాట్లాడడం వంటి అవరోధం ఏదో ఒకటి ఎదురయ్యేది. తీరా ఆయన ఇచ్చే సమయానికి తగినంత స్థలం వుండేది కాదు. ఇక చూడండి, ఆ చిర్రుబుర్రులు, ఆ చిటపటలు...... చూచితీరాల్సిందే. మేము ఆయనకు చోటు ఎత్తి పెట్టడంలేదని, తన స్వంతానికని ప్రత్యేకంగా రెండు పేజీలు నిలువుగా (సగం డెమ్మీషీటు రెండు పేజీలు)తీసుకునేవారు. అందులో ఒక వైపు నెల్లూరు ముచ్చట్లు, ఇంకొవైపు పెండ్లిండ్లో మరేదైనా మేటరో ఇచ్చేవారు. స్థలం తగ్గి, క్లుప్తంగా వ్రాయవలసి వచ్చినపుడు, నాయుడిగారి కలం మామూలుకంటే వింత సొబగులు రుచులు సమకూర్చగలిగేదనిపిస్తుంది. నాయుడుగారు డిక్టేట్ చేయడానికి కూర్చోవడమంటె అదొక దర్బారు వలె వుండేది. అన్ని ఆలోచనలు, అన్ని పనులు, అందరితో మాట్లాడడం అప్పుడే జరగాలి; ఇక రాత జరిగేదెంది ? నేను మొట్ట మొదట కవికోకిల





దువ్వూరు రామరెడ్డిగారిని చూచింది. వారి సంభాషణను విన్నది ఒక రోజు నాయుడుగారివద్ద కూర్చొని వ్రాస్తున్న ఆ సమయంలోనే! అదీ ఎక్కడను కున్నారు? ఆఫీసు ముందు అరుగుమీద నేను; వీధిలో కుర్చీలో రామానాయుడుగారు. కవికోకిల వచ్చినప్పుడు వీధిలోనే ఆయనకొక కుర్చీ; ఈ విధంగా గంటలో వ్రాయగలిగింది. నాలుగైదు గంటలు పట్టేది. మేటరు చెప్పడానికి ఆయనకు మామూలుగా దొరికే టైము రాత్రి భోంచేసిన తర్వాత, లేదా వుదయం. పని కష్టమైనదికాదుగాని, గంటల పర్యంతంగా వ్రాతగీత లేకుండా, వూరకే కూర్చొనుండడం విసుగు పుట్టించేది. రామానాయుడుగారు మేటరు ఈ విధంగా డిక్టేట్ చేయడం కేవలం స్వంతంగా వ్రాయలేక కాదని, తన వ్రాతలోని నడత నాణ్యతలు నా కబ్బవలెననే వుద్దేశ్యంతోనని తర్వాత నేననుకున్నాను. తర్వాత అనుకొని ఏమి లాభం?

రామానాయుడుగారు 1948 వరకు వున్నంత పటుత్వంగా, చురుకుగా తర్వాతలేరు. ఆ సంవత్సరంలో ఆయన అస్వస్థుడై, మద్రాసు జనరల్ హాస్పిటల్లో వుండి, ఆపరేషనుకు గురికావలసి వచ్చింది. అట్లనే 1954 లో పత్రిక రజతోత్సవ సమయంలో కూడా ఆయన అస్వస్థుడే. పడకమీద వుండే, రజతోత్సవ సంచికను నిర్వహించారు. స్వోత్కర్షేకాదు,తన పత్రికలో తనను గూర్చి ఇంకెవరు వ్రాసినా కూడా వొప్పుకునేవారుకాదు . రజతోత్సవ సంచికకు నన్ను సంపాదకీయం వ్రాయమన్నారు. జమీన్‌రైతు ధ్యేయాన్ని గూర్చి, ఇతర పత్రికలకు దానికివున్న భేదాన్ని గూర్చి ఆయన అనేక సార్లు చెప్పేవారు. ప్రపంచ వార్తలను అన్ని పత్రికలు పల్లెటూరి పాఠకునికి అందిస్తున్నాయి; కాని పల్లె వార్తలను లోకానికి ఎరిగించే పత్రికలు లేవు ; జమీన్‌రైతు ఆ కొరతను తీర్చాలి అనేది ఆయన అభిలాష. ఆ విషయం తెలిసిన నేను సంపాదకీయంలో ఆ ప్రసక్తి తెచ్చి రామానాయుడు గారి పేరు వుల్లేఖించాను. ప్రూఫు తెమ్మన్నారు; అందులో తన పేరు వుండే సరికి ఎగిరిపడ్డారు; నన్ను గూర్చి నా పత్రికలో నువ్వు వ్రాయడమా అన్నారు. సవరించి ప్రకటించవలసివచ్చింది. పత్రిక ఖ్యాతి, అభివృద్ధి తప్ప, తన పేరు ప్రతిష్టలు ఆయనకు పట్టేవికావు.

నిరుద్యోగిగా వున్న వ్యక్తినిచూస్తే నాయుడుగారికి ఎక్కడలేని సానుభూతి. పత్రికకు పనికివచ్చే వాడంటే పోనిచ్చేవాడుకాదు. మనిషిలోని సహజ శక్తి సామర్థ్యాలకు తగిన అవకాశం కల్పించాలనేది ఆయన భిమతం. ఆ విధంగా ఆయన ఎంతో మందిని చేరదీశాడు, ప్రోత్సాహమిచ్చాడు, ప్రేమించాడు. ఆయన వద్ద పనిజేసిన ప్రతి ఒక్కరికీ ఆయన పితృ సమానుడయ్యాడు; అంతటి ప్రేమార్ద్రహృదయం ఆయనది. ఆ విధంగా 1940 కి ముందు పి.వి. సుబ్బారావు మొదలు, తర్వాత చుండి జగన్నాధం, కె.ఎల్.సింహా, పిడూరు కామేశ్వరరావు, అచార్య ఆత్రేయ, కణ్వశ్రీ, ఆమంచర్ల శేషగిరిరావు ప్రభృతులెంతో మంది జమీన్‌రైతుకు సన్నిహితులైనారు. ప్రారంభ రోజుల్లో పి.వి. సుబ్బారావుగారు నాయుడుగారికి కుడి భుజంగా వుండినారు. ఇటు వ్రాత, అటు నిర్వహణ ఆత్మశుద్ధితో చేసినవాడు సుబ్బారావు. ఆయన 1940 సెప్టెంబరులో నిల్చిపోతుంటే నాయుడుగారు ఎంత బాధపడినారో చెప్పలేము; ఆయన్ను బ్రతిమలాడాడు. ఆయన తల్లీ భార్యలచేత వొత్తిడి తెచ్చాడు. కాని ఆయన వినలేదు. జమీన్‌రైతు నుండి నిల్చిపోయిన తర్వాత సుబ్బారావు, స్వతంత్రంగా 'కేసరి' అని పత్రిక పెట్టి కొంతకాలం నడిపాడు. నాయుడుగారి వద్ద ఒకసారి పనిజేసినవారు జీవితాంతం ఆయన్ను మరచిపోరు. పత్రికలో పనిజేసిన వారేకాదు, ఆయనతో ఏదో ఒక సందర్భంలో పరిచయం ఏర్పడితే అటువంటివారిమీద ఆయన ముద్ర చెరగకుండా శాశ్వతంగా వుండేది.

పత్రికా రచయితలు సాధారణంగా అన్ని విషయాలమీద, అన్ని సమస్యలమీద వ్రాయలేరు. ఒక్కొక్కరికి ఒక్కొక్క విషయంమీద అభిరుచి, ఆసక్తి వుంటాయి. ఒక్క విషయాన్నే అధ్యయనం చేస్తారు; దాన్ని గూర్చే వ్రాస్తారు. కాని రామానాయుడు ఆ విధంగాకాదు; ఆయనది బహుముఖ ప్రజ్ఞ. రాజకీయాలను గూర్చి ఎంత చక్కగా చర్చించగలిగేవారో, సినిమాలను గూర్చి అంత రసవంతంగా వ్రాయగలిగేవారు. 'జమీన్‌రైతు'లో ఆయన స్పృశించని విషయం, ఆయన వ్రాయని అంశం వుండేదికాదు. వ్రాయడానికి అందరూ వ్రాస్తారు; కాని నాయుడుగారి వార్త అందరిచేత ఒకటికి రెండుసార్లు చదివించేట్లుగా వుండేది. అది కాదు ప్రత్యేకం; ఏ విషయాన్ని గూర్చి వ్రాసేటప్పుడు దానిపట్ల ఆయన వుత్సాహం అప్పటికప్పుడు కొత్తగా వుండేది. ఆయనలో శారీరకంగా బడలిక కనబడేదికాని, మానసికంగా ఆయనలో యువ్వనోత్సాహం తొణికిసలాడేది. సినిమా ప్రివ్యూ కోసం ఆయన ఓపిగ్గా మద్రాసు పోయివచ్చేవారు; రాత్రి రెండుకాదు, వేకువ నాలుగైనా నాటకాన్ని ఆసాంతం చూసేవారు. చూచి తాను ఆనందించడం కాదు, తన సమీక్షలద్వారా పాఠకులకు రసస్ఫూర్తిని కల్గించేవారు. రాజకీయాలలో కూడా ఆయన వుత్సాహం అంతే. జమీన్‌దారీ, ఇనాందారి సమస్యల విషయంలో ఆయనకు శ్రద్ధాసక్తులు అసాధారణం. ఏ విషయము, ఏ సమస్యకు సంబంధించి అయినా ఆయన దృష్టి , ఆయన ధోరణి, ఆయన రచనా విధానం వేరు. ఆ ప్రత్యేకతే తెలుగు పత్రికాలోకంలో





'జమీన్‌రైతు' కు విశిష్ట స్థానాన్ని చేకూర్చి పెట్టింది.

రామానాయుడుగార్ని గూర్చి వ్రాయను మొదలు పెడితే జ్ఞాపకాల దొంతరలు కదలి వస్తూనే వున్నాయి. తన ఆశయాలను, తన పత్రిక లక్ష్యాలను తన జీవిత కాలంలో నెరవేర్చుకున్న సంకల్ప సిద్ధుడు, అదృష్టవంతుడు రామానాయుడుగారు. ఆయనా, 'జమీన్‌రైతు' రెండు రంగాలలో పోరాటం జరిపారు. ఇటు దేశ స్వాతంత్ర్యం, అటు జమీన్‌దారీరైతు విముక్తి. 1947 లో దేశం స్వతంత్రమైంది; 1948 లో జమీన్‌దారీ రైతుకు విముక్తి లభించింది. స్వతంత్రం వచ్చిన నాటికంటే, జమీన్‌దారీలు రద్దయిన రోజు రామానాయుడుగారు ఎక్కువ ఆనందాన్ని పొందారు. జమీన్‌దారీల రద్దు శాసనమైనప్పుడు 'జమీన్‌రైతు' ప్రత్యేక సంచిక వెలువలసింది ఎందుకనోరాలేదు. బహుశా నాయుడుగారు అనారోగ్యవంతుడు కావడం కారణం కావచ్చు.

రామానాయుడు గారు కాంగ్రెస్‌వాది, దేశభక్తుడు. ఆయన, ఆయన, పత్రిక ఎప్పుడూ బ్రిటిష్ ప్రభుత్వ దృష్టిలో వుండేవి. ఒకటి రెండు సార్లు ఆయన ఇల్లు, జమీన్‌రైతు కార్యాలయం కూడా సోదా చేయబడ్డాయి. నాయుడుగారు చెప్తుండేవారు- ఒకసారి పోలీస్ సోదాచేస్తూ కొండను త్రవ్వి ఎలుకను పట్టినట్టు ఒక కాగితాన్ని పట్టుకొని, తమ కష్టం ఫలించినట్లు సంబరపడి పోయారట. ఏమంటే ఒక పదం మొదటివాక్యంనుండి రెండో వాక్యానికి రావడంలో 'రంగా' అని వుణ్ణిందట. పరామర్శగా చూచుకొని తమ తెలివితక్కువ తనానికి తమనే నిందించుకొని వెళ్ళిపోయారట; నాయుడుగారు ఈ సన్నివేశాన్ని అప్పుడప్పుడు చెప్తుండేవారు. ఏ కాంగ్రెస్ వాదికీ తీసిపోని దేశభక్తుడైన రామానాయుడుగారు ఏనాడూ జైలుకు పోలేదు. ఆయనకు గిట్టని కాంగ్రెస్ వాదులు ఈ విషయంలో ఆయన్ను ఎత్తిపొడిచేవారు. కాని ఆయనకు జైలుకుపోవాలనే సంకల్పం లేక కాదు; ఉత్సాహం లేకకాదు; తాను జైలుకుపోతే తన 'జమీన్‌రైతు' 'నిల్చిపోతుందనే బెంగతోనే ఆయన'దొంగై' తిరిగాడు. ఈమాట ఆయనే చెప్పేవాడు. రామానాయుడుగారికి తనకంటే 'జమీన్‌రైతు' ఎక్కువ కావడమే ఇటువంటి విషయాల్లో ఆయన వెనుకడుగుకు కారణం; జమీన్‌రైతు ఆయనకు సర్వస్వం. అది శాశ్వతము, సుస్థిరము అనే నిశ్చింతతోనే ఆయన 1959 ఫిబ్రవరిలో పరమపదించారు. 'జమీన్‌రైతు' ఆయన గతించిన తర్వాత కూడా నిరాటంకంగా వెలువడుతున్నదంటే ఆయన సంకల్ప బలం, పవిత్ర హృదయం వల్లనేనని వేరుగా చెప్పనవసరంలేదు.

జర్నలిజంలో నాకు గురుతుల్యుడు శ్రీ చండి జగన్నాథం. పత్రికా వ్యాసంగంలో శిక్షణకు రామానాయుడుగారు నన్ను ఆయనకు అప్పగించారు. వార్తలను విషయాలను ఆకళింపు చేసుకోవడం, వాటిని సంక్షిప్తంగా స్వతంత్రంగా స్వంత మాటలలో వ్రాయడం ఆయన శిక్షణలోని ముఖ్యభాగం. అప్పటికి నేనింకా కాలేజి విద్యార్థినే. ఆచార్య కృపలానీ కాంగ్రెస్ అధ్యక్షుడయ్యాడు. ఆయన అధ్యక్షోపన్యాస సారాంశాన్ని వ్రాసివ్వమన్నాడు. నా శక్తికి మించిన పని అది. తల్లక్రిందులు కావలసి వచ్చింది; అయినా వ్రాసి ఇచ్చాను. బహుశా ఇప్పుడు నేను చదివినా, నేనే నవ్వుకోవలసి వస్తుందేమోనని పిస్తుంది. అనుభవంలేదు, విషయ పరిజ్ఞానంలేదు, వ్రాతలో మెళకువలు తెలియదు.. అటువంటి వాణ్ణి కాంగ్రెస్ అధ్యక్షోపన్యాసాన్ని వ్రాసి ఇవ్వమంటే ఎట్లా వుంటుంది చెప్పండి? సంపాదక వర్గంలో పనిజేసేవాళ్లు పాలుమాలితే, వ్రాత ఎంత చెత్తగావున్నా చూడకుండానే కంపోజ్‌కు ఇచ్చివేస్తారు. నా వ్రాతనుకూడా జగన్నాథంగారు ఆవిధంగానే అచ్చువేశారేమోననిపిస్తుంది. లేక, నాకు నిరుత్సాహం కలగకూడదని ఇచ్చినా ఇచ్చివుండవచ్చు. నేనైతే ఇవ్వను.

పత్రికా రచన అనేది నేర్చుకుంటే వచ్చేదికాదు; అందరికి అలవడేదికాదు; అందరూ ఆ వృత్తిని స్వీకరించలేరు కూడా! నా రచనా విధానం జగన్నాథం గారికి నచ్చేదికాదు; ఆయన మార్గాన్ని నేను అనుసరించ గలిగే వాణ్ణి కాదు. కాని జర్నలిజంలో నాకు ఓనమలు, గుణింతాలు దిద్దబెట్టిందిపత్రం జగన్నాథంగారే!

1944 లో నేను ఎస్.ఎస్.ఎల్.సి పరీక్ష వ్రాశాను. జాగ్రఫీ పేపరు కష్టం కాదుకాని టైం చాలలేదు. ఇచ్చిన వ్యవధి 40 నిమిషాలు! ప్రశ్నాపత్రం చదవడానికే ఇరవై నిమిషాలు పట్టింది. తక్కిన ఇరవై నిమిషాల్లో ఎనిమిది పేజీల ప్రశ్నాపత్రాన్ని ఆన్సర్ చేయడం ఎట్లా సాధ్యం? ఆ సంగతి, సహాయ సంపాదకుడుగా పనిచేస్తుండిన శ్రీ కె.ఎల్.సింహాకు చెప్పాను. ఆవిషయం తాను వ్రాసి నాపేరుతో ప్రకటిస్తానన్నాడు. అది నాకు ఇష్టంలేదు. చేతకాక పోయినా నేనే వ్రాశాను. ఆయన సవరించి ప్రకటించాడు. సింహాగారు కూడా నాకు అత్యంత ప్రోత్సాహమిచ్చిన వ్యక్తి. ఆయనలో సీరియస్‌నెస్ తక్కువ. సరదాగా వుండేవాడు. ఒక పేజి మేటరు కావలసినా ఒక్కగంటలోఇవ్వగేలిగేవాడు. అంత వేగంగా, ఏకధాటిగా వ్రాయగలిగేవాడు. 1942 ప్రాంతంలో సింహా, భూపతి కోటీశ్వరరావుగారలు కలసి కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా వ్రాసిన వ్యాసాలు రాష్ట్ర వ్యాపితంగా సంచలనాత్మకంగా వుండినాయని జ్ఞాపకం. సింహా గారు నేను





సంపాదకవర్గంలో చేరిన తర్వాత రెండవసారి 'జమీన్‌రైతు' కొలువుకు వచ్చారు; అయితే కొద్దికాలమే. మొదటి ఉత్సాహం రెండవసారి కనపడలేదు. బహుశా అప్పటికి కమ్యూనిస్టు వ్యతిరేకోద్యమం కాస్త సద్దుమణిగిందేమో; నాకొక సన్నివేశం జ్ఞాపకం క్విట్ ఇండియా తీర్మానం, గాంధీజీ వగైరా నాయకుల అరెస్టు సమయం. రామానాయుడుగారు ఏదో పనిమీద మద్రాసులో వుండిపోయారు; రెండు మూడు వారాలు రాలేదు. ఆ సమయంలో వచ్చిన సంచిక చాల బాగుంది అని నాయుడుగారు మద్రాసు నుండి వ్రాశారు. ఆ ప్రశంస సింహాగారికి చెందింది. శీర్షికలివ్వడంలో, పేజీ గెటప్‌లో సింహా కొత్త పుంతలు త్రొక్కేవాడు.

నేను 'జమీన్‌రైతు'లో చేరక ముందు విద్యార్థి రాజకీయాలనుగూర్చి రెండు మూడు వ్యాసాలు వ్రాశాను; అవి 'ప్రజామిత్ర'లో ప్రకటింప బడ్డాయి. ఆ పత్రిక ఉప సంపాదకుడైన శ్రీ ఏడిద కామేశ్వరరావు గారు వాటికి మెరుగులు దిద్ది చక్కని శీర్షికతో ప్రకటించేవాడు. ఆ వ్యాసాలు నాలో ఆత్మవిశ్వాసాన్ని కల్గించాయి. ప్రజామిత్రలో కామేశ్వరరావుగారి వ్రాతలు, శీర్షికలు నన్ను ఆకర్షించేవి. నేను సంపాదకుణ్ణయిన తర్వాత కామేశ్వర రావుగారి చేత 'లోకాలోకనం' అని జమీన్‌రైతులో ఒక శీర్షిక వ్రాయించాను. జాతీయ అంతర్జాతీయ సమస్యలు అందులో చక్కగా చర్చించేవాడు. ఔచిత్యం లేకపోయినా కామేశ్వరరావు విషయం ఇక్కడ ఎందుకు ప్రస్తావించవలసి వస్తున్నదంటే, జర్నలిస్టుగా నేను రూపొందడానికి ప్రచ్ఛనంగానైనా ఆయన ప్రోత్సాహం వున్నందువల్లనే.

నేను చేరేసరికి 'జమీన్‌రైతు' లక్ష్యాలు రెండూ నెరవేరినాయి ; దేశ స్వాతంత్ర్యం, జమీందారీల రద్దు. ఒక ఉద్యమం కోసం పుట్టి రెండు ఉద్యమాలలో వుజ్జ్వలంగా వెలిగిన 'జమీన్‌రైతు' నాతోటి వార్తాపత్రికగా కొనసాగవలసిందైంది. పాఠకుల అభిరుచుల్లో కూడా మార్పు వచ్చింది. ఉద్యమాలలో ప్రభుత్వ వ్యతిరేకవాణిగా వుండడానికి, మామూలు వాతావరణంలో ప్రభుత్వాన్ని, ప్రభుత్వ పార్టీని బలపరచే సామాన్య వార్తాపత్రికగా సాగడానికి ఎంతో తేడా. కాని రామానాయుడు గారు పెట్టిన వరవడివల్ల, ఆయన వేసిన గట్టి పునాదులవల్ల వార్తా పత్రికగా కూడా అది తరగని ప్రతిష్ఠతో నడుస్తున్నది.

ముప్పయ్ రెండేళ్ల సారథ్యంలో పత్రిక బాగోగుల గూర్చి పాఠకులే తీర్పుచెప్పాలి. అది నేను తరచదగిన అంశం కాదు. నేను చేరిన తర్వాత కూడా నాయుడుగారు పదేళ్ళు జీవించివున్నారు. కాని దాదాపు ఒక కాలమిస్టు'గా తప్ప. పూర్తి కాలాన్ని పత్రికలో గడపలేక పోయేవారు. దానికి కారణాలు రెండు. తన జీవిత కాలంలోనే పూర్తి బాధ్యతతో పత్రికా నిర్వహణ సాధక బాధకాలు కష్టసుఖాలు నాకు అవగతం కావాలనేది ఒకటి. ఆ విషయాన్ని ఆయన పదేపదే చెప్తుండేవారు. రెండవది ఆయన తన కాలాన్ని కస్తూరిదేవి విద్యాలయం వంటి సేవా కార్యక్రమాలకు వినియోగించవలసి రావడం. వ్రాతలో, నిర్వహణలో ఎన్ని తప్పులు చేసినా, పొరపాట్లు వచ్చినా ఆయన సహించేవాడు. ఆయన సహనం నా తప్పులు నేను తెలిసికొనేటట్లు కండ్లు తెరిపించేదేమో ననిపిస్తుంది. సంపాదకుడుగా నాపేరు పత్రికలో వేసింది నాకు తెలియదు. డిక్లరేషన్ నాపేరుతో మార్పించింది జిల్లా మేజిస్ట్రేటు వద్దకు పోవలసి వచ్చేవరకు నాకు తెలియదు. తానుండగానే నేను పాఠకులకు పరిచయం కావాలనే సంకల్పంతో ఆ విధంగా చేసినట్లు ఆయన తర్వాత చెప్పారు. పత్రిక శాశ్వతంగా జరగాలనే సత్సంకల్పంతో ఆయన చేసిన ఏర్పాట్లివి. ఆయన ఎంత దూరదృష్టితో చేసింది తర్వాత రుజువైంది. నాయుడుగారి మరణంతో జమీన్‌రైతు కూడా మరణిస్తుందని చాలా మంది భావించారు. కాని నిల్చింది; ఆయన సంపాదించి యిచ్చిన మంచివల్లనే నడుస్తున్నది.

పత్రికలో నా అనుభవాలను ఏకరువు పెట్టలేను. స్థానిక పత్రికా వ్యాసంగమనేది కత్తిమీద సామువంటింది. కేవలం వార్తాపత్రికగా వారపత్రికకు స్థానంలేదు. వార్తల వెనుక విశేషాలు, వ్యక్తులు, విమర్శలతోకూడి వుంటేనే వారపత్రికకు మనుగడ. ఆ విధంగా వుంటే నిష్ఠూరాలు, విరోధాలు తప్ప చిత్తశుద్ధిని సమంజసతను అర్థం చేసుకొనే వారుండరు. స్నేహితులను తగ్గించుకోవడం, విరోధులను పెంచుకోవడం తప్ప వేరొక ఫలితం వుండదు. ఎప్పుడూ "టెన్షన్" తో పనిచేయాలి; వివాదాస్పదుడుగా బ్రతకాలి. ప్రశంసలు పొందినవాడు తాత్కాలికంగా సంతోషిస్తాడు, సెబాస్ అంటాడు, మరచిపోతాడు. విమర్శకు గురియైనవాడు శాశ్వతంగా మనసులో వుంచుకుంటాడు, సాధిస్తాడు. స్వతంత్ర ఆలోచన, స్వంత అభిప్రాయాలు, స్వేచ్ఛాధోరణికి చెలామణీ వుండదు. అనేక పరిమితులు, నిర్బంధాలకు లోబడినది స్థానిక జర్నలిజం. అందువల్లనే చివరకు నిరుత్సాహం నిస్పృహ విసుగు విరక్తి మిగిలాయి. నాకేనో? అందరికి ఇంతేనో మరి!

ఎన్నికలు, ముఠా రాజకీయాలు, క్రైం న్యూసు కల్గించే ఆసక్తిని మరే విధమైన వార్తలూ కల్గించవు. పాఠకులు ఆ వార్తలకు, విమర్శలకు ఎగబడినట్లుగా, ఇతర వార్తలను చదవరు. విజ్ఞానదాయకమైనవి, నిర్మాణాత్మకమైనవి, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి నవి పత్రికలో వుండవలసిందే; కాని పాఠకులలో అత్యధిక సంఖ్యాకులు





వాటిని అంతగా చదవరు; ఆ వార్తలున్న పేజీలను చూడకుండానే త్రిప్పివేస్తారు. పైన వివరించిన మూడు రకాల వార్తలు లేనప్పుడు పత్రిక చప్పగా వున్నదని పెదవి విరుస్తారు. వ్యాఖ్యలు విమర్శలులేకుండా కేవలం వార్తలే ఇస్తే బాగుంటుందని కొందరి అభిప్రాయం. 'హిందూ'లో లాగా వుండాలని ఇంకొందరి అభిలాష. 'హిందూ' వంటి దినపత్రికలనువార్తల కోసం చదువుతారు; ఆ వార్తలకే అయితే 'జమీన్‌రైతు' వంటి వారపత్రిక లెందుకు ; ఆ విషయం ఆలోచించరు. ఆదర్శానికి వాస్తవ దృష్టికి లంగరందదు. వార్తల వెనుక విశేషాలు, వ్యాఖ్యా సహితమైన వార్తలే జమీన్‌రైతు విలక్షణం. అందువల్లనే పరిపూర్ణమైన జీవంతో నిత్యనూతనత్వంతో యాభైఏళ్ళు గడపగలిగింది 'జమీన్‌రైతు' 'హిందూ'తో సహా ఈనాటి దినపత్రికలను చూస్తే, ఇంతకాలంగా 'జమీన్‌రైతు' అనుసరించిన ధోరణి పొరపాటు కాదనిపిస్తుంది . పాఠకుల అభిరుచులకు అనుగుణంగా పత్రిక వుంటేనే నడుస్తుందికాని, లేకుంటే ఒక్క అడుగుకూడా ముందుకు సాగదనేది అనుభవైక వేద్యమైన సత్యం. నేను పరిశోధించి సాధించిన కొత్త సత్యమేమీ కాదిది; ప్రతి పాత్రికేయుని అనుభవం ఈ సత్యాన్నే నిరూపిస్తుంది. కాని నేను ఇక్కడ దీన్ని ఎందుకు ప్రస్తావించ వలసి వస్తున్నదంటే, వ్యాఖ్యలు విమర్శలు దృఢమైన స్వతంత్ర వైఖరివల్ల జమీన్‌రైతు అప్పుడప్పుడు కొందరి ఆగ్రహానికి గురియైనప్పుడు శ్రేయోభిలాషులైన కొందరు మిత్రులు సలహా చెప్పేవారు - వుత్త వార్తలిస్తే సరిపోదా అని. ఆగ్రహాలకు వెరిస్తే, అనుగ్రహాలకు లొంగితే జర్నలిస్టు కాలేడని నా అభిప్రాయం, అభిమానమనేది మాత్రం మానవ సహజమైన బలహీనత.

నేను పత్రికలో చేరిన తర్వాత ఆరు శాసన సభ ఎన్నికలు జరిగాయి; లోకసభకు కూడా అంతకు తక్కువ జరిగి వుండవు; చిల్లర మల్లర ఎన్నికలు సరే లెక్కలేదు. 1952 ఎన్నిక నాకు మొదటిది. నాకు ఆశాభంగాన్ని కల్గించిన మొదటి ఎన్నిక కూడా అదే. నాకేకాదు, నెల్లూరు జిల్లాకేకాదు, రాష్ట్రమంతటి అంచనాలు తలక్రిందులు చేసిన ఎన్నిక అది. నెల్లూరు జిల్లాకు సంబంధించినంత వరకు గూడూరు, రాపూరు, కందుకూరు,



1950 రజతోత్సవం నాటి ఫోటో

స్థానాల్లో తప్ప, తక్కిన అన్ని నియోజక వర్గాలలో కాంగ్రెస్ పల్టీకొట్టింది. ఆనాడు మద్రాసు ఆర్థిక మంత్రిగా వుండిన బెజవాడ గోపాలరెడ్డిగారు ఉదయగిరిలో శ్రీ కోవిరామయ్య చౌదరితో ఓడిపోయారు. గోపాలరెడ్డి గారితో రామయ్య చౌదరి పోటీ చేయడమంటే పొట్టేలు కొండను ఢీ కొనడమేనని నా అభిప్రాయము, అందరి అభిప్రాయం కూడా. రామయ్య చౌదరి అనామకుడు, గోపాలరెడ్డి విఖ్యాతుడు. అదీగాక గోపాలరెడ్డిగారు మంత్రిగా ఏదైనా చేసివుంటే, ఉదయగిరి తాలూకాకే చేశాడు. కాని ఆ ఉదయగిరి ప్రజలే ఆయన్ను తిరస్కరించారు. గోపాలరెడ్డిగారు కూడా పోటీని తీవ్రమైందిగా పరిగణించలేదు. తాను ఉదయగిరి తాలూకాకే పరిమితమైనవాణ్ణి కాదని రాష్ట్రానికంతటికీ చెందిన వాణ్ణని ఆయన అభిప్రాయం. అందువల్లనే పోలింగ్ రోజుకూడా ఆయన తన నియోజక వర్గంలో వుండలేదు; ఇతర నియోజక వర్గాలను కూడా చూచుకొని, హాయిగా మద్రాసుకు చేరుకున్నారు. ఓటమి వార్తను ఆయన మద్రాసులోనే విన్నాడు. గోపాల రెడ్డి గారు ఓడిపోయారంటే, పత్రికద్వారా తీవ్రంగా ప్రచారంజేసిన మాకు తల కొట్టినట్టుగా వుండింది.కాని, తర్వాత గొప్పవారంతా గోవింద కొట్టారని తెలుసుకున్నపుడు కాస్త వూరట కలిగింది.

రామయ్య చౌదరి గోపాలరెడ్డితో పోటీకి తలపడడం, పొట్టేలు కొండను ఢీ కొనడమేనని నా అభిప్రాయ పడ్డానన్నాను. ఆ అభిప్రాయాన్నే కార్టూనుగా ప్రకటించాను. అదొక్కటే కాదు, అటువంటివి ఇంకా అనేక కార్టూన్లు. ఫలితాలు ప్రకటింప బడిన తర్వాత వీధిలో పోతుంటే, ఆ కార్టూనులు ప్రస్తావించి వెనకజేరి హేళన చేసేవారు. తల వంచుకొని పోవడం తప్ప చేయగలిగిందేముంది? ఎన్నిక ప్రచారంలో నా మొదటి అనుభవం అది; ఈనాటికీ మరపుకురాని అనుభవం.

ఏ.సి. సుబ్బారెడ్డి గార్ని నెల్లూరు టవున్‌దాటి బయట అడుగు పెట్టించిన ఎన్నికకూడా అదే. ఆయన నెల్లూరు నియోజక వర్గం కాంగ్రెస్ అభ్యర్థి. ఆయనకు ఎన్నిక కొత్త, ప్రచారమూ కొత్త, గ్రామాలూ కొత్త, మనుషులూ కొత్త. వేదిక ఎక్కి వుపన్యాసం చేయడం అంతకంటే కొత్త.. అంతా కొత్త అనుకోండి. ఎందువల్లనో ఏ.సి. అంటే నాకు వల్లమాలిన అభిమానం. అందువల్లనే ఆ ఎన్నికలో నేను ఆయనతోటే ఎక్కువగా తిరిగేవాణ్ణి. ఆయనతో పోటీచేసినవారు కమ్యూనిస్టు





అభ్యర్థిగా కి.శే. ఖండవల్లి కృష్ణారావు, స్వతంత్రులుగా శ్రీ పొన్నలూరు వీరరాఘవరెడ్డి. కమ్యూనిస్టుల 'ఐదెకరాలు-ఆవుదూడ' మంత్రం పేదసాదల్లో జోరుగా పనిచేస్తున్నది; అందువల్ల కృష్ణారావు గారు బలమైన అభ్యర్థి. భూస్వాములంతా వీరారాఘవరెడ్డి పక్షం వహించారు. ఇక బలహీనుడు ఏ.సి. సుబ్బారెడ్డిగారే. టర్మ్‌లో తప్ప ఆయనకు పలుకుబడిలేదుగదా; ఎవ్వరికీ తెలియదు గదా; పోటీ కృష్ణారావు- వీరరాఘవరెడ్డి మధ్యనేననుకున్నారు. కాని వీరరాఘవరెడ్డి మూడవవాడే అయ్యాడు; వీరరాఘవరెడ్డి పోటీ లేకుంటే ఏ.సి. సులభంగా గెల్చివుండేవాడు.

అదీకాక ఉదయగిరిలో గోపాలరెడ్డిగారు ఓటమి, నెల్లూరులో ఏ.సి. పరాజయానికి కారణమైందా అనికూడా ఆ రోజుల్లో అనుకున్నారు. ఉదయగిరిలో ఏ.సి. అమయాయులు (బహుశా పాకనాటి రెడ్లేమో) గోపాలరెడ్డి గారికి వ్యతిరేకంగా చే ర నే వద ంతి మరురోజునే నెల్లూరు పోలింగు. ఆ వదంతి రాత్రికి రాత్రి పల్లెలకు వ్యాపించి, ఇక్కడ గోపాలరెడ్డి అభిమానులంతా (బహుశా పంటరెడ్లు) ఏ.సి. కి వ్యతిరేకం చేశారని ఆనాటి మాట. ఈ వ్యతిరేకత కూడా ఏ.సి. ఓటమి కారణాల్లో ఒకటన్నారు. ఏమైతేనేమి జిల్లా కాంగ్రెస్‌లో రెండు ముఠాలేర్పడడానికి, ఏ.సి. ఒక వర్గం నాయకుడై జిల్లా వ్యాప్తంగా తన పలుకుబడిని ప్రభావాన్ని ప్రసరింప జేయడానికి బీజం పడింది 1952 ఎన్నికలోనేనని నా అభిప్రాయం. ఆనాడు ఏర్పడిన వర్గాలు, మనుషులు మారినా, వర్గాలు మారినా, ఈనాటికీ శాశ్వతమైపోయాయి; అంతకు ముందు వర్గాలు లేవనికాదు; వాటిలో ఏ.సి. లేడు.

ఇక్కడ ఇంకొక మాట; ఉదయగిరి ఎన్నిక కార్బునుతో హేళనకు గురైతే, నెల్లూరు నియోజక వర్గపు ప్రచారం నన్ను ఒక బెదరింపుకు గురిచేసింది. వీరరాఘవరెడ్డిగారికి పనిజేస్తుండిన ఒక మదించిన భూస్వామి నన్ను ఫోన్‌లో పిలిచి 'జాగ్రత్త' అని హూంకరించాడు. పిల్లతనం- నువ్వు జాగ్రత్తగా వుండు అని జవాబు చెప్పి పెట్టేశాను. ఆ పెద్దమనిషి తర్వాత స్నేహితుడయ్యాడు! ఓడలు ఒడ్లు, బండ్లు ఓడలు అవుతుంటా యంటారు. ఈనాడు ఇందిరాగాంధీ 'గరీబీహటావో' నినాదం పేదవారిని మంత్ర ముగ్ధులను చేసినట్లే, ఆనాడు కమ్యూనిస్టుల 'ఐదెకరాలు-ఆవుదూడ' ఆశ ప్రలోభపరచింది. 1952 లో కమ్యూనిస్టులు కల్గించిన భ్రమ 1955 మధ్యంతర ఎన్నికలనాటికే పటా పంచలైపోయింది. అటువంటప్పుడు ఇందిరమ్మ వ్యామోహం ఎంతకాల ముంటుందోనని పిస్తుంది. పునరావృతం కావడం చరిత్ర లక్షణం. చరిత్రనుండి పాఠాలు నేర్చుకోవడం రాజకీయ వాదుల [illegible] కాంగ్రెస్ వాదుల లక్షణం కాదుగాదు!

ఎన్నికలకు సంబంధించి 1937 వలె 'జమీన్‌రైతు'కు కాస్త గుర్తింపును తెచ్చిన ఎన్నిక 1978. కేంద్రంలో జనతాపార్టీ అధికారంలో వుంది. ఓడిపోయి, షా కమిషన్ తదితర కమిషన్ల విచారణలతో అప్రతిష్ట పాలైవుంది ఇందిరాగాంధీ. ఆమె మళ్లీ అధికారానికి వస్తుందనే ఆశ చూపు అంది నంతలోలేదు. కాని ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించినంతవరకు ఆమెపలుకుబడి మహోన్నత స్థాయిలో వుందేకాని, ఏమాత్రం దెబ్బతినలేదు. తల నెరసిన రాజకీయ వాదులు కూడా ఆ పరిస్థితిని గమనించలేక పోయారు. పేదవారి మనస్తత్వాన్ని గ్రహించగలిగినవారికి మాత్రమే ఈ పరిస్థితి తెలుసు. కాని అధిక సంఖ్యాకులకు తెలియదు. జనతాగాలి జోరుగా వీస్తున్నది.

ఎన్నికల్లో ఆ పార్టీయే ఢంకా బజాయిస్తుందనే నమ్మకం గాఢంగా వుండినది. అందువల్ల ఆ పార్టీ టిక్కెటుకు గిరాకీ ఏర్పడింది. ఇందిరా కాంగ్రెస్ అభ్యర్థులకోసం అన్వేషణ గావించవలసి వచ్చింది. ఎవడైనా, ఎంత అమాయకుడైనా దొరికితే చాలనిపించింది. ఇం.కాం. అభ్యర్థిత్వాలు స్వీకరించిన వారు గెలుస్తామని పూనుకున్నవారుకాదు; తమకు జనతా టిక్కెటు ఏ పరిస్థితుల్లోనూ రాదు కాబట్టి, వొప్పుకున్నవారే. ఎలక్షన్ ప్రచారం ప్రారంభమైనప్పుడు కూడా బయటకు ఆ విధంగానే వుండినది. కాని పోను పోను తెలిసివచ్చింది; మరీ ఇందిరా గాంధీ పర్యటన తర్వాత ఇం.కాం. దే విజయమనేది ధ్రువపడిపోయింది. అప్పటికీ కొందరు తమ వ్యక్తిగత పలుకుబడితోనైనా గెలుపొందగగలమనే ఆశాభావంతోనే వుండినారు.: ఆనం వెంకటరెడ్డి (నెల్లూరు), భక్తవత్సలు రెడ్డి (సర్వేపల్లి), గునుపాటి రామచంద్రారెడ్డి ( సర్వేపల్లి) రేబాల దశరథరామరెడ్డి (అల్లూరు), పాదిలేటి వెంకటస్వామి రెడ్డి(వెంకటగిరి) అటువంటి అభిప్రాయం కలిగిన వారిలో ముఖ్యులు. పోలింగు తర్వాత కూడా, లెక్కింపు రోజు సైతం వీరిలో కొందరు తాము గెలుస్తామనే భ్రమలోనే ఉండినారు. గాలి ఎటు వీస్తున్నది గమనించ గలిగిన కొద్దిమందిలో శ్రీ సుందరరామయ్య (అల్లూరు), శ్రీ.సి.వి.శేషారెడ్డి (సర్వేపల్లి) వంటివారుండినారు.

నాకు మాత్రం అభ్యర్థుల నిర్ణయానికి ముందు నుండి కూడా ప్రజానుకూలత ఇం.కాం. కే వున్నదనే నమ్మకం దృఢంగా నాటుకొని వుణ్ణింది. 1937,1946 ఎన్నికలలో కాంగ్రెస్ పూచిక పుల్లను పెట్టినా గెలుస్తుందనేమాట వుండేది. అట్లనే ఇందిరా కాంగ్రెస్ ఎంతటి అనామకుణ్ణి పెట్టినా గెలుస్తాడనే నమ్మకం నాది.



అదిగాక 1978 ఎన్నికల్లో అనూహితంగా ఒక కొత్త పరిణామం సంభవించింది. ధనికులు, భూస్వాములు, రాజకీయ గుత్తాధిపతులు, పేరు పలుకుబడులు గలవారు అనుకోకుండా ఇతర పార్టీలకు పోయారు; ఇందిరా కాంగ్రెస్‌కు పేద, మధ్యతరగతులకు చెందిన కొత్తవారు మిగిలారు. ఇందిరాగాంధీ పేరుకుతోడు, ఆ పార్టీ సామాన్య ప్రజల పార్టీ స్వరూపాన్ని సంతరించుకున్నది. మరొకటి - నా అనుభవంలో పేద వర్గాలు ఏ పక్షం వహిస్తారో, గెలుపువారిదే అవుతుంది.

దృష్టిని శంకించారు; ఎట్టున్నారు; ఎన్నికలకు సంబంధించిన మా వార్తలు నమ్మ దగినవి కాదనుకున్నారు. పోలింగ్ రోజు వరకే కాదు, కౌంటింగ్ రోజుకూడా ప్రజాభిప్రాయం ఇదే- కాని ఫలితాలు ప్రకటింపబడిన తర్వాత, అవి తమ ఆశలను అంచనాలను తల్లక్రిందులు చేసిన తర్వాత తెలిసి వచ్చింది- మేమెంత కరెక్టుగా అంచనా వేశామో, మా అంచనాలు ఎంత వాస్తవంతో కూడినవో నిష్పాక్షికమైనవో అప్పుడు గ్రహించారు; అపార్థం చేసుకున్నవారు, అపోహపడ్డారు, మొహం తిప్పుకొన్న

ధోరణికి మేము వ్యతిరేకం. మా వైఖరి ఉద్యమకారుల ఆగ్రహానికి మమ్ములను తీవ్రంగా గురిచేసింది. మా కార్యాలయం మీద దాడి చేశారు, పత్రికలు తగుల బెట్టారు, నామీద దౌర్జన్యానికి సంకల్పించారు. ప్రజా జీవితం స్తంభించిపోయింది ; వార్తలు అడ్వర్టయిజామెంట్లు వచ్చే అవకాశం లేకుండాపోయింది; ఉద్యమం వుధృతం అవుతున్నకొద్దీ, మామీద క్రోధం మితిమీరిపోయింది. ఒకటి రెండు సార్లు మా ఆఫీసును తగుల బెట్టాలని పెట్రోలు టిన్నులతో బయలు

# ఆత్మావలోకనం

(1990 వజ్రోత్సవ సంచిక నుండి పునర్ముద్రితం )

1952లో హరిజనాది పేదవర్గాలు కమ్యూనిస్టుల వైపు మొగ్గుబట్టే, అప్పుడు ఆ పార్టీ విజయం పొందింది. ఇప్పుడు ఆ వర్గాలు ఇందిరాగాంధీపట్ల గుడ్డి వ్యామోహాన్ని ప్రదర్శిస్తున్నాయి. కాబట్టి, ఇందిరా కాంగ్రెస్‌కు ఘన విజయం తథ్యమని నా నమ్మకం. నాకు వ్యక్తిగతంగా ఇందిరాగాంధీ నాయకత్వంపట్ల అచంచలమైన విశ్వాసం; దానికి తోడు సామాన్య ప్రజలు ఆమె వైపున్నారనేది స్పష్టంగా కనపడుతున్నది. అందువల్ల ఈసారి ఇం.కాం. దే విజయమని అనుమానం లేకుండా చెప్పగలిగాము.

కాని మమ్ములను పిచ్చివాళ్లను కున్నారు; నిజాన్ని చూడలేని వాళ్లమనుకున్నారు. కేవలం ఆ పార్టీపట్ల అభిమానంతో ప్రజలను మభ్యపెడుతున్నా మనుకున్నారు; జనార్దనరెడ్డి ప్రేరణతో, ఆయన కోసంగా తప్పుడు ప్రచారం చేస్తున్నా మనుకున్నారు. మా చిత్తశుద్ధిని, వాస్తవ

వారు మమ్ములను అభినందించారు. అంత కరెక్టుగా చెప్పగలిగినందుకు విస్మయం ప్రకటించారు.

మా గొప్పతనాన్ని చాటుకోవడానికి చెప్పడం కాదు. కళ్ళకు కట్టినట్లు వాస్తవం కనబడుతుండగా, జనవాణికి అది విరుద్ధమైనా, అపవాదులు అపఖ్యాతి భరించవలసి వచ్చినా, తద్విరుద్ధంగా నడచుకోలేక పోయామని చెప్పడానికే. చివరకు మా చిత్తశుద్ధి ప్రజల గుర్తింపును పొందగలిగినందుకు ఎంతో ఆనందం కలిగింది. 1978 ఎన్నిక ఒక విధంగా 1937 తో పోల్చదగిందేనని నా అభిప్రాయం.

ఎన్నికల్లోనేకాదు, ఇతర అనేక సమస్యల విషయంలో మా నమ్మకానికనుగుణంగా నిర్భయంగా వ్యవహరించినందువల్ల, ఎన్నో ఇక్కట్లకు, నష్టానికి గురికావలసి వచ్చింది. జై ఆంధ్ర ఉద్యమం జమీన్‌రైతు జీవితంలో, నాజీవితంలో మరుపురాని ఒక అనుభవం. రాష్ట్ర సమగ్రత ఆ ఆశయం; వేర్పాటు

దేరడంకూడా జరిగిందట. దైవకృపో, లేక మా వైఖరిలోని సమంజసతో, నిష్కళంకతోకాని అటువంటి అఘాయిత్యం ఏమీ జరగలేదు. ఆ ఉద్యమ సమయంలో నేను భావ సంఘర్షణకు లోను కావలసి వచ్చింది. వ్యక్తిగతమైన నా విశ్వాసం కోసం మొండిగా వ్యవహరించి, నాలుగైదు దశాబ్దాల శ్రమతో నిర్మాణమైన సంస్థను నాశనం చేయడమా అనే మీమాంసతో కొట్టుమిట్టాడ వలసి వచ్చింది. అంతేకాదు, మా విశ్వాసాన్ని చెప్పుకునే అవకాశంలేని ప్రజాస్వామ్యంలో సంపాదకుడుగా వుండడంకంటె సన్యసించడం ఉత్తమమనే విరక్తి ప్రబలింది. అదృష్టవశాత్తు ఉద్యమం విరమించబడడం, రాష్ట్ర సమగ్రతకు భంగం లేకుండా పోవడం జరిగింది. రాష్ట్రానికి చిచ్చుపెట్టిన వేర్పాటు పెద్దమనుషులే తర్వాత ఏర్పడిన మంత్రి వర్గంలో మొదటి స్థానాలను పొందడం, జై ఆంధ్ర ఉద్యమమంతా కొందరు



రాజకీయ వాదుల స్వార్థ కుట్రగా రుజువు కావడం సంభవించింది.

జై ఆంధ్ర ఉద్యమ సమయంలోనే కాదు విద్యార్థుల సమ్మెలు ఉద్యమాల సమయంలో కూడా మా దృఢవైఖరివల్ల దాడులకు నష్టానికి గురిగాక తప్పలేదు. కాని ఆ విషమ సమయాల్లో లొంగి పోకుండా అచంచలంగానే వుండగలిగాము.

కాంగ్రెస్‌లో ముఠాలు కొత్తకాదు. మొదట ప్రకాశం పంతులు గోపాలరెడ్డి వర్గాలుండేవి. గోపాలరెడ్డిగారిది ముఠాతత్వంకాదు; ఆయన అందులో ఎప్పుడూ తలదూర్చేవాడుకాదు. కాని అనుయాయులకు అబేధభావం తప్పేదికాదు. తర్వాత ఆ వర్గాలు గోపాలరెడ్డి- ఏ.సి. మధ్య ఏర్పడ్డాయి. ఎవరి మధ్య ఏర్పడ్డా, ఒక వర్గంలో పేరు గోపాలరెడ్డిగారిదైనా, ఆయన మాత్రం వీటికి దూరంగా నే వుండేవారు; అనుయాయులు మాత్రం కుస్తీలు పట్టుకునేవారు. ఆపిమ్మట ఏ.సి. వర్గంలోనే పెద్ద 'విప్లవం' వచ్చింది. 1965 సంవత్సరం అది. ఆనాడు ఏ.సి. వర్గానికి ఎదురులేదు. ఇటు రాజకీయాధికారం, అటు సహకార సంస్థల ఆధ్వర్యం పూర్తిగా వారిదే. జిల్లాలో అష్టదిక్పాలకులు కూడా వారి అదుపాజ్ఞలలో వుండవలసిందే. ఆ వర్గంలో కూడా ఆనం సంజీవ రెడ్డి-నల్లపరెడ్డి చంద్రశేఖరరెడ్డి గారలు ఒక ఉపవర్గం. ఏ.సి. మంత్రిగా హైదరాబాదులో వున్నందువల్ల, జిల్లా అంతా ఈ 'యువనాయకుల' ఆధీనంలో వుండేది. జిల్లామీద ఈ 'యువనాయుకుల' ప్రభావం ఎంతవరకు పోయిందంటే ఏ.సి.ని ధిక్కరించే స్థితి ఏర్పడింది. కాలేజి సీటు మొదలు కాల్షియం నైట్రేటు వరకు వారి దయాదాక్షిణ్యాలమీద ఆధార పడవలసిందే. జిల్లాలో వారంటే ఎంతటి భయోత్పాతం ఏర్పడిందంటే, న్యూస్ స్టాల్స్‌లో 'జమీన్‌రైతు'ను బహిరంగంగా కొనడానికి సందేహించేవారు; కొని మడచి చాటుగా పెట్టుకొని తీసుక పోయేవారు. దుర్భరమైన పరిస్థితి. ఆ వర్గంవారు ఎదగవలసినంత ఎదిగారు. వారి ప్రాభవమూ అందదగిన పరిమితులను అందింది. ఇక ఎదగడానికి చోటు లేదు; విరగడం తప్ప. 1965 డిసెంబరులో కాబోలు పతనం ప్రారంభమైంది.

మొదట తిరుగుబాటైనవాడు 'యువనాయకుల'లో ఒకడైన జి.ప.ఛైర్మన్ నల్లపరెడ్డి చంద్రశేఖరరెడ్డి. తిరుగు బాటుకు ముందు నన్ను, చంద్రశేఖరరెడ్డిగారిని ఒక వుభయ మిత్రుడు కలిపాడు. నా సహకారానికి హామీ పొందిన అనంతరమే చంద్రశేఖరరెడ్డి తన తిరుగుబాటును ప్రకటించాడు.

ఆనం వర్గంమీద తిరుగుబాటుకు 'జమీన్‌రైతు' అత్యంత ప్రోత్సాహమిచ్చింది. ప్రచారం చేసింది. ఆ ప్రచారం ఆవర్గంమీద అసంతృప్తి వున్నవారందరూ బయట పడడానికి ధైర్యం కల్గించింది. అదొక ధర్మయుద్ధమనే వాతావరణం కల్గించినందువల్లనే, ఏ.సి. వ్యతిరేకవర్గం ప్రజాదరణను పొందగలిగింది. న్యాయంగా ఈ వర్గ రాజకీయాల్లో పత్రిక భాగస్వామి అయివుండకూడదు. కాని నిరంకుశత్వానికి అడ్డుకట్ట పడనిదే ప్రజా జీవితం మరింత దుర్భరమవుతుందనే పవిత్రోద్దేశ్యంతోనే పాత్ర వహించవలసి వచ్చింది. వ్యక్తిగతంగా వారిమీద ద్వేషంలేదు; పైగా ఏ.సి. అంటే అభిమానం; ఒక ఉన్నతాశయంతోనే ఆ బంధాన్ని త్రెంచుకోవలసి వచ్చింది. 1967 లో ఏ.సి. మరణిస్తే 'జమీన్‌రైతు' ప్రత్యేక సంచికతో స్మృత్యంజలి ఘటించింది. ఏ.సి. స్థానంలో శాసనసభకు ఎవరు అర్హులు అంటే, నిస్సంశయంగా సంజీవరెడ్డి అని సూచించింది. సంజీవరెడ్డి మంత్రి అయితే అమితంగా సంతోషించింది. జై ఆంధ్ర ఉద్యమానికి వ్యతిరేకంగా ఆనం వెంకటరెడ్డిగారు నిలబడినప్పుడు, ఆయనకు అండగా నిలిచింది. ఇవంతా ఎందుకు వుదహరిస్తున్నానంటే, ఆనం వర్గం వ్యతిరేకోద్యమానికి మద్దతు నివ్వడం వ్యక్తిగత కారణాలతో కాదని, ఏకచ్ఛత్రాధిపత్యాన్ని విచ్ఛిన్నం చేయడానికేనని పాఠకులకు చెప్పడానికే.

మేనకూరు గోపాల కృష్ణా రెడ్డి గారంటుంటారు- నాకు బలహీనులపట్ల పక్షపాతమని. నా స్వభావాన్ని చక్కగా గ్రహించ గలిగాడని పిస్తుంది. కొంత కాలానికి ఆనం వ్యతిరేక వర్గంలో ఆ దుర్లక్షణాలే గోచరించాయి. ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డిని, జిల్లా రెండో మంత్రి చెంచురామానాయుణ్ణి ఆధారం చేసుకొని ఈ వర్గంవారూ అట్లనే తయారయ్యారు. ఒకనీతి ఒక పద్ధతి లేకుండా పోయింది. ఆనంవారి వలెనే వీరూ వ్యవహరించేట్లుంటే ఎవరైనా వారిని వ్యతిరేకించి వీరిని ఎందుకు సమర్థించాలి అని ప్రశ్నించాము; విమర్శనాదృష్టితోనే వీరినీ చూచాము. చెంచురామానాయుడుగారితో సహా, ఆ వర్గం నాయకులందరికీ మామీద విముఖత కల్గింది. చంద్రశేఖరరెడ్డిని అవసరం కొద్దీ మహా నాయకుడుగా చిత్రించాము; జనం జేజేలు చెప్పేట్లుగా చేశాము. నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి కార్యదక్షుడని, ఆదర్శ సమితి అధ్యక్షుడని ప్రశంసించాము., ఆయన ప్రతిష్ఠను పెంచాము. సంతోషించారు. సమ్మోదం పొందారు. మధ్యతరగతి యువకుడైన నేదురుమల్లి జనార్ధన రెడ్డిలోని చైతన్యాన్ని క్రియాశీలత్వాన్ని . సహృదయాన్ని, స్నేహస్వభావాన్ని బట్టి జిల్లా రాజకీయాల్లో కొత్త విలక్షణ నాయకత్వానికి అవకాశమున్నదనే వుద్దేశ్యంతో అతన్ని ప్రోత్సహిస్తే, నల్లపరెడ్డివారితో సహా అందరూ క్రుద్ధులయ్యారు; నిందలు, అపవాదులు కురిపించారు. మంత్రిగా జనార్ధనరెడ్డిని కాస్త విమర్శనా దృష్టితో చూచేసరికి



'విశ్వాసాల' నీతులు వల్లిస్తున్నారు. ఈ విధంగా అనుకూలంగా వ్రాసినప్పుడు చంకలు ఎగురవేయడం, విమర్శించినప్పుడు ముఖులుకావడం రాజకీయ వాదుల సహజ లక్షణమైపోయింది. కాని మా మటుకు మేము సమస్యల గుణదోషాలను బట్టి వ్యక్తులను ప్రశంసించడం విమర్శించడం జరిగిందే కాని, వర్గతత్వంతోనో ద్వేషభావంతోనో సంకుచితంగా వ్యవహరించ లేదు. తమకు అనుకూలమైనపుడు ప్రశంసించారు; ప్రతికూలమైనపుడు దురుద్దేశాలు అంటగట్టారు. వాటికి మేము ఏనాడూ పొంగిపోలేదు; క్రుంగిపోలేదు. అందువల్లనే మేము జిల్లాలోని రాజకీయవాదులందరినీ స్నేహితులుగానే భావిస్తున్నాము. మమ్ములను విరోధులక్రింద భావిస్తే, అది వారి చిత్తసంస్కారం క్రింద పరిగణించ వలసిందే.

క్రైం వార్తలు కల్గించినంత సంచలనం, పాఠకరంజకత రాజకీయ కల్లోలాలుకూడా కల్గించ లేవని 1971 నాటి మైపాడు హత్యలు చాటాయి. కళారాణి, చంద్రికారాణి సోదరీమణుల హత్యా వార్తలకోసం పాఠకులు పత్రిక కొరకు నిరీక్షిస్తుండేవారు. ఒక వారం పత్రిక ఆలస్యమైంది; శుక్రవారం రాత్రి రెండుకో మూడుకో వెలువడింది. అప్పటివరకు ఎంతో మంది పాఠకులు పత్రికకోసం నిరీక్షిస్తూ కూర్చున్నారు; అంతటి ఆసక్తిని రేకెత్తించాయి ఆ హత్యలు! 'జమీన్‌రైతు' పేరు జిల్లా, రాష్ట్ర సరిహద్దులు కూడా దాటి దేశవ్యాప్తమైంది అప్పుడే. 'ఇలస్ట్రేటెడ్ వీక్లి' వంటి పత్రిక 'జమీన్‌రైతు' రిపోర్టుల ఆధారంగా, బొమ్మలతోటి ఆ హోత్యోదంతాన్ని రెండుమూడు పేజీలు ప్రకటించిందంటే, జర్నలిజంలో, ప్రజాసమస్యలను వెలుగులోకి తేవడంలో జమీన్‌రైతు వున్నత ప్రమాణాలనే అందుకున్నదని పించింది. ఈ హత్యలకు సంబంధించి మాకు కలిగిన సంతోషం పత్రికకు ఎక్కువ ప్రచారం లభించిందనేదికాదు. సముద్రంలో కలసిపోవలసిన ఆ నేరాన్ని పైకిలాగి, తగినచర్య జరిగేట్లు చూడగలిగామనే సంతృప్తి! ఆ నేర పరిశోధనలో, వివరాల సేకరణలో, వున్నదున్నట్లు ప్రకటించడంలో మేము శ్రమనేకాదు, 'రిస్క్' కూడా తీసుకోవలసి వచ్చింది. ఆ సమయంలో అజాత శత్రువైన ఒక వ్యక్తి మమ్ము పదేపదే హెచ్చరించేవాడు- వ్యక్తిగతంగా ఎందుకు ప్రమాదాన్ని తెచ్చుకుంటావు; వదలి వేయరాదా అని సలహా చెప్పేవాడు. మా శ్రేయస్సుతో చెప్పిన సలహా అది. కాని జరిగిన ఆ ఘోరాన్ని సహించి వూరుకోవడానికి మనస్కరించలేదు. నేరాన్ని వెలికి తీయడమే కాదు; ముఖ్యమంత్రి వెంగళరావుగారిని కూడా నెల్లూరుకు రప్పించే ఆందోళనను , అలజడిని సృష్టించ గలిగాము.

వ్రాస్తుంటే పోతూనే వుంది . వ్యాసమైతే దీర్ఘమైందికాని జమీన్‌రైతును గూర్చి, దానితో నా అనుబంధాలు, అనుభవాలను గూర్చి ఎంతవరకు స్పష్టంగా చెప్పగలిగానా అనేది నాకే సందేహం. పత్రికకు మంచిపేరు వచ్చినా, దానిస్థాయి బాగున్నా ఆ గొప్పదనమంతా సంపాదకుడిదే ననుకోవడం పొరపాటు. సంపాదక వర్గంలోని ప్రతిఒక్కరి శ్రమ, శ్రద్ధ, శక్తి అందులో వుంటాయి. సమష్టి కృషి, సమష్టి బాధ్యతతోనే పత్రిక రాణిస్తుంది. అటువంటి మంచి సహచరులు దొరకడం మా భాగ్యం, నా అదృష్టం, నలమోలు గోపాలకృష్ణయ్య, బంది గోపాల రెడ్డి (బంగోరె), పి. గోపాలకృష్ణ (గోపి) గారల సహచరత్వం అనన్యమైంది. వాళ్ళు వేతనాలకోసం ఉపసంపాదకులుగా పనిజేసినవారుకాదు; శ్రద్ధాసక్తులతో, వుత్సాహ దీక్షలతో, అంకితమై పనిజేసినవారు; అందువల్లనే పత్రిక పాఠకుల దృష్టిలో 'స్టేల్' కాలేదు; నిత్య నూతనంగా, నవ్యాసక్తిదాయకంగా చదవబడుతూనే వుంది; ఈ సమయంలో వారి సేవలను తలచుకోవడం, వారికి కృతజ్ఞతలు చెప్పడం నా ధర్మం.

జర్నలిస్టుగా వుండేవాడు రాజకీయాల్లో పాల్గొనగూడదనేది నామతం. జర్నలిస్టు నిత్య రాజకీయాలలో భాగస్థుడైతే, పత్రిక నిష్పాక్షికతకు దూరమవుతుంది రాజకీయాలకు దూరంగా ఒక పరిశీలకుడిగా వుండగల్గితేనే కల్గితేనే రాణింపు, పూజింపు, నేను వ్రత భంగం చేసాను. నా ఎం.ఎల్.సి. పదవి జర్నలిస్టుగా ; జర్నలిస్టుగా నా స్వేచ్ఛను, స్వతంత్రాన్ని, నిర్భీకత్వాన్ని కొంతవరకు హరించిందనే చెప్పాలి. వ్రాతలో సంశయగమనం తెలియకుండానే ప్రవేశించింది. అయినా నాలో నేను సమాళించుకోవడానికి, రాజకీయ మొగమోటాలకు దూరం కావడానికి , పార్టీకి బందీ కాకుండడానికి, పదవికోసం స్వేచ్ఛను వ్యక్తిత్వాన్ని ధారబోయకుండడానికి ఎప్పటికప్పుడు ప్రయత్నిస్తూనే వున్నాను. ఎంతవరకు కృత కృత్యుణ్ణి కాగలుగుతున్నానో మీరే చెప్పాలి!

నాకు విద్యా శిక్షణలు గరపింది, నాకు లోకజ్ఞానాన్ని ప్రసాదించింది, జర్నలిజంలో నాకు ఒనమాలు దిద్దబెట్టింది, నన్నొక మనిషిగా చేసింది, నాకొక ప్రతిపత్తిని కల్పించింది 'జమీన్‌రైతు' ..... నా కార్యరంగము, నా లోకము జమీన్‌రైతే. అందువల్లనే 'జమీన్‌రైతు'ను తల్లిదండ్రి, గురువు దైవంగా సర్వస్వంగా భావిస్తాను; ఈ సంస్థ రామానాయుడుగారు కలలు గన్నట్లు, కలకాలం వర్ధిల్లుతుంది, మూడుపూలు, ఆరుకాయలుగా వికసిస్తుంది, విస్తరిస్తుంది సందేహం లేదు.

***

జమీన్‌రైతు వయస్సు అరవై ఏండ్లయితే, అందులో నా జీవితం నలభై రెండు





సంవత్సరాలు. ఈ సుదీర్ఘ కాలంలో జమీన్‌రైతుకు నేనేమి చేయగలిగాను? దానిని కించిత్ అయినా అభివృద్ధి చేయగలిగానా? దాని ప్రతిష్టను పెంచగలిగానా? దాని వ్యాప్తికి దోహద పడగలిగానా? నా వల్ల దానికేమైనా అపకారం జరిగిందా? నష్టం సంభవించిందా? నేను దానికి గుదిబండనైనానా?

'జమీన్‌రైతు' వజ్రోత్సవ మంటే నా మనసులో ఇటువంటి భావాలెన్నో కలుగుతున్నాయి; ఇలాంటి ప్రశ్నలే తలెత్తుతున్నాయి. ఒకసారి వెనుదిరిగి చూచుకోవడానికి, ఆత్మావలోకనం చేసుకోవడానికి ఇది సముచితమైన సందర్భమూ, సమయము కాదా అనిపిస్తున్నది-తన రజతోత్సవ, స్వర్ణోత్సవ, వజ్రోత్సవ సంబరాలు మూడింటిలో పాల్గొనే అపూర్వావకాశాన్ని భాగ్యాన్ని 'జమీన్‌రైతు' నాకు కల్గించింది. జమీన్‌రైతును స్థాపించి స్థిరీకరించిన రామానాయుడు గారికి తాను ఏమి చేయగలిగాను అని సమీక్షించు కోవాలసిన అవసరం లేకుండా పోయింది. తాను పత్రికను నెలకొల్పడమే కాదు. సంచలనాత్మకంగా నిర్వహించడమే కాదు. లక్ష్యాలను సాధించి, తన తదనంతరం కూడా పత్రికను నడిచేటట్టు చేశాననే సంతృప్తితో ఆయన కన్ను మూశారు; చరితార్థుడైనాడు; ధన్యజీవి అన్పించుకున్నారు. కాని ఆయన చేయాల్సిన పని ఒకటి చేయలేకుండా పోయారు. ఆయన తన తొలి రోజుల జీవిత చరిత్రను వ్రాయగలిగారు గాని జమీన్‌రైతోద్యమంలో తన అనుభవాలను, జమీన్‌రైతు స్థాపనాది నిర్వహణలో తాను పడిన పాట్లను, భిన్న మనస్తత్వాలు స్వభావాలు గల రాజకీయ నాయకులు వ్యక్తులను గూర్చి తన అభిప్రాయాలను, ఆనాటి కాలమాన పరిస్థితులను ఆయన వ్రాతలో పెట్టలేక పోయారు. ఎంత ఒత్తిడి తెచ్చినా, ఎంత బలవంత పెట్టినా ఆయన చేత ఆ పని చేయించలేక పోయాము. రామానాయుడు గారు తన జమీన్‌రైతు అనుభవాలను గ్రంథస్థం చేసివుంటే మాకు మార్గదర్శకంగా వుండేది.

జమీన్‌రైతుకు ఇతర పత్రికలకు పోలికే లేదు. ఇతర పత్రికలంటే నా వుద్దేశ్యం స్థానిక పత్రికలని కాదు; ఇతర ప్రదేశాల నుండి వెలువడే పత్రికలని నా భావం. ఇతర ప్రదేశాల పత్రికలు విశాల రంగానికి సంబంధించిన సమస్యలను, రాజకీయాలను గూర్చి చర్చిస్తాయి, పరిశీలన జరుపుతాయి. కానీ, స్థానిక సమస్యలను, స్థానిక రాజకీయాలను, స్థానికుల మధ్య వుండి, అధికార అనధికార్లకు సంబంధించి తెర వెనుక వార్తలు, వ్యాఖ్యలు విమర్శలను చేయవలసిన అవసరం వాటికి వుండదు. స్థానికంగా వుండి, వ్యక్తులతో పరిచయాలు కలిగి, నిత్యం వారి ముఖాలు చూస్తూ, వారిని గూర్చి నిర్మొగమాటంగా నిశితంగా విమర్శించ వలసిన రావడమనేది కత్తి మీద సామువంటిదే; ఒక విధంగా నిప్పుతో చెలగాటమే; 1947 వరకూ ఏమి వ్రాసినా, ఎవరి మీద వ్రాసినా, ఎట్లా వ్రాసినా స్వాతంత్ర్య సమరం – జమీందారీ వుద్యమ ప్రభావం మాటున చెల్లిపోయింది. చెల్లిపోయింది అనడం కూడా పూర్తిగా సముచితం కాదు; అప్పుడూ వ్యక్తుల కోపతాపాలు, బెదరింపులు, వేధింపులు, దౌర్జన్యాలు దాష్టీకాలు లేకుండా పోలేదు. ఆ పురిటి నొప్పులను, ఆ బాలారిష్టాలను, ఆ ప్రారంభ బాధలు, కష్టాలన్నింటిని రామానాయుడు గారు భరించి అధిగమించి కీర్తి ప్రతిష్టల పునాది మీద జమీన్‌రైతును నిలబెట్టి పోయారు. అటువంటి విఖ్యాతమైన జమీన్‌రైతును నేనేమైనా పెద్దది చేయగల్గినానా? దానిని విస్తృతం గావించ గలిగానా? లేదు.... లేదు.... లేదు. ఎందువల్ల? ఏ రాష్ట్ర రాజధాని నగరంలోనో కాకుండా, ఒక జిల్లా కేంద్రంలో వున్నందు వల్లనా? రాష్ట్ర వ్యాప్త స్వరూప స్వభావాలతో కాకుండా వార్తా పరిధిని జిల్లాకే పరిమితం చేసిందు వల్లనా? మారిన బహుళ సంఖ్యాకులైన పాఠకుల అభిరుచుల కనుగుణంగా సీరియల్సు, సినిమాలు, సెక్సు, క్రైమ్ తదితర ఆకర్షణీయ విషయాలతో కాకుండా రాజకీయాల వంటి కొద్ది మందికి ఆసక్తి కలిగిన అంశాలకు ప్రాధాన్యత నివ్వడం వల్లనా? రాజకీయాలలో సైతం స్వతంత్రంగా సమతూకంగా గుణ పక్షపాతంతో కాకుండా, ఒక పార్టీ పట్ల అభిమానంగా, ఆ పార్టీలో కూడా కొందరు వ్యక్తుల పట్ల అదరంగా వ్యవహరించి నందువల్లనా? పత్రిక సర్వతో ముఖాభివృద్ధికి అవసరమైన ధన వసతి లేనందువల్లనా? వీటన్నింటికి మించి పత్రికా నిర్వహణకు ఇంత కాలం బాధ్యత వహించిన నాలో సమర్థతలేక పోవడం కారణమా?

పత్రిక జిల్లా కేంద్రంలో వుండడం నిస్సందేహంగా అన్ని విధాలా అనకూలమే కాదు, నష్టదాయం కూడా. రాష్ట్ర రాజధాని పత్రికలకుండే గుర్తింపు జిల్లా కేంద్రంలోనో, మరో చోటనో వుండే పత్రికల కుండదు. ముఖ్యంగా ప్రభుత్వ దృష్టిలో రాజధానిలో వుండే పత్రికలో హోదా ఎక్కువ. అనుకూలతలకు సంబంధించి రాజధాని కేంద్రంలో వుంటే అనేకం; రాజధాని రాజకీయాలే కాదు, రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు సంబంధించిన వార్తా కథనాలు సులభంగా లభ్యమౌతాయి. అన్ని రకాల శీర్షికలు వ్రాసే రచయితలు అనేక మంది దొరుకుతారు; అందువల్ల పత్రికను వివిధ విషయాలతో సుసంపన్నము, ఆకర్షణీయము గావించే అవకాశం వుంటుంది. వార్తా చిత్రాలు, వ్యక్తుల బొమ్మలు సకాలంలో సేకరించు కోవచ్చు. ప్రింటింగ్‌కు సంబంధించి అధునాతన రీతిలో అభిరుచులకు అనుగుణంగా పత్రికను తెచ్చే



విలుంటుంది. అన్నిటికీ మించి వి.ఐ.పి.లంటారే ఆ ముఖ్యుల పరిచయాలు లభిస్తాయి; ఈ అవకాశాలన్నీ జిల్లా కేంద్రంలో వుండే పత్రికకు దొరకవు గదా? రాష్ట్ర వ్యాప్తమైనఆ ప్రాచుర్యం, ప్రకటనల మూలంగా లభించే ఆదాయం జిల్లా కేంద్రంలోని పత్రికలకు ఎట్లా వస్తుంది? రావడానికి వీల్లేదు. ఆ అనకూలతను అనుక్షణం జమీన్‌రైతు అనుభవానికి వస్తుంటాయి.

కానీ అంతకు క్రితం మద్రాసు నుండి కానీ, ఆంధ్రప్రదేశ్ అవతరణానంతరం హైదరాబాదు నుండి గాని ప్రారంభింపబడిన అనేకానేక వార, మాస పత్రికలు మూడు పువ్వులు, ఆరు కాయలుగా విరాజిల్లుతూ వుండాలి గదా? కానీ ఆ పత్రికలన్నీ ఎంత వుధృతంగా ప్రారంభమైనవో అంత శీఘ్రంగా నిలచి పోయినవి, ఎందువల్ల? పేరు, సమర్థత అనుభవం గల పెద్దలెందరో ప్రారంభించిన పత్రికలు కొంతకాలమైనా నడవ లేక పోవడానికి కారణమేమి? పూర్వం తెనాలి నుండి కాబోలు వెలువడిన ఒక మాస పత్రిక, ప్రస్తుతం విజయవాడ నుండి వెలువడుతున్న ఒక వారపత్రిక లక్ష సర్క్యులేషన్ తాక గలిగినాయంటే ఏమనుకోవాలి? దీన్ని బట్టి తేడా రాజధాని...లో, జిల్లా కేంద్రంలో వుండడం కాదు. మొదటిది పత్రిక స్వరూప స్వభావాలు; రెండవది నిర్వాహకుల దీక్షాదక్షతలు; ఇంకో విధంగా చెప్పుకోవాలనుకుంటే రాజకీయాల మీద, రాజకీయ ...దుల మీద, సంచలనాత్మకమైన రాజకీయ వార్తల మీద ఆధారపడి ప్రచురితమయ్యే పత్రికలు బ్రతకటం కష్టం. అటువంటి పత్రికా పాఠకులు పరిమితం. సీరియల్సు, నవలలు, సినిమాల వంటి చక్కలిగింతలు పెట్టే సరుకుతో కూడి పత్రికలకు మనుగడ ఎక్కువ; అటువంటి వాటికి అన్ని వయసులకు చెందిన స్త్రీ పురుషులు, యువతీ యువకులు పాఠకులౌతారు. వేడి వేడి బఠానీల్లాగ అమ్ముడు పోతాయి; పెట్టుబడి వ్యాపార దృష్టి పత్రిక విజయానికి ప్రాధమికావసరాలనేది చెప్పనవసరం లేదు.

జమీన్‌రైతును రాజధానికి తరలించి, రాష్ట్ర వ్యాప్త రాజకీయ వార పత్రికగా రూపొందించాలనే వుబలాటం, వురవుర మాకు అప్పుడప్పుడు కలుగకుండా పోలేదు. కాని రాజధానిలో ప్రారంభమై పతనమవుతున్న పత్రికల గతిని చూస్తూ చూస్తూ 'జమీన్‌రైతు' కు స్థాన చలనం కలిగించడానికి ధైర్యం చాలలేదు. స్థానిక అభిరుచి, చందాదారులైన పాఠకులే 'జమీన్‌రైతు' ఇంతకాలం ఈ రూపంలోనైనా నిల్చి వుండడానికి కారణాలనే నమ్మకం కలిగింది. నెల్లూరుది నెల్లూరులోనే వుంచి హైదరాబాదు ప్రచురణ అదనంగా తేవచ్చు. దానికి ఆర్థిక బలము, యంత్రాగము కావాలి. అది సమకూర్చుకొనే అవకాశం నాకు కనపడలేదు; దానికి అవసరమైన చొరవ చురుకుదనం సమర్థత నాలో లేవని నాకు స్పష్టంగా తెలుసు. అందువల్ల సాహసించలేక పోయాను.

పార్టీ రాజకీయాలు, అందులో కొందరు వ్యక్తుల పట్ల అనుసరించిన వైఖరులు పత్రిక అభివృద్ధికి ప్రతిబంధక మయ్యాయా? జమీన్‌రైతు స్థాపనాది కాంగ్రెస్ పార్టీనే బలపరుస్తున్నది; ఎన్నికలలో ఆ పార్టీ అభ్యర్థుల విజయానికే కృషి చేస్తున్నది. కాంగ్రెస్ అనేది ఈనాడు వున్న అసంఖ్యాకమైన పార్టీలలో ఒక పెద్ద పార్టీ కావచ్చు గాని, ఆనాడు పార్టీ అంటే కాంగ్రెస్ ఒక్కటే పార్టీ. ఈనాటి పార్టీలన్నిటికీ – ఒక్క బి.జె.పి. మినహా – కాంగ్రెస్ పార్టీయే తల్లి; ఈ చిల్లర మల్లర పార్టీలలో వున్న వారందరు ఒకప్పటి కాంగ్రెస్ వాదులే. క్రమంగా సిద్ధాంతాలు విధానాలతో విభేదించి కొందరు కొత్త పార్టీలు పెట్టుకుంటే; వ్యక్తిగత స్పర్థలతో పదవీ వ్యామోహాలతో అవకాశ వాదంగా సొంత పార్టీలు పెట్టుకున్న వారు కొందరు. కమ్యూనిస్టులు ఒకప్పుడు కాంగ్రెస్‌లో వున్న వారే. కాంగ్రెస్ సోషలిస్టులుగా చెలామణీ అయినవారే. తర్వాత జయప్రకాష్ వంటి కాంగ్రెస్ సోషలిస్టులను నట్టేట ముంచి అరుణ పతకాన్ని ఎగురవేశారు కమ్యూనిస్టులు.

కాంగ్రెస్‌లోని సోషలిస్టులు జింజర్ గ్రూపులు వేరై పోయారు. కాంగ్రెస్ (ఆర్), కాంగ్రెస్ (యన్) కాంగ్రెస్ (ఐ) అంటూ కాంగ్రెస్ అనేక చీలకలైంది. ప్రజా పార్టీలు, ప్రజా సోషలిస్ట్ పార్టీలు, స్వతంత్ర పార్టీలు, జనతా పార్టీలు, జనతాదళ్‌లు, జనమోర్చాలు, తెలుగుదేశం వంటి ప్రాంతీయ పార్టీలు పుట్టుకొచ్చాయి. పేరేదైనా కావచ్చు. నాయకుడెవరైనా కావచ్చు. ఈ చిల్లర మల్లర పార్టీలలో వుండేవారిదంతా కాంగ్రెస్ సంస్కృతే; అలిగి పోవడం, అలక తీరిన తర్వాత మరలా రావడం .... ఈ విధంగా వుంటున్నది. కావిడి ఎన్ని వంకలు తిరిగినా ఇంటికి చేరినట్లు ఎవరో ఎక్కడో కొద్ది మందిని మినహాయిస్తే అన్ని పార్టీలు తిరిగి ఎక్కడా యిముడలేక, వ్యక్తులతో విధానాలతో పొత్తు కుదరక, చేసిన తప్పుకు తమలో తాము చెంపలేసుకొని చివరకు కాంగ్రెస్‌లోకే వస్తున్నారు. ఏ కొత్త పార్టీ కూడా పుట్టినన్ని రోజులు మనగలగడం లేదు.

రాజాజీ నాయకత్వాన హేమా హేమీలతో ఏర్పడిన స్వతంత్ర పార్టీ ఒకప్పుడు కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం అనిపించింది. కాని అనతికాలంలో సోదిలోకి కూడా రాకుండా పోయింది. ఆచార్య కృపలానీ, ప్రకాశం పంతులు వంటి కాంగ్రెస్ అధినాయకులతో ఆవిర్భవించిన ప్రజాపార్టీ ప్రజల ఆదరణ పొందలేక పోయింది. ఎమర్జన్సీ



అక్రమాలతో ఇందిరా గాంధీ మినహా. కాంగ్రెస్ పాత అగ్ర నాయకులు తదితరాలతో పెళపెళార్భాటాలతో రెప్పపాటులో. సంఘటితమై కేంద్రంలో అధికారంలోకి వచ్చిన జయప్రకాష్ జనతా పార్టీ నాయకుల కీచులాటలలో తిరిగి చూచేలోగా పతనమైంది. ఇప్పుడు మరలా కేంద్రంలో అధికారానికి వచ్చిన నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం ఏ క్షణంలో కూలిపోతుందో చెప్పలేకున్నారు. ఈ విధంగా కాంగ్రెస్ నాయకుల లోపాల వల్ల చీలిపోయిన కాంగ్రెస్ వాదులు, వెన్నుపోటు కాంగ్రెస్ వాదులను ముందర పెట్టుకొని కాగ్రెస్‌కు బలమైన ప్రత్యామ్నాయాన్ని స్థిరంగా ఏర్పాటు చేయాలనే కమ్యూనిస్టులు, బి.జె.పి. పార్టీల సర్వప్రయత్నాలు విఫలమవుతున్నాయి. ప్రజలకు ఈనాటికీ ఒక్క కాంగ్రెస్ తప్ప దేశంలో ప్రాతినిధ్యం వహించే మెజారిటీ పార్టీ ఒక్కటీ లేదు.

దేశ స్థాయిలో కాంగ్రెస్‌ను పడగొట్టి ఏ విధంగానైనా అధికారాన్ని హస్తగతం చేసుకోవాలని కాంగ్రెస్ మీద విద్వేష ప్రచారం జరిగిన విషఫలితమే రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలు అవతరించి అధికారానికి రావడానికి, కులమత తత్వాలు విజృంభణకు హేతువు. తమిళనాడులో డి.యం.కె. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, అస్సాంలో గణతంత్ర పరిషత్, మధ్యప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాలలో బి.జె.పి. అధికారానికి రాగలిగాయంటే, తమ అభ్యుదయ సిద్ధాంతాలకు తిలోదకాలిచ్చి కాంగ్రెస్‌ను నామ రూపాలు లేకుండా చేయాలనే లెఫ్ట్ పార్టీల గ్రుడ్డి ద్వేషమే కారణం!

కాంగ్రెస్ నాయకుల అవకతవకల రోసి, కాంగ్రె.తర పార్టీల ప్రచార ప్రభావానికి లోనై తాత్కాలికంగా పొరపాటు పడినా, ప్రజలు వెంటనే దొరికే తొలి అవకాశంతోనే తమ తప్పును తెలిసికొని సరిదిద్దు కుంటున్నారు; ఆ కాంగ్రెస్‌కే అధికారాన్ని అప్పగిస్తున్నారు. ఈ విధంగా కులమత ప్రాంతీయ తత్వాలకు అతీతమైన పార్టీగా. అన్ని వర్గాల ప్రజలకు ప్రాతినిధ్యం వహించే పార్టీగా దేశ సమగ్రతను పరిరక్షించగల పార్టీగా. 43 ఏళ్ల ప్రజల పరీక్షలో నిగ్గుతేలింది కాంగ్రెస్!

ఏ గాలికా చాప ఎత్తినట్లు, ఏ రోటి వద్ద ఆ పాటపాడినట్లు జమీన్‌రైతు ఎప్పుడు ఏ రాజకీయ పొంగు వుండిందో దాన్ని అనుసరించి లబ్ది పొంది వుండవచ్చు. ఎన్ని స్వార్థాలున్నా, ఎన్ని దుర్నీతులున్నా, ఎన్ని రుగ్మతాలున్నా కాంగ్రెస్ పట్లనే మొగ్గు చూపవలసి రావడానికి కారణం. దేశ సమగ్రతకు, స్థిరత్వానికి, ప్రస్తుతానికి కాంగ్రెస్ ఒక్కటే దిక్కు కావటమే. కాంగ్రెస్‌ను బలహీన పరచడం, దాని పతనానికి పాటుపడడం దేశాన్ని ప్రతీప శక్తుల పాల్జేయడమే అవుతుంది. ఈ ఒక్క బాధ్యతే మమ్ములను కాంగ్రెస్‌కు కట్టివేసినది. కష్టమైనా, నష్టమైనా సహకరించ వలసి వచ్చింది.

కాంగ్రెస్‌ను బలపరచినంత మాత్రాన కాంగ్రెసేతర పార్టీల కార్యకలాపాలను వార్తాపరంగా ఇవ్వకుండ వలసిన అవసరం లేదు. ఆ పార్టీల విధానాలలోని మంచిని ఎత్తి చూపి వుండవచ్చు; వాళ్ల సభలు సమావేశాలు, వుత్సవాలు వూరేగింపులు, ఆందోళనలు వుద్యమాల వార్తల వరకు బొమ్మలతోటె ప్రకటించి వుండవచ్చు. సిద్ధాంతాల విధానాల విషయంలో విభేదించి, విమర్శించి వ్రాసినా, కాంగ్రెస్ కార్యక్రమాలకు కాంగ్రెస్ నాయకుల కార్యకలాపాలకు ఇచ్చిన ప్రాధాన్యతనే కాంగ్రెసేతర పార్టీలకు నాయకులకు కూడా ఇచ్చివుంటె ''జమీన్‌రైతు'' వార్తా ప్రాధాన్యత వరకైనా పార్టీల కతీతమైన పత్రికగా అన్ని పార్టీల వారి సౌహార్థతను పొందుటకు వీలుండేది. ''జమీన్‌రైతు'' కాంగ్రెస్ పార్టీ అధికార పత్రికేమీ కాదు. అందువల్ల మామూలు సమయాల్లోనైనా పార్టీల కతీతమైన వైఖరి నవలంబించుటకు ప్రతిబంధక మేమీలేదు. సాంప్రదాయకంగా నేను కాంగ్రెస్ ఉన్మాదినైనందువల్ల, ఆ పిచ్చిని పత్రికకు కూడా పులిమి. దానికి నష్టం కలిగించానేమో ననిపిస్తుంది. సంపాదకుని రాజకీయ అనుబంధాలు, అనురాగాలు పత్రికలో ప్రతిబింబించ కుండడం ఉత్తమ సాంప్రదాయ మవుతుంది. ఆ సత్సాంప్రదాయాన్ని నేను అనుసరించలేక పోయాను.

కాంగ్రెస్‌లోని ముఠాల దుష్ప్రభావం నుండి జమీన్‌రైతు దూరం కాలేక పోయింది. 1946 ఎన్నికల నుండి కాంగ్రెస్‌లో ముఠాలు, తిరుగుబాట్లు, వెన్నుపోట్లు ప్రారంభమయ్యాయి. ఆ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థియైన శ్రీ బెజవాడ గోపాలరెడ్డి తిరుగుబాటు కాంగ్రెస్ అభ్యర్థి గండవరపు హనుమారెడ్డి గారిని ఎదుర్కొనవలసి వచ్చింది. శాసన సభ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్‌లో తిరుగుబాటు, వెన్నుపోటుకు శ్రీకారం చుట్టిన ఎన్నిక అది. ఆ తిరుగుబాటుకు మూలం కేవలం స్థానికంకాదు; పెద్దవారనుకొనే రాష్ట్ర నాయకుల నుండే ప్రేరణ ప్రోత్సాహలు లభించినట్లున్నాయి. స్వాతంత్ర్యానికి ముందు జరిగిన ఎన్నికలవి. స్వాతంత్ర్యానంతరం దేశం రిపబ్లిక్‌గా అవతరించిన తర్వాత వయోజన ఓటింగు పద్ధతిలో జరిగిన తొలి 1952నుండి1989వరకు జరుగుతున్న అన్ని ఎన్నికలలోను కాంగ్రెస్‌లో అంతర్గత పోరాటాలు, విద్రోహాలు, అవకాశ వాదాలు, పార్టీ ఫిరాయింపులు సర్వసాధారణమై పోయాయి. ఎన్నికల సమయంలో ఫిరాయించడం, ఎన్నికల అనంతరం మళ్లీ పార్టీలో దూరడం మామూలై పోయింది. ఈ మామూలు వ్యవహారం అధికారనిచ్చెన చకచక ఎక్కడానికి కొందరికి వూపునిచ్చింది. పార్టీ పట్ల భక్తివిశ్వాసాలు కల్గిన నిజాయితీ



పరులకు నిరాశా నిస్పృహలు మిగలగా అవకాశవాదులకు అన్ని అవకాశాలూ అందివచ్చాయి. మారిన పరిస్థితులకు అనుగుణంగా మారలేక, ఎక్కడికక్కడ ఆ జండా పట్టుకోలేక, ఏన్నికకా ఎన్నికను, ఏ నియోజక వర్గానికి ఆ నియోజక వర్గాన్ని తీసుకొని ఎప్పుడు ఎక్కడ ఎప్పుడు, ఎక్కడ ఎవరి బాక వూదాలో ఆ బాకా వూదలేక మొదటి నుండి ఒకే మాట ఒకే బాటగా ముక్కుసూటిగా నడచి నలగి పోయింది జమీన్‌రైతు. ఈ నలభై ఏళ్లుగా నా నడకే జమీన్‌రైతు నడక కాబట్టి దానికి బాధ్యుణ్ణి నేనే అవుతాను.

నేనొక రాజకీయ పరిశీలకుణ్ణే తప్ప ప్రత్యక్ష రాజకీయ వాదిని కాదు. 1978 - 84 మధ్య కాలంలో రాజకీయ వాదిననిపించు కోవలసి వచ్చింది. కానీ, వాస్తవంలో కాలేదు. పాత్రికేయ వృత్తిలో రాజకీయ పరిశీలకుడుగా ముఠా రాజకీయాలను విడమరచి చెప్పడంలో, విశ్లేషించడంలో, మంచి చెడులను మదింపు వేయడంలో, మంచి వైపు ఒకింత మొగ్గు చూపడంలో నాకు, నా ద్వారా జమీన్‌రైతుకు ముఠా మలినం అంటింది. తప్ప మనస్ఫూర్తిగా ఏ రాజకీయ వాది పట్ల నాకు వ్యక్తిగతంగా ద్వేషం లేదు. ఎవరితోను స్పర్ధలేదు. రాజకీయమైన కోర్కెలేమైనా వుంటే గదా ఎవరినైనా పైకి ఎత్తి, మరొకరిని క్రిందు చేయాలి? జిల్లాలోని రాజకీయ వాదులను గూర్చి వ్యక్తిగతంగా నాకు స్పష్టమైన అభిప్రాయాలున్నాయి. వారి రాజకీయ పోకడలు ఎత్తుగడల మీద సరైన సమగ్రమైన అవగాహన వుంది. గుణ దోషాలను బట్టి, పరిస్థితుల అవసరాన్ని బట్టి వ్యక్తులను వారి నడకలను లోతుగా సూటిగా నిశితంగా తరచి వ్రాయడంలో జమీన్‌రైతుకు ముఠా స్వభావము, వ్యక్తిగత అభిమాన దురభిమానం దురుద్దేశ్యం ఆపాదించ బడడానికి ఆస్కారం కలిగింది. నాలో ఒక బలహీనత వుంది. న్యాయమనుకొంటే వుచితమనుకుంటే, యోగ్యమనుకుంటే ఆ వ్యక్తుల విషయంలో, వారి సమస్యల విషయంలో వారు కోరకుండా, వారి ప్రమేయం లేకుండా వారే నేనై, వారి విషయం నా సొంత విషయంగా భావించి న్యాయాన్ని నిలబెట్టే గురుతర బాధ్యతంతా నా భుజస్కందాల మీద వున్నట్లు, అంతా నా మొహాన్నే తెల్లవారినట్లుగా భావించుకొని నిమగ్నతలో వ్రాయడం; దీని వల్ల నేను ఎవరి విషయమైతే వకాలతు పుచ్చుకున్నానో వారి ప్రత్యర్థులకు వారి మీద కంటే నా మీద, పత్రిక మీద ఎక్కువ ద్వేషం కలగడానికి అవకాశం కలిగింది. తామరాకు మీద నీటి బొట్టు వలె తాకీతాకకుండా, అంటీ అంటకుండా, ఎదుట వారిని నొప్పించక పోయినా దృష్టిని నొప్పించకుండా వ్రాయగలిగిన సంయమన దృష్టి శక్తి నాకు వుండివుంటే బాగుండేది.

కేవలం ఒక వ్యక్తి మీద అభిమానంతో మరో వ్యక్తి మీద ధ్వజమెత్తలేదు. అటువంటి వుద్దేశ్యమే నాకు లేదు. ఏదో ఒక సిద్ధాంతం కోసం, ఆశయం కోసం ఒక వ్యక్తినో వర్గాన్నో సమర్థించి మరొకరిని విమర్శించడం తప్ప - వ్యక్తుల మీద వున్న రాగద్వేషాలతో ఆ పని చేయలేదు. అందువల్లనే ఆయా సమయ సందర్భాలలో వ్రాసేటప్పుడు నాకు వ్యక్తులు కనిపించరు. విమర్శించారనేది తప్ప, అవాస్తవం విమర్శకు గురయైన వ్యక్తులకు ఎట్లా తెలుస్తుంది? తెలియనప్పుడు అపోహ పడడంలో, అపకారం చేయడంలో అసహజ ఏముంది?

1955 - 65 దశకం నెల్లూరు జిల్లా రాజకీయాలలో ఆనం వారి శకమనవచ్చు. ఆ పదేళ్ల కాలంలో జిల్లా అధికారమంతా వారి చేతిలో కేంద్రీకృతమై పోయింది. జిల్లాలోని ప్రజా జీవనాన్ని శాసించే అధికారం వారి పిడికిల్లో వుణ్ణింది. వారిని వ్యతిరేకించి నిలవడానికి ఎవ్వరికీ గుండెలు చాలేవి కావనుకోండి. వారికి వ్యతిరేకంగా మాట్లాడాలన్నా సాహసం వుండేది కాదు. ఆ రోజుల్లో ట్రంకురోడ్డులో జమీన్‌రైతును బహిరంగంగా కొనడానికి, చేత పట్టుకోడానికి కూడా భయపడే వారు. మిలటరీ నిరంకుశ పాలకులను రహస్య తిరుగుపాటు ద్వారా కూలద్రోసినట్లు 1965 చివరకు వచ్చేసరికి అగ్నిపర్వతం వలె ఆనం వారి మీద వ్యతిరేకత అకస్మాత్తుగా బ్రద్దలైంది. ఆ 'కు' నాయకుడు జిల్లా పరిషత్ ఛైర్మన్ నల్లపరెడ్డి చంద్రశేఖర రెడ్డి, ఆరు మాసాలలోగా తడ నుండి తాళ్లూరు వరకూ ఆనం వారి అంతే వాసులను కొనబడే వారందరూ తిరుగుబాటు బావుటా ఎగురవేశారు.

ఆ సమయంలో జమీన్‌రైతు వహించిన ప్రధాన భూమికను పాఠకులు ఈనాటికి మరువరనుకుంటాను. ఎస్.సి.ని మహా నాయకుడుగా చిత్రించి, జిల్లాలోని ముఖ్యులందరినీ ఆ తిరుగుబాటు జెండా క్రిందకు చేర్చి, ఒక మహా విప్లవంగా దాన్ని వర్ణించి కొండంత బలం చేకూర్చింది. 'జమీన్‌రైతు' కేవలం ఒక పత్రికగా 'జమీన్‌రైతు' అంత దూరం పోయి వుండకూడదు. ఆనం వారి మీద వ్యక్తిగతంగా నాకు ద్వేషమే లేదు. పైగా ఏ.సి. సుబ్బారెడ్డి గారంటే నాకు వ్యక్తిగతంగా అవ్యక్తమైన ప్రేమాభినాలుండేవి, వ్యక్తిగత అభిమానాలు దురభిమానాల కంటే ఒక కుటుంబ నిరంకుశత్వం క్రింద జిల్లా నలిగి పోవడం అన్యాయమని భావించే - అనాటి విప్లవానికి జమీన్‌రైతు యివ్వ గలిగినంత చేయూతనిచ్చింది. ఆ సందర్భంలో జమీన్‌రైతన్నా, నేనన్నా ఆనం వారికి ఆగ్రహం కల్గడం సహజం కదా? 1965లో ఆనం వారికి వ్యతిరేకంగా జరిగిన పితూరిని ప్రోత్సహించి నందుకు జమీన్‌రైతు పరోక్షంగా ఎంత మూల్యం చెల్లించ వలసి వచ్చిందో నాకు తెలుసు.



ఆనం వారి వ్యతిరేక వర్గానికి అనాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డి గారి అండదండలు పరిపూర్ణంగా వుండినాయి. రాపూరులో ఏ.సి. మీద కూడా ప్రత్యర్థిని ప్రోత్సహించారు బ్రహ్మానంద రెడ్డి. ఆయనకు వ్యతిరేకంగా స్వర్గీయ నలమోలు చెంచు రామానాయుడు గారిని కూడా తీసుకున్నారు బ్రహ్మానంద రెడ్డి. కొంత కాలానికి ఆనం వ్యతిరేక వర్గం అన్ని విషయాల్లో ఆనం వారిని మించి పోయింది. ఏ దుర్గుణాలు, దుర్నీతులు ఆనం వారిని వ్యతిరేకించడానికి కారణాలయ్యాయో ఆ చెడులన్నీ వీరిలోనూ చోటు చేసుకున్నాయి. అప్పుడు జమీన్‌రైతు ఆనం వ్యతిరేక వర్గం వారిని సూటిగా ప్రశ్నించింది. "కాంగ్రెస్ వాదులే కాదు, ఎవరైనా ఆనం వారిని ఎదిరించి మిమ్ములను బలపరచ వలసిన అవసరం ఏమిటి?" అని ఆ వర్గం వారి నీతిమాలిన పనులను నిర్మొగమాటంగా బహిర్గతం చేసింది. వారిని వ్యతిరేకించింది.

1967 సెప్టెంబరులో ఏ.సి. పరమపదించి నపుడు ఆ మహానాయకునికి తగినట్లు జమీన్‌రైతు ఒక ప్రత్యేక సంచికను తెచ్చి జోహారు అర్పించింది. ఆయన మరణానంతరం రాపూరు నియోజక వర్గానికి అభ్యర్థి ఎవరు అన్నప్పుడు ఏ.సి. రాజకీయ వారసుడు ఆనం సంజీవ రెడ్డేనని జమీన్‌రైతు నిస్సంకోచంగా చెప్పింది. ఆ కాలంలో జమీన్‌రైతును సంజీవ రెడ్డి ద్వేషించినట్లు మరెవ్వరూ ద్వేషించలేదు. సంజీవ రెడ్డికి మంత్రిత్వం వచ్చినప్పుడు కూడా హర్షాన్ని వెలిబుచ్చింది.

కోట–వాకాడు సఖ్యత అంతా ఇంతని చెప్పలేము. మధ్యలో స్వర్ణముఖి నదిలేనట్లు రెండూ కలిసి వున్నట్లుగా తోచేది. చంద్రశేఖర రెడ్డి హాజరు. శ్రీనివాసులు రెడ్డి గారి వుపన్యాసం లేని సభ వాకాడు – విద్యానగర్‌లలో వుండేది కాదు. ఎన్.సి. లేకుండా జనార్ధన రెడ్డి, జనార్ధన రెడ్డి లేకుండా ఎన్.సి. హైదరాబాదు ప్రయాణం వుండేది కాదు. పద్మశ్రీ స్వీకరించడానికి బాలకృష్ణారెడ్డి గారు ఢిల్లీ పోతుంటే సౌహార్ద చిహ్నంగా శ్రీనివాసులు రెడ్డి గారు సమిత్రకంగా ఆయన్ను అనుసరించారు. అంత మమేకంగా వుండిన కోట వాకాడులు, నల్లపరెడ్డి నేదురుమల్లులు 1972 ఎన్నికలలో పరమ శత్రువులై పోయారు. గూడూరు నియోజక వర్గంలో కాంగ్రెసు మీద తిరుగుబాటు చేసి స్వతంత్రంగా పోటీ చేసాడు శ్రీనివాసులు రెడ్డి. కాంగ్రెస్ అభ్యర్థిని శ్రీమతి శారదాంబను బలపరచాడు జనార్ధన రెడ్డి. గూడూరు తాలూకా రాజకీయాధికారాన్ని గుత్తకు తీసుకున్న తమను వ్యతిరేకించ గలిగినంతటి వాడా జనార్ధన రెడ్డి. అంత ధిక్కారమా అనేది అతని మీద శ్రీనివాసులు రెడ్డి ద్వేష కారణం. జనార్ధన రెడ్డి మీద, వాకాడు సంస్థల మీద శ్రీనివాసులు రెడ్డి కత్తి కట్టడానికి కారణం, జనార్ధన రెడ్డి చేసిన నేరం – అదే జనార్ధన రెడ్డి జీవితం రాజకీయ మలుపులు తిరిగింది కూడా అప్పుడే!

జనార్ధన రెడ్డి రాజ్యసభ సభ్యుడు కావడం, శ్రీమతి ఇందిరాగాంధీ వంటి కాంగ్రెస్ అగ్రనాయకులకు సన్నిహితుడు కావడం, రాష్ట్ర ప్రభుత్వంలో కూడా పలుకుబడి కలిగి వుండటం నల్లపరెడ్డి వారి కడుపులో మంట రగిల్చింది. గూడూరు ప్రాంతంలో తమ సార్వభౌమాధికారానికి జనార్ధన రెడ్డి సవాలుగా పరిణమించాడని, వేలాది పేద విద్యార్థులకు ఆశ్రయం ఇస్తుండిన వాకాడు సంస్థల విధ్వంసానికి పూనుకున్నారు. రెండవ రంగంగా రాజకీయంగా జనార్ధన రెడ్డిని ఎదుర్కోవడానికి 1972 లో కాంగ్రెస్‌ను ఓడించి గెల్చిన శ్రీనివాసులు రెడ్డి 1978 ఎన్నికలొచ్చేసరికి, వెంకటగిరిలో కాంగ్రెస్ అభ్యర్థిగా వెలిశాడు. జనార్ధన రెడ్డి రాజకీయ జాతకంలో రెండవ పెద్ద మలుపు 1978 ఎన్నికలు. జిల్లాలో పేరున్న ప్రతి కాంగ్రెస్ నాయకుడు వెంగళరావు కాంగ్రెసుకు పోయారు. జిల్లాలో ఇందిరా కాంగ్రెస్ నాయకత్వానికి జనార్ధన రెడ్డి ఒక్కడే మిగిలాడు. ఇందిరా ప్రభంజనంలో పది మంది అభ్యర్థులు గెలవడం, ఆయన రెవిన్యూ మంత్రి కావడమే గాక సూపర్ ఛీఫ్ మినిస్టరుగా ఎదురులేని అధికారాన్ని చెలాయించడం జనార్ధన రెడ్డిని దెబ్బతీయలేక నిస్పృహతో శ్రీనివాసులు రెడ్డి తెలుగుదేశం జండా పట్టడం; 1983లో ఓడినా, 1985 లో టికెట్ నిరాకరించ బడినా జనార్ధన రెడ్డి నిశ్చలంగా విశ్వాసపాత్రంగా కాంగ్రెస్ లోనే కొనసాగడం, 1989 ఎన్నికలొచ్చేసరికి శ్రీనివాసులు రెడ్డి మరలా కాంగ్రెస్‌లో ప్రవేశించడం అందరికీ కరతలా మలకమైన చరిత్ర.

జిల్లాలో రాజకీయాధికారం కొన్ని కుటుంబాలకే పరిమితమై వుండింది. కాంగ్రెస్ భూస్వాములు, ధనస్వాముల పలుకుబడిలోనే వుండినది. అవకాశ వాదం దొరబాబులా చెలామణి అయిపోతుండినవి. వాటిని ఛేదించ డానికి, ఒక కొత్త మధ్య తరగతి యువ నాయకత్వ ఆవిర్భావానికి 1978 సాధారణ ఎన్నికలు చక్కని అవకాశాన్ని కల్గించాయి; అనూహితంగా జనార్ధన రెడ్డికే ఆ నాయకత్వం లభించింది. ఆ ఎన్నికలో జమీన్‌రైతు ఏటికి ఎదురీద వలసి వచ్చింది. వాస్తవ పరిస్థితులకు విరుద్ధంగా ప్రచారం చేస్తున్నామనే అపోహను, అపవాదును భరించవలసి వచ్చింది. కానీ ఫలితాలు వెలువడిన తర్వాత దురభిప్రాయ పడిన వారే నోరు తెరిచారు.

జనార్ధన రెడ్డిని ఎందుకు బలపరచ వలసి వచ్చింది. ఎందుకు బలపరచింది పై వివరణను బట్టి పాఠకులకు అవగత మవుతుంది. 1978 తర్వాత కాంగ్రెస్‌ను బలపరచడమంటే జనార్ధన రెడ్డిని బలపరచడమే అయింది. 1978



ఎన్నికలలో కాంగ్రెస్ (ఆర్) పక్షం వహించి ఇందిరా కాంగ్రెస్ ప్రత్యర్థులైన వారందరూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారానికి వచ్చేసరికి ఒకరొకరుగా మరలా ఇందిరా కాంగ్రెస్‌లో దూరను మొదలు పెట్టారు. 1978 ఎన్నికలై కాంగ్రెస్ అధికారానికి వచ్చిన నాటికి ఇందిరా కాంగ్రెస్‌లో జనార్దన రెడ్డి వ్యతిరేకిగా వున్న వాడు ఒక్క నల్లపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి మాత్రమే. ఆ ఎన్నికలో విజయులైన పదిమంది కాంగ్రెస్ శాసనసభ్యులలో నికరంగా ఎనిమిది మంది జనార్దనీయులు. అటువంటిది క్రమంగా జనార్దని రెడ్డి ప్రత్యర్థి వర్గం పెరిగింది. దానికి కారణాలనేకం. కొత్తగా వచ్చి రావడంతోటే అధికార శిఖరాల్ని అందుకొన్నాడనే అసూయ ఒక కారణమైతే, మంత్రిగా జనార్దన రెడ్డి తన వైఖరితో చేజేతులా కల్గించుకున్న విముఖత మరో ప్రబలమైన కారణం. అగ్నికి ఆజ్యం అన్నట్లు శ్రీనివాసులు రెడ్డి ఎడతెగని విష ప్రచారం వుండనే వుండింది. జనార్దన రెడ్డి ప్రాభవం కూడా ఒడిదుడుకులకు లోనైంది. 1983 ఎన్నికలొచ్చేసరికి జనార్దన రెడ్డి మీద వున్న వ్యతిరేకత తారా స్థాయికి చేరుకున్నది. ఆ ఎన్నికలో ఓటమితో ప్రారంభమైన పదకొండేళ్ల ఆయన రాజకీయ జీవితం క్షీణ దశకు వచ్చింది.

జనార్దన రెడ్డి రాజకీయ క్షీణ దశ రాష్ట్రంలో కాంగ్రెస్‌కే పతన దశగా పరిణమించింది; అది వేరే విషయం. ఇక్కడ నేను చెప్ప దలచుకున్నది జనార్దన రెడ్డిని జిల్లాలో ఒక రాజకీయ శక్తిగా ఆవిర్భవింప జేయడంలో తీసుకున్న చొరవ వల్ల, కాంగ్రెస్‌లో ప్రోత్సహించ దగిన, పైకి తేదగిన ఒక వ్యక్తిగా ఆయన్ను బలపరచడం వల్ల జనార్దన రెడ్డి మీద ఏర్పడిన అసూయాద్వేషాలు, వ్యతిరేక విరోధాలు జమీన్‌రైతు మీద, ప్రత్యేకంగా వ్యక్తిగతంగా నా మీద ప్రతికూల ప్రభావాన్ని తీవ్రంగా చూపాయి. అపవాదులు నిందలు దూషణలు తిట్లు ఛీత్కారాలు బెదరింపులు ఒక్కటి కాదు – ఆవేదనా భరితమైన ఆ అనుభవం పగ వాడికి కూడా వద్దు అనిపిస్తుంది.

లోకులు పలు కాకులు కావడం తప్పితే జమీన్‌రైతు ను నిశితంగా చదివే పాఠకులెవరైనా అంత గ్రుడ్డిగా విమర్శించరు. దురభిప్రాయ పడరు. 1979-81 మధ్యకాలంలో జమీన్‌రైతులు తిరగవేయండి; అంజయ్య హయాంలో జరిగిన పంచాయితీ ఎన్నికలలో జమీన్‌రైతు వైఖరిని నెమరు వేసుకోండి. 1983 కాంగ్రెస్ అభ్యర్థుల నిర్ణయంలో జరిగిన పొరపాట్లను 'జమీన్‌రైతు' ఎంత నిర్మొహమాటంగా ఎత్తి చూపిందో, దుయ్య బట్టిందో జ్ఞాపకం చేసుకోండి, ఈ విధంగా ఎప్పటికప్పుడు జనార్దన రెడ్డిలో కాని, ఆయన వర్గీయులలో గాని ఏ లోపమున్నా ఎత్తి చూపుతూనే వుంది. జమీన్‌రైతు, ఈ వైఖరి వల్ల నేను, జమీన్‌రైతు చెంపదెబ్బ గోడదెబ్బ రెంటికీ గురి కావలసి వచ్చిందనే సత్యం ఎవ్వరికీ తెలియదు. ఆనాడు గానీ ఏనాడు గానీ నా మనసులో వుండేది 1978 మార్చి. అంతకు ముందు నాటి జనార్దన రెడ్డే 1978 జూలైలో ఎం.ఎల్.సి. ఇచ్చిన జనార్దన రెడ్డిని మరచి పోయావా అంటారేమో? అంత అభిమాన గౌరవాలు చూపిన వ్యక్తి ఎట్లా మరపుకు వస్తాడు? నాకు పదవినివ్వడం ద్వారా జనార్దన రెడ్డి తన విశ్వాస పూరిత హృదయాన్ని. స్నేహమాధుర్యాన్ని చాటుకున్నాడు. కాని అప్పుడు నేను దానికి ఆశ పడకుండా వుంటే బాగుండేదని తర్వాత నుండి అనేక సార్లు అని పిస్తుంటుంది. పదవులు, పనులు, ప్రయోజనాల కోసం రాజకీయ వాదుల మధ్య ఏర్పడే సంబంధం లాంటి దైతే జనార్దన రెడ్డితో నా స్నేహం ఏనాడో తెగిపోయి వుండేది. విముఖతలు విభేదాలకు, అసంతృప్తులు విరక్తులకు మొహం మొత్తుడులు మనస్తాపాలకు అతీతమైన అవ్యాజమైన స్నేహ సంబంధం కాబట్టే అది అట్లా అట్లా కొనసాగుతున్నది. జనార్దన రెడ్డి విషయంలో విశదీకరణ దీర్ఘమైనదే అయింది. జనార్దన రెడ్డి విషయంలో మేము దురభిప్రాయానికి గురియైనట్లు ఇటీవల కాలంలో ఎవరి వల్లా కాలేదు. అందువల్ల విశదీకరణ నిడివి పెరిగింది. జమీన్‌రైతుకు ఎప్పుడూ ఏదో ఒక ముద్ర పడుతూనే వుంది. కొంత కాలం రంగా పత్రిక అన్నారు; తర్వాత గోపాలరెడ్డికి అమ్ముడు పోయిందన్నారు; ఇప్పుడు జనార్దనీయం అంటున్నారు. కాని ఎప్పుడూ జమీన్‌రైతు జమీన్‌రైతుగానే వుంటున్నది.

శ్రీ నల్లపురెడ్డి శ్రీనివాసులు రెడ్డిని గూర్చి కూడా మా వైఖరిని వివరించ వలసిన అవసరం వుంది. ఆయన పట్ల వ్యక్తిగతంగా మాకు వ్యతిరేకత వుండవలసిన అవసరం లేదు. మేమంటే ఆయనకు గౌరవ ప్రపత్తులుండినాయి. తొలిసారిగా ఆయన మంత్రి అయినప్పుడు మొట్టమొదట ఎం.ఎల్.ఎ. క్వార్టర్సులో నా రూముకు వచ్చి శుభాకాంక్షలు అభిలషించాడు. తాను సమితి అధ్యక్షుడుగా వున్నప్పటి నుండి తన, తన వర్గ కార్యకలాపాలు, సభలు సమావేశాలకు సంబంధించిన ప్రకటనలు జమీన్‌రైతుకు దండిగా ఇచ్చేవాడు. తెలుగుదేశంలో వుండగా మేము చేసిన విమర్శలను కూడా పరిగణనలోకి తీసుకోకుండా తన కుమారుని వివాహానికి సతీసమేతంగా ఇంటికి వచ్చి పిలిచాడు. మరచాను ..... ఆయన చక్కెర మంత్రిగా వున్నప్పుడు నాకు నెల్లూరు ఫ్యాక్టరీలో రసం లేని చెరుకు గడ వంటి ఒక పదవి వచ్చింది ఆ నియామకం నాకు ఆశ్చర్యమే. తర్వాత ఎవరో అన్నారు శ్రీనివాసులు రెడ్డి చేయించింది అని. ఇన్ని విధాలుగా సుహృద్భావాన్ని చూపిన శ్రీనివాసులు



రెడ్డిని వ్యక్తిగతంగా అయితే ఇంత నిర్మొగమోటంగా, నిస్సంకోచంగా ఎందుకు విమర్శించ వలసి వస్తుంది? వ్యతిరేకించ వలసి వస్తుంది? ప్రకటనల ఆదాయాన్ని ఎందుకు పోగొట్టుకో వలసి వస్తుంది? వ్యక్తిగత లాభాలను ఎందుకు జారవిడుచుకో వలసి వస్తుంది?

పార్టీలు మారి అవకాశ వాది కావడమే కాదు, జై ఆంధ్ర వుద్యమంలో అతని విధ్వంసక పాత్ర మొదలుకొని శ్రీమతి ఇందిరా గాంధీ, రాజీవ్‌గాంధీలను అసహ్యంగా దూషించడం మొదలు పి.వి. నరసింహా రావు మొదలు నేడు రెండవ సారి వచ్చిన డాక్టర్ చెన్నారెడ్డి వరకు ఒక్క అంజయ్యను మినహాయించి– ముఖ్యమంత్రులందరినీ దుర్భాషలాడడం వరకూ శ్రీనివాసులు రెడ్డితో స్వప్రయోజనం తప్ప రాజకీయ సిద్ధాంతాలు విశ్వాసాలు, క్రమ శిక్షణ, నిజాయితీ నిలకడ హుందాతనం ఏవీ లేవని తెలుస్తుంది. ఆయనతోటి మేమే కాదు ఆయనకు తోడు బోయిన వాళ్లు తప్ప ఎవరు మారుతుంటారు? అట్లా మారలేక పోవడమే మా దోషం. ఎవరి అభిమాన దురభిమానాలను బట్టి వారు, ఎవరికారణాలను బట్టి వారు, ఎవరి తత్వాలను బట్టి వారు ఏ విధంగానైనా అనుకోవచ్చు. కానీ శ్రీనివాసులు రెడ్డి విషయంలో మా దృక్పథం రాజకీయ విలువలకు సంబంధించనదే?

డాక్టర్ బెజవాడ గోపాల రెడ్డి గారు ప్రారంభ దినం నుండి జమీన్‌రైతులో అనుబంధం కల్గిన వారు. దానిపట్ల ఆదరాభిమానాలు కలవారు. ఇన్నేళ్లుగా జమీన్‌రైతులో ఎటువంటి విమర్శకు గురికాని ఏకైక నాయకుడాయన. రాజకీయాలలో వున్నత ప్రమాణాలు పాటించే విశాల హృదయుడాయన. తెలుగుదేశం ముఖ్యమంత్రి ఎన్టీరామారావుచే జరుపబడిన సోమశిల ప్రారంభోత్సవ సభలో గోపాలరెడ్డి గారు పాల్గొన్న సందర్భంలో ఆయన లభిమానులలో వ్యక్తమైన అభిప్రాయాలను నేను వ్రాతలో పెట్టి ఆయనను నొప్పించ వలసి వచ్చింది. నా వ్రాతకు అందరూ హర్షించారు. కానీ గోపాల రెడ్డి గారి మనసులో ఏర్పడిన కొరతను తీర్చగలవారెవరు? ఈ విధంగా అభిమానులు, అనుకూలు రనుకునే వారిని ప్రతి కూలురుగా చేసుకోవడంలో, కనీసం వారి సానుభూతిని కోల్పోవడంలో సిద్ధహస్తమైంది నా కలం?

Regd. No. HNL 18.

# జమీన్‌రైతు

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు

జమీన్ రైతు జీవప్రదాత
నెల్లూరు శ్రీరామమూర్తి
స్మారక అనుబంధం.




సంపుటి: 64, సంచిక: 30
1993 జూలై 23 తేది
శుక్రవారం
48 పేజీలు :: వెల రెండు రూపాయలు

మీరు లేని ఈ జగతినిండా దరికానని తిమిరం—
దారిచూపేదీపమారిపోతే సాగేదెటు మా పయనం?



పాత్రికేయుడుగా శ్రీరామమూర్తిగారి ప్రజాభిమానాన్ని వ్యక్తపరిచేందుకు పట్టిన అద్దం వలె జరిగిన ఆయన అంతిమ యాత్రలోని జన సందోహం

# ఈ శూన్యం నిండదు, ఈ శోకం తీరదు !

'జమీన్‌రైతు' జీవన జ్యోతి ఆరిపోయింది. నలభై ఐదేళ్లపాటు నిరంతర, నిర్విరామ నిరుపమాన సేవతో అలసి, సొలసి, శక్తి వుడిగి పోయిన ఒక సంపూర్ణ మానవతా మూర్తి కాలగర్భంలో కలసి పోయింది.

వార్తలే ప్రాణంగా, పత్రికే ప్రపంచంగా, వ్రాతలే వ్రతంగా తపించి, పరితపించిన ఒక అసాధారణ పాత్రికేయ కల్పవృక్షం నేల వాలిపోయింది.

నెల్లూరు శ్రీరామమూర్తి గారు కన్ను మూశారు. జమీన్‌రైతుతో తన ఐదు దశాబ్దాల ప్రగాఢానుబంధాన్ని విడదీయరాని సంబంధాన్ని వదలుకొని, బంధాలు త్రెంపుకొని వెళ్లిపోయారు. నిన్నటి వరకు పెద్ద దిక్కుగా, పులిలా కార్యాలయ భవనంలో తారాడిన ఆయన నేడి మంది కన్పడడంటే నమ్మడం కష్టంగా వుంది. ఆ నమ్మకుండడమెట్లా? కఠోరమైన ఆ నిజాన్ని నమ్మి జీర్ణించుకోవడమెట్లా?

జమీన్‌రైతు – రామమూర్తి గారు వేరు వేరు కాదు; అది శరీరమైతే, ఈయన దాని ప్రాణం; రామానాయుడు గారు ఇహలోకం వీడి వెళ్తూ, జమీన్‌రైతును రామమూర్తి గారి అర్ధ శరీరంగా అమర్చివెళ్లారు. ఆనాటి నుంచి ఆఖరి శ్వాస పీల్చే వరకు ఆయనకదే ధ్యానం, అదే లోకం, అదే పిచ్చి, అదే ప్రపంచం, అదే తపన, అదే పరితాపం, వేరొక ధ్యాసలేదు, వేరొక ఆలోచన లేదు, వేరొక దృష్టిలేదు, వేరొక తలంపు లేదు. ఎప్పుడూ వెన్నంటి వుండే నీడగా, రాత్రి పగలు కళ్లముందు కదలాడే కలగా జమీన్‌రైతు ఆయన ఊపిరిలో ఊపిరై పోయింది. ఇప్పుడా ఊపిరి ఆగిపోయింది; ఆ శ్వాస నిల్చిపోయింది. యాభై ఏళ్ల సహచరుడ్ని, సారథిని, సచివుడ్ని, కోల్పోయిన జమీన్‌రైతు విల విల లాడిపోతున్నది; తల్లడిల్లి పోతున్నది.

> **శ్రీరామమూర్తిగారు లేని జమీన్ రైతు దేముడు లేని దేవాలయమే! ఆ లోటు ఎప్పటికీ పూడదు!**

రామానాయుడు గారు కేవలం జమీన్‌రైతు జనకుడు మాత్రమే. కష్టాలు పడినా, నిష్ఠూరాలు అనుభవించినా ఆయనకానాడు స్వాతంత్ర్యోద్యమ అండ వున్నది. ఉద్యమ నాయకుల ఆసరా వుండింది; ఆ ప్రవాహంలో తాను కొట్టుక పోయి, జమీన్‌రైతును గట్టెకించారు. కాని ఒక ఉద్యమం కోసం పుట్టి, ఉద్యమం కోసం బ్రతికిన ఈ పత్రికను సాధారణ వార్తా పత్రికగా మల్చి, పాఠక ప్రియత్వం చేకూర్చి, వజ్రోత్సవం వరకు తీసుక రావడంలో శ్రీరామమూర్తి గారు పడిన శ్రమ, చూపిన నైపుణ్యం అనితర సాధ్యమైనవి. జర్నలిజం ఆయనకు అనిధారావ్రతం; పుట్టుకతో అబ్బిన ప్రావీణ్యం. వ్యాఖ్యలను వార్తలో అంతర్లీనం చేసి వ్రాయడం ఆయన స్పెషాలిటీ. రాజకీయ వార్తలు వ్రాసేటప్పుడు ఆయన కలం ఎన్ని సోయగాలు పోయేదో చెప్పలేము. చిన్న చిన్న పదాలతో, సామాన్యమైన మాటలతో చదివే వారి మనసులకు సూటిగా హత్తుకునేటట్లు వ్రాసేవారు. పేనా కాగితం పై పెడితే – అదొక గంగా ప్రవాహమే. బావిలో నుంచి జలవూరినట్లు భావాలు, విమర్శలు వెలికి వచ్చేవి. సెలయేటి ప్రవాహం వలె పదాలు ఉరికి వచ్చేవి. మొదలు పెడితే కలం ఆగేదే కాదు. సరిగా లేదని కాగితం చించి మళ్లీ వ్రాయడం కనీసం కొట్టి వేతలు, దిద్దుబాట్లు కూడా వుండేవి కావు. జిల్లా నైసర్గిక స్వరూపం, జిల్లా రాజకీయాల అనుపానులు, నాయకుల స్వభావాలు, లోగుట్టులు, ఆయనకు కొట్టిన పిండి. అసాధారణమైన ధారణ శక్తి, జ్ఞాపక శక్తి ఆయనవి. ఒకసారి విన్నవి మర్చిపోయేవారు కాదు. అందువల్లే జిల్లా రాజకీయాల పై ఆయన విమర్శ, లేదా వ్యాఖ్య చేస్తే దానికి తిరుగుండేది కాదు. వ్యాఖ్య కూడా సూటిగా, చాలా చిన్నదిగా, నసాళానికి అంటేదిగా వుండేది. చదివిన వారు నవ్వుకుంటే, వ్యాఖ్యకు గురైన వారు విలవిల లాడిపోయేవారు.

ఎన్నికల సమయంలో ఆయన కలం విశ్వరూపం ప్రదర్శించేది. 1952 నుంచి 1989 వరకు ఏ ఎన్నికలోనూ ఆయన అంచనాలు తప్పి పోలేదు. జనం నాడిని గ్రహించి, జరగబోయేది ఖచ్చితంగా వూహించగల అద్భుత నైపుణ్యం శ్రీరామమూర్తి గారిది. ఎన్నిక ఫలితం వచ్చే వరకు పాఠకులు ఏందబ్బా ఇట్లా వ్రాస్తున్నారు అనుకునే వారు; ఫలితం చూశాక అబ్బురంతో నోరు వెళ్లబెట్టేవారు.

క్రైం రిపోర్టింగ్ ఆయన మరొక స్పెషాలిటీ. హత్యలు, నేరాలు, మోసాలు జరిగినప్పుడు వాటి కూపీ లాగి, పరిశోధన చేసి, తల పండిన న్యాయశాస్త్ర కోవిదుడి వలె ఆ సంఘటన అనుపానాలు పరామర్శించి పాఠకుల కళ్లెదుట నిల్పేవారు. మైపాడులో జరిగిన కళారాణి, చంద్రికారాణి హత్యల కేసు సముద్రంలో కలిసి పోకుండా వెలుగు చూసిందంటే అది శ్రీరామమూర్తి పరిశోధనా నైపుణ్య ఫలితమే. సాధారణమైన ఆ జంట హత్యల కేసును ఒక ప్రజాందోళనగా మార్చి, అంతర్జాతీయ ప్రాధాన్యత కల్గిన కేసుగా మల్చిన ఘనత ఆయనదే. నలభై ఐదేళ్ల కాలంలో అటువంటి ఎన్ని సంఘటనలో!

కొరవ 7వ పేజీలో

## మరణంలో స్వారూప్యం

జమీన్‌రైతు జనకుడు స్వర్గీయ నెల్లూరు వెంకట్రామా నాయుడు, జమీన్‌రైతు జీవ ప్రదాత నెల్లూరు శ్రీరామమూర్తి గారు ఒకే వయస్సులో మరణించడం విధి విచిత్రం. రామానాయుడు గారు జన్మించింది - 1891 మే 28 తేది; మరణించింది - 1959 ఫిబ్రవరి 7 తేది; రామమూర్తి గారి జననం 1925 అక్టోబరు 17, మరణం - 1993 జూలై 19 తేది. మరణ సమయానికి ఇద్దరి వయస్సు 67 సంవత్సరాల 9 నెలలు. ఇద్దరు కనుమూసింది వేకువ ఝాము ఘడియల్లో! భగవంతుడు జమీన్‌రైతు కోసం వారిద్దరిని పుట్టించి, నిర్ణీత సమయం తర్వాత తన వద్దకు తీసుక వెళ్లాడేమో నన్పిస్తోంది. ఈ యాదృచ్ఛిక మరణాల పోలిక చూస్తే!



శ్రీరామమూర్తి గారు తన ఆరోగ్యాన్ని సైతం లెక్క చేయకుండా, స్వయంగా దగ్గరుండి నిర్మింపజేసిన జమీన్‌రైతు నూతన భవన సుందర దృశ్యం

చివరి వ్రాత

# పినాకినీ తీరం

జిల్లా రాజకీయాలు, ఇతర సమస్యల పట్ల తన భావాలను 'పినాకినీ తీరం' శీర్షికలో నిర్మొగమాటంగా, నిర్భీతిగా వ్యక్తం చేసే వారు శ్రీ రామమూర్తిగారు. జమీన్ రైతు చేతికందగానే పినాకినీ తీరం చదవడం ఎందరో పాఠకులకలవాటు. ఆయన చివరిసారిగా కోవూరు ఎన్నికల ఫలితంపై వ్రాసినదిది. ('1993 మే 21వ తేదీ సంచిక ) ఆ తర్వాత అనారోగ్య కారణంతో పత్రికకు ఏదీ వ్రాయలేక పోయారు.

## ఏమవుతుందో!

ఈ పత్రిక పాఠకుల చేతికందేలోగానే, కోవూరు ఎన్నిక ఫలితం వెవిన పడిపోతుంది. అటువంటప్పుడు ఏమవుతుందో అని అదుర్దాగా వ్రాయడం వ్యర్థం గదూ! కలం వులలాటం అటువంటిది; ఏమి చేయమంటారు!

నలుగురిలో ఎవరో ఒకరు గెలవాలి – ఆ ఒకరు ఎవరు? ఆ రహస్యాన్ని బ్యాలెట్ బాక్సులు భద్రంగా దాచివున్నాయి; శుక్రవారం సాయంత్రానికి బయట పెట్టేస్తాయి. పొట్ట వుబ్బరం – అంత ఓపిక పట్టేదెట్లా?

పోలింగు పూర్తయి తిరిగి వచ్చిన వారి మంది బుధవారం సాయంత్రం కబుర్లు వింటూంటే తియ్యగా నోరూరింది. అటువంటిది గురువారం వుదయానికల్లా నీరు గారడం మొదలైంది, సాయంత్రానికి నిరాశ విగిలింది. గెల్చే వారి సంబరం, ఓడే వారి అవమాన విచారాలు వుండనే వుంటాయి; శుక్రవారం సాయంత్రం ఏ కబురు తెస్తుందోనని టెన్షన్ మనలను తినేస్తుంది; తప్పదు.

నలుగురు పోటీలో వుండి ఈ ఎన్నిక వలె వుహాకందని పరిస్థితి నెలకొన్న ఎన్నిక మన జిల్లాలో వున్నట్లు నా స్మృతికి రావడం లేదు. మజరాల్తో, కాలనీలతో సహా ప్రతి గ్రామాన్ని, ప్రతి ఇంటిని, ప్రతి ఓటరును ఇంతగా ముట్టడింపబడిన ఎన్నిక కూడా కనపడడం లేదు. నాయకులు, కార్యకర్తలు, నిష్పాక్షిక పోలింగుకు జరిగిన కఠినమైన ఏర్పాట్లు, ఎంత ముఖ్యులనైనా నిలదీయ గలిగిన అధికార్ల నిర్భీక వర్తన, వాగ్దానాల జల్లు, ధన ప్రవాహం, పసికట్టడానికి బ్రహ్మతరం కూడా కాని ఓటరు మహాశయుల నిగూఢ గంభీర మనోగతం... ఒక్కటేమిటి, అన్ని విషయాల్లో ఇంత భారీగా, కేంద్రీకృతంగా, గుంభనంగా జరిగిన వుపఎన్నిక కూడా ఎరుగము. ఈ

కొనసా 12 పేజీలో

తొలి రిపోర్టింగ్

# మంత్రి భక్తవత్సలం పర్యటన

కండ్లేరు వంతెన ప్రారంభోత్సవం – కనుపూరు కాల్వ ఆద్యంతాల దర్శనం – వెంకటాచల సత్రం వద్ద కనుపూరు కాల్వ రైతుల సభ, నెల్లూరు పౌరుల సభ, ఇవీ కార్యక్రమాలు

''నన్ను మంత్రిగా గాక కాంగ్రెసు వాదిగానే ప్రజలు గౌరవిస్తున్నారని నా నమ్మకం. ఈ మంత్రి పదవులలో వుండి రానున్న అంతిమ స్వాతంత్ర్య పోరాట విజయ సాధనకు చేయదగిన కృషినంతా చేస్తాము.

ప్రజలలో ప్రజ్వలమైన నూతనోత్సాహము, తమ ప్రభుత్వం పట్ల వారు చూపుచున్న శ్రద్ధ ప్రశంసనీయము.

– మంత్రి భక్తవత్సలం

1946 జూలై 6వ తేదీ సంచికలో శ్రీరామమూర్తి గారు జమీన్‌రైతుకు చేసిన తొలి రిపోర్టింగ్ ఇది; అక్షరాభ్యాసంలోనే ఆయన కలం ఎన్ని సోయగాలు తిరిగిందో చూడండి!

వంతెన వద్ద చక్కటి పందిరి నిర్మించి, ఖద్దరు అలంకరణాల మర్చబడినవి. ఆ తాలూకాలో ముఖ్య రైతాంగమే గాక, మైకా గనుల సంబంధీకులు గూడా వచ్చారు.

ఉ. 9 గంటలకు వస్తాడనుకొన్న మంత్రి 12 గంటలకు గాని రాలేక పోయాడు. ఉదయం లేచి 107 మైళ్లు రావద్దా మరి.

ప్రథమంలో బాలుడు పి. వెంకటేశ్వర్లు ప్రార్థన జేశాడు. కాంగ్రెసు గీతావళితో, కరవు భీతావళితో, తర్వాత రాళ్ళు గుండ్లు దూకిస్తూ మహాభీకర వేగంతో ప్రవహించు కండ్లేటి నదీమతల్లింబోలె వేప కొమ్మ వారి కవితాస్రవంతిని, మన కామరాజా గడ్డ దుష్యంతుడు సంగీతంతో ఆలపించాడు మధుర రసోల్బణంగా.

మంత్రిగారు లాంఛన ప్రాయమైన త్రాడు దెంపి ప్రవేశోత్సవం జరిపిరి, తర్వాత యింజనీరు గారు బ్రిడ్జి రూపనామ క్రియల స్వరూప నివేదిక తడవినంతట మంత్రిగారు యి వ్విధంగా ఉపన్యసించిరి.

''యీ వంతెన యిది వరకు వైపన్ ప్రణాళికతో ప్రారంభమైంది. యుద్ధకాలం వల్ల వంతెన నిర్మాణం వెనుక బడ్డది. దీని అంచనా 12 వేలయినా దాదాపు 66,300 రూపాయలు, యుద్ధకాలపు వస్తువుల ప్రియం వల్ల వెచ్చింపబడ్డది. వంతెన పని ఆలశ్యంగావడం గూడా ఒక శుభసూచకమే అయింది. ఏమంటే 44 సం. ప్రవాహాల వల్ల యింజనీర్లకు యేర్పడిన నూతన అనుభవముల వల్ల ఈ వంతెనకు మొదట 13 గండ్లు అంచనాకు బదులు యిప్పుడు 18 గండ్లు పెట్టి పెంచ వలసి వచ్చింది. యీ రహదారి ప్రపంచ ప్రఖ్యాతి చెందిన మైకా పరిశ్రమ రాక పోకలకు అత్యంతోపకారి కాగలదు. ఒక ప్రక్క

కొరవ 9 పేజీలో

## కన్నీటి నీరాజనం



నా కష్టసుఖాలను విప్పి చెప్పుకొంటే,

ఉత్తమ సలహా సహకారాన్నందించి

దిటవు పలికే ఆప్తులు, పితృసమానులు, గొప్ప వ్యక్తి

### శ్రీ నెల్లూరు శ్రీరామమూర్తి గారు

ఇక లేరంటే నాకు నట్టినడి సముద్రంలో

చుక్కాని లేని నావ లాగుంది. ఈ లోటు ఎవరూ పూరించలేనిది.

వారి దివ్య స్మృతికి నా కన్నీటి నీరాజనం!

ఇంతకంటే నేనేం చేయగలను?

కలవకూరు చంద్రయ్య

(కె.వి.ఆర్. – నెల్లూరు)

# అపోహలపాలైన ఉదాత్తలక్ష్యం!

## జనార్ధనరెడ్డితో స్నేహానుబంధం ఆధార రహిత నిందలకు గురి చేసి క్షోభ పెట్టింది!

శ్రీరామమూర్తి గారి నలభై ఐదేళ్ల పాత్రికేయ చరిత్రలో ఇతరులు ఆక్షేపించింది, వేలెత్తి చూపింది ఒకే ఒక అంశం – అది జనార్ధన రెడ్డితో సంబంధం! వారిద్దరి స్నేహ బాంధవ్యాన్ని ఎందరో విమర్శించారు; విష ప్రచారం చేశారు; నిందలు వేశారు; అపనిందల పాల్జేశారు; దూషిస్తూ జాబులు వ్రాశారు; ముఖాన అడిగారు ; వెనుకజేరి హేళన చేశారు; వెక్కిరించారు; ప్రతిదానికీ తప్పుపట్టారు. ప్రతి వార్తకూ పెడార్థాలు తీశారు. ఎవరెన్ని అన్నా, ఎవరెంత నిష్ఠూరంగా మాట్లాడినా శ్రీరామమూర్తి గారు కడవరకు జనార్ధన రెడ్డితో సంబంధాలు త్రెంచుకోలేదు. లోలోపల బాధ పడటం తప్ప బయట పడలేదు.

స్నేహానికి విలువనివ్వడం, నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడడమనే రెండు సుగుణాలు ఈ విషయంలో ఆయన్ను క్షోభకు గురి చేశాయి తప్ప జనార్ధన రెడ్డితో మమేకం వల్ల శ్రీరామమూర్తి గారు లబ్ధిపొందింది ఏమీ లేదు. భూస్వాములు, ధనస్వాములు, రాజకీయ కుటుంబ గుత్తాధిపత్యాల చెర నుంచి జిల్లాలో కాంగ్రెస్ పార్టీని విముక్తి చేయగల చురుకైన, చైతన్యవంతుడైన, మధ్యతరగతి యువకుడిగా జనార్ధన రెడ్డిని గుర్తించి ప్రోత్సహించడం ప్రారంభించారు శ్రీరామమూర్తిగారు. ఒక వైపు ఆనం, ఇంకొక వైపు నల్లపరెడ్ల గుత్తాధిపత్యంలో వుండిన జిల్లా రాజకీయాన్ని వారి నుంచి వేరు చేసి; కేవలం ధనవంతులకే పరిమితమై వుండిన శాసనసభా ఎన్నికల అవకాశాలను మధ్య తరగతి కుటుంబీకులకు అందించే కృషిలో వీరిద్దరూ ఒకటైనారు. 1978 ఎన్నికలలో ఆ కృషిలో సఫలీకృతులైనారు కూడా! తన ఆశలు ఫలింపజేసిన వ్యక్తిగా జనార్ధన రెడ్డి మీద ఆయనకు, తననొక రాజకీయ శక్తిగా మల్చాడన్న కృతజ్ఞతతో శ్రీరామమూర్తిగారి పట్ల ఈయనకు మధ్య ఏర్పడిన పరస్పర స్నేహ బాంధవ్యం విడదీయరాని బంధంగా పెరిగిందే తప్ప అద్దరి మధ్య ఎటువంటి వ్యక్తిగత లాభనష్టాలు, ఇచ్చి పుచ్చుకోవడాలు లేవు. వారిది మానసిక సాన్నిహిత్యమే తప్ప. పనులు, పదవులు, ప్రయోజనాలతో కూడిన స్నేహితం కాదు.

జనార్ధన రెడ్డితో తన స్నేహ ధర్మాన్ని నెరవేర్చడానికి శ్రీరామమూర్తి గారు పత్రిక ప్రతిష్టను పణంగా పెట్టారు. ఎందరినో శత్రువులుగా మార్చుకున్నారు. ఎన్ని దూషణలో, ఛీత్కారాలో భరించారు. జనార్ధన రెడ్డితో కలసి వుంటున్నారని, జనార్ధన రెడ్డిని ఆకాశానెత్తి వ్రాస్తున్నారని నిందించిన పెద్ద మనుషులే అదే జనార్ధన రెడ్డి అధికారంలోకి వచ్చినప్పుడల్లా ఆయన వెంట చేరేవారు; పనులు

కొరవ 12వ పేజీలో




జనార్ధన రెడ్డి పట్ల శ్రీరామమూర్తి గారికి అపారమైన స్నేహగౌరవాలు ; నూతన భవనం ఆయన చేతిమీదుగా ప్రారంభింపజేస్తూ, హార్దికంగా, సంతృప్త మానసంతో పుష్పమాలాలంకృతుడ్ని చేస్తున్న దృశ్యం (30.10.1992)



శ్రీరామమూర్తి గారి పట్ల తనకున్న స్నేహ సౌహార్దాలను చాటుతూ విషణ్ణ వదనంతో మృతదేహం ప్రక్కన కూర్చుని, స్మశానం వరకు వచ్చి, అంతిమ వీడ్కోలు పలికిన మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన రెడ్డి

# శ్రీరామమూర్తి అస్తమయం!

జమీన్‌రైతు మేనేజింగ్ ఎడిటర్ శ్రీ నెల్లూరు శ్రీ రామమూర్తి 20 తేది వేకువన (19 తేది రాత్రి) పరమపదించారు. తీవ్రమైన గుండెపోటు ఆయన్ను ఇహలోక బాంధవ్యాల నుంచి విముక్తి చేసింది. 19 తేది సోమవారం ఉదయమే కారులో మద్రాసుకు వెళ్లారాయన. సాధారణ మెడికల్ చెకప్ కోసం అపోలో ఆస్పత్రిలో చేరారు.

### ఆఖరి పలకరింపు

*మరణానికి ముందు వరకు శ్రీరామమూర్తి గారు ఎంతో తెలివితో, పూర్తి స్పృహతో వుండినారు. ఆ రోజు రాత్రి 10 గంటల సమయంలో అపోలో లోనే పని చేస్తున్న మనుబోలు వాస్తవ్యుడు డాక్టర్ ని. మధుసూదన రెడ్డి ఆయన్ను పరామర్శించడానికి గదికి వచ్చాడు. మధు, పది పన్నెండేళ్ల క్రితం మనుబోలులో ప్రైవేటు ప్రాక్టీసు చేసింది, పంచాయితీ రాజకీయాలలో పాల్గొన్నది జ్ఞాపకం చేశారు రామమూర్తి గారు. ఇద్దరి మధ్య పరిచయం లేదు; ఎప్పుడూ చూసింది లేదు. కాని జిల్లాలోని ప్రతి గ్రామంలో జరిగిన, జరుగుతున్న సంఘటనల పట్ల ఆయన కెంతటి అవగాహన వుండిందో, ఎంత నిశితంగా పరిశీలించి, గుర్తు పెట్టుకునే వాడో ఈ ప్రస్తావనతో అర్థమౌతుంది. డాక్టర్ మధుదే బయటి వ్యక్తులతో ఆయన ఆఖరి పలకరింపు.*

సాయంత్రం వరకు కులాసాగానే వుండినారు. డాక్టర్లు ఎక్స్‌రే వంటి పరీక్షలు చేశారు. గుండె బలహీనంగా వుందని, కొత్తగా కొలెస్టరాల్ ఏర్పడి రక్త నాళాలలో మళ్లీ అడ్డంకు లేర్పడుతున్నాయని డాక్టర్లు అభిప్రాయ పడ్డారు. కాని, పరిస్థితి ప్రమాదకరంగా వుందని వారూ వూహించలేదు. సాయంత్రం పరిస్థితి కొంత మెరుగు పడిందనే అన్పించింది. కులాసాగా మామూలుగానే మాట్లాడారు. సెడటివ్ ఇవ్వడం వల్ల త్వరగా నిద్రపోయారు. తిరిగి వేకువన 4 గంటలకు నర్సువచ్చి లేపబోతే కదలిక లేదు. డాక్టర్లు పరుగు పరుగున వచ్చారు. కాని చేయగలిందింది



శ్రీరామమూర్తి గారి భౌతిక కాయం

వుండినారు. బాగా మాట్లాడు తుండినారు. రాత్రి పది గంటల వరకు మెలకువగా వుండినారు. తర్వాత నిద్ర పట్టింది. అర్థరాత్రి పంటి గంటకు నర్సు వచ్చి మందు ఇచ్చి వెళ్లింది. అప్పుడూ ఏమీ లేదు. నిద్రలోనే తీవ్రమైన వచ్చింది; నిద్రలోనే ప్రాణం పోయింది. కనీసం ప్రక్కనున్న వారికి కూడా గుండె పోటు సంగతి తెలియదు; అలికిడే

కొరవ 10వ పేజీలో








# ఒక పాత్రికేయుడికి ఇంతటి ప్రజాభిమానం అసాధారణం !

శ్రీరామమూర్తి గారి అంతిమ యాత్ర 22 తేది బుధవారం ఉదయం జరిగింది. 20 తేది ఉదయం 10 గంటలకే ఆయన మృతదేహం మద్రాసు అపోలో ఆస్పత్రి నుంచి అంబులెన్స్‌లో నెల్లూరు చేరింది. ఆజన్మాంతం తానభిమానించిన పత్రికాఫీసు కావడమే కాక, తాను స్వయంగా దగ్గరుండి కట్టించిన జమీన్‌రైతు నూతన భవనంలోనే ఆయన భౌతిక కాయాన్ని అంతిమ దర్శనం కోసం వుంచడం జరిగింది. శ్రీరామమూర్తి గారి చిరకాల మిత్రుడు శ్రీ గునుపాటి రామచంద్రా రెడ్డి తొలిగా పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. కొద్ది సేపటిలోనే ఆ వార్త ఊరంతా ప్రాకింది. అభిమానులు, స్నేహితులు, జమీన్‌రైతు పాఠకులు అసంఖ్యాకంగా విచ్చేసి కడసారి దర్శనం చేసుకున్నారు. మంత్రి శ్రీ పసల పెంచలయ్య, ఎమ్మెల్యేలు జె.కె. రెడ్డి, సి.వి. శేషారెడ్డి, డాక్టర్ బి. సుందర రామిరెడ్డి, కలికి యానాది రెడ్డి, డిసిసి అధ్యక్షుడు శ్రీ ఆనం సంజీవ రెడ్డి, జి.ప్ర.ప. మాజీ ఛైర్మన్ శ్రీ బేగ నారసింహా రెడ్డి, టి.డి.పి. జిల్లా అధ్యక్షుడు శ్రీ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కళ్యాణి ఫిలింస్ ప్రసన్న రెడ్డి తదితరులంతా వచ్చారు. మధ్యాహ్నం మిరదట శ్రీ నేదురుమల్లి జనార్దన రెడ్డి హైదరాబాదు నుంచి వచ్చారు. మనసులోనే దిగమింగుకొని, భౌతిక కాయం పై చేయి వేసి బ్రతికున్న స్నేహితుడిని తాకినట్లే భావించి ప్రక్కనే కూర్చున్నారు జనార్దన రెడ్డి గారు. కాంగ్రెస్ భవన్ వద్ద కొద్ది సేపు ఆపి, శ్రీ పి.వి. రమణారెడ్డి, శ్రీ పసల పెంచలయ్య, శ్రీ ఆనం సంజీవ రెడ్డి పుష్పమాలలతో శ్రద్ధాంజలి ఘటించారు. అసంఖ్యాకమైన అభిమానులు వెంటరాగా శ్రీరామమూర్తి గారి భౌతిక కాయం

## అశేష జనసందోహపు అశ్రు తర్పణాలతో అంతిమ యాత్ర

దూరంలో వున్న బంధువుల రాక కోసం అంత్యక్రియలు మరు రోజుకు వాయిదా పడ్డాయి.

బుధవారం ఉదయం 8 గంటలకు పూలమాలలతో అలంకరించిన శకటం పై అంతిమ యాత్ర ప్రారంభమైంది. శ్రీరామమూర్తి గారి ఇద్దరు కుమారులు యామినీ చంద్ర, కోసలరాంలతో పాటు శ్రీ జనార్దన రెడ్డి కూడా శకటం పై కూర్చున్నారు. అంతకు క్రితం ఆయన మృతదేహం పై జాతీయ జెండా కప్పి, గౌరవం ప్రదర్శించారు. అపురలని శోకభారాన్ని

పెన్న తీరం చేరింది. పెద్ద కుమారుడు శ్రీ యామినీ చంద్ర చితికి నిప్పంటించారు. పినాకినీ తీరం శిధికన వేలాది మంది పాఠకులను దశాబ్దాల తరబడి అలరించిన ఆ ధన్యజీవి భౌతిక కాయాన్ని పినాకినీ నదీమ తల్లి తన గర్భంలో దాచుకున్నది. నెల్లూరు జిల్లా రాజకీయ, ఆంధ్ర దేశపు పాత్రికేయ చరిత్రలలో ఒక శకం అంతరించింది; ఒక సుదీర్ఘ అధ్యాయం సమాప్తమైంది. శ్రీరామమూర్తి గారి ఆత్మ పంచభూతాలలో కలిసి పోయింది.


విజయ వక్కపొడి

రుచి అమోఘం – ధర స్వల్పం

వివాహాది శుభ కార్యములకు • 100 గ్రా. 200 గ్రాముల ప్యాకింగ్‌లో సరసమైన ధరలకు లభించును.

విజయ వక్కపొడి

ట్రంకురోడ్డు – నెల్లూరు

ఫోన్: 23372




అంత్యక్రియలకు బయల్దేరిన భౌతిక దేహంతో కుటుంబ సభ్యులు

## పదేళ్లు ప్రాణం నిల్పిన డాక్టరు



శ్రీరామమూర్తి గారిని పదేళ్లపాటు తన అసాధారణ వైద్య పరిజ్ఞానంతో కంటికి రెప్పలా కాపాడిన వారు – డాక్టర్ జి. రామచంద్రా రెడ్డి, ఆయనకు 1983 లోనే తీవ్రమైన గుండెపోటు వచ్చింది. మరణపు అంచువరకు వెళ్లారు. డాక్టర్ రామచంద్రా రెడ్డి ఆనాడు ప్రాణం నిల్పాడు. అప్పటి నుంచి కనుమూసే వరకు ఆయన శ్రీరామమూర్తి గారికి ప్రత్యేక శ్రద్ధతో వైద్యం చేశాడు. అర్ధరాత్రి అవసరం వచ్చినా పరుగెత్తుకొని వచ్చేవారు. రామచంద్రా రెడ్డి గారి వైద్యానికి తిరుగులేదు. మద్రాసుకు వెళ్లినా, మరొక చోటకు వెళ్లినా ప్రసిద్ధ వైద్య నిపుణులు సైతం ఆయన చికిత్సనే కొనసాగించమనే వారు. చివరి దశలో ఆయన కృషి, నిపుణత కూడా పనిచేయలేదు. డాక్టర్ గారికి జమీన్‌రైతు సదా రుణపడి వుంటుంది.

# అశ్రుతర్పణం

సద్గుణశీలి, నిష్కపటి, నిర్మొగమాటి
అర్ధ శతాబ్దంగా స్నేహమాధుర్యం పంచిపెట్టిన మా ప్రియమిత్రుడు, మా అన్న

## శ్రీ నెల్లూరు శ్రీరామమూర్తి గారు



ఈ లోకం వీడి వెళ్లిపోయారని తెలిసి నా మనస్సెంతో తల్లడిల్లి పోయింది.
అంతటి ఉన్నతుడ్ని ఇక కలలో కూడా పొందలేము.
వారు లేని లోటు ఎవ్వరూ తీర్చలేనిది.
వారి ఆత్మకు దైవసన్నిధిన చిరశాంతి కలగాలని
ప్రార్థిస్తూ, వారికి అశ్రుతర్పణం అర్పిస్తున్నాము.

గ్రిద్దలూరు సుందర రామయ్య
Spectra Engineering Co. (P) Ltd.,
Nagarjuna Hills, Hyderabad



మద్రాసు తెలుగు అకాడమి అవార్డును తమిళనాడు గవర్నర్ డాక్టర్ పి.సి. అలెగ్జాండర్ చేతుల మీదుగా స్వీకరిస్తున్న దృశ్యం

# ఆనందాన్నిచ్చిన రెండు అవార్డులు

శ్రీరామమూర్తి గారి సుదీర్ఘ పాత్రికేయ జీవితంలో సత్కారాలు, సన్మానాలు, సముచిత గౌరవాలు ఎన్నో! వ్యక్తిగతంగా ఆయన వాటికి విముఖుడు. ఎంతో బలవంత పెడితే తప్ప ఒప్పుకునేవాడు కాదు. ఎన్నో సంస్థలు ఆయన్ను సన్మానాల కాహ్వానించేవి; నిరాకరించేవాడు. సభల్లో మాట్లాడమని పిల్చేవి; ససేమిరా రాననేవాడు. ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సత్కరించింది. ఆనాటి తమిళనాడు గవర్నర్ డాక్టర్ పి.సి. అలెగ్జాండర్ రామమూర్తి గారిని సన్మానించారు.

జర్నలిస్టుగా శాసనమండలికి గవర్నర్ చేత నామినేట్ అయిన ఒకే ఒక తెలుగు పాత్రికేయుడు కూడా శ్రీరామమూర్తి గారే! 1978 - 84 సంవత్సరాల మధ్య కాలంలో ఆయన ఎమ్మెల్సీగా వుండినారు. శాసన మండలి సమావేశాలలో పత్రికల సమస్యలు, రైతుల బాధలు పలుమార్లు ప్రస్తావించారు. జర్నలిస్టుగా కాకున్నా, శాసనమండలి సభ్యుడిగా అయినా సన్మానాలు స్వీకరించమని పిల్చేవారు కాని, ఎక్కడకూ వెళ్లలేదు.



ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభలలో ఉత్తమ పాత్రికేయ అవార్డు పొందినా, అది స్వీకరించడానికి రాలేదని తెలిసి, ఆనాటి ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు ప్రత్యేకంగా నెల్లూరులో ఒక సభ జరిపి, అవార్డు అందజేశారు. ఆనాటి దృశ్యం

ఆయన్ను ఉత్తమ పాత్రికేయుడుగా ఎంపిక జేసింది. ఆ గౌరవం అందుకున్న ఒకే ఒక తెలుగు పాత్రికేయు డాయన. కానీ ఆ సభలకూ పోలేదు; సన్మానమూ స్వీకరించలేదు. అప్పటి ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు అది గమనించి, నెల్లూరులో ఒక ప్రత్యేక సభ ఏర్పాటు చేసి, ఆ నాటి విద్యామంత్రి శ్రీ మండలి వెంకట కృష్ణారావు గారి చేత వ్యక్తిగతంగా చెప్పి పిలిపించి, సన్మాన మందజేశారు. తెలుగులో మరే జర్నలిస్టు ఇంతటి విశిష్ట గౌరవం అందుకొని వుండడు.

నాలుగేళ్ల క్రితం మద్రాసు తెలుగు అకాడమీ ఆయన్ను

అయితే స్వర్గీయ వెంకట్రామా నాయుడు గారి స్మృత్యర్థం అవార్డు నొకదానిని ఏర్పరచి ఎందరో పాత్రికేయులను తన చేతుల మీదుగా సన్మానించారు. నార్ల నుంచి నండూరి రామ మోహన రావు గారి వరకు, రామోజీ రావు గారితో సహా ఆంధ్రదేశంలోని ప్రతి ప్రసిద్ధ సంపాదకుడు, పాత్రికేయుడు ఈ అవార్డులు స్వీకరించిన వారే!

# రామానాయుడుగారిచ్చిన మొలకను ఒక మహావృక్షంగా పెంచారు!

జిల్లాలో జరిగిన ప్రతి రాజకీయ ఉద్యమం, సంఘటన, పరిణామాల వెనుక ఆయన ప్రత్యక్ష లేదా పరోక్ష ప్రభావాలుండేవి. స్వర్గీయ ఎ.సి. ప్రభకోటి సూర్యకాంతులతో వెలుగు తున్నప్పుడు, ఆనం వారిని కాదంటే పచ్చి మంచినీళ్లు కూడా పుట్టవనే భీతి వుండిన రోజులలో వారికి వ్యతిరేకంగా ఒక రాజకీయ విప్లవాన్ని లేవదీసి, ఎసిసి అందుకు నాయకుర్ని చేసి, ఆనం వారి ప్రాభవానికి గండి కొట్టిన సాహసి శ్రీరామమూర్తి గారు. భయం, మొగమాటం అనేవి ఆయన వార్తల్లో కన్పించేవి కావు. ఎంతటి వాడినైనా తన వ్యాఖ్యలతో దులపరించేవాడు.

ఆయన నిర్వృతికి జై ఆంధ్ర ఉద్యమం ఒక ప్రబల నిదర్శనం. ఆంధ్రప్రదేశ్ విడిపోతే ప్రజలకు క్షేమం కాదనుకున్నాడు. నమ్మిన ఆ సిద్ధాంతాన్ని పత్రికలో వ్యక్తం చేశారు. కాని శ్రీరామమూర్తి గారు వేటికి చలించలేదు. తన ధోరణి మార్చుకోలేదు. జై ఆంధ్ర నినాదం పలుకలేదు. నమ్మిన విశ్వాసాన్ని వదలి పెట్టలేదు. అంతటి ధీరోదాత్త పాత్రికేయుడాయన.

ఇటువంటి మానసికాందోళనలే ఆయన ఆరోగ్యాన్ని క్షీణింప చేశాయి.

**శూన్యం**

(2 పేజీ కొరవ)

ఎప్పుడూ బెన్షన్; ఏదో ఒక ఉద్రిక్తత. తాను విశ్వసించేది, సరైనదిగా భావించేది తప్ప మరేది అంగీకరించే వాడు కాడు; ఎవరి ప్రలోభానికి, ప్రభావానికి లోనయ్యే వాడు కాదు. బాల్య స్నేహితుడైనా తప్పు చేస్తే నిర్మొగమాటంగా వ్రాసేవాడు. ఆ ధోరణి తప్పిపోతే బాధపడేవారు. ఆయన స్నేహితులలో అధిక సంఖ్యాకులు రైతులే. వారితో గంటల తరబడి మాట్లాడేవారు. సమయమే తెలిసేది కాదు. అందువల్లే ఆయనకు వ్యవసాయం గురించి, రైతుల సమస్యల గురించి, పంటల గురించి క్షుణ్ణంగా తెలుసు. పేద ప్రజలంటే అమిత అభిమానం. టీచర్లు, పంచాయితీ గుమాస్తాల వంటి సాధారణ వ్యక్తులెందరో ఆయనతో సాన్నిహిత్యం కల్గివుండేవారు. వారికే అవసరం వచ్చినా అధికార్లతో నాయకులతో పోట్లాడి నెరవేర్చేవాడు. వ్యవసాయ కూలీలెందరో ఆయన కాష్ఠలు, చనువుగా, స్వతంత్రంగా అడిగి మరీ తమ పనులు చేయించుకునేవారు.

జిల్లాలోను బయట ఎందరో అధికార, అనధికార ప్రముఖులతో ఆయనకు సాన్నిహిత్యం పరిచయాలుండేవి. మంత్రులు, ముఖ్యమంత్రుల స్థాయిలో పరిచయాలుండేవి. జిల్లాలో ప్రతి పార్టీ నాయకుడితోను సంబంధాలుండేవి. కాని ఏనాడూ వారి పరిచయాన్ని తన అవసరాలకు వాడుకొనే వాడు కాదు. పొరపాటున కూడా వారి గడప తొక్కేవాడు కాదు.




వజ్రోత్సవ వేదికపై రాష్ట్రపతి, గవర్నరు, ముఖ్యమంత్రుల సరసన అపరిమిత ఆనంద కందళిత హృదయంతో ఆసీనులైవున్న శ్రీ రామమూర్తి గారు. (కుడి చివర)

సిద్ధాంతాన్ని పత్రికలో వ్యక్తం చేశారు; ఉద్యమాన్ని ఎదిరించారు; ఏటి కెదురీదారు. ఎన్ని బెదరింపులో, ఎన్ని శత్రులో, ఎన్ని హెచ్చరికలో; ఎన్నిసార్లో దౌర్జన్యానికి ప్రయత్నించారు, ప్రకటనాలాపేశారు. ఆదాయ వనరులు అడ్డగించి ఆర్థిక దిగ్బంధనం చేశారు. రోడ్ల తిరగడానికి కూడా లేకుండా ఆయనకు ఎప్పటికప్పుడు శత్రువులను సృష్టిస్తుండేది. ఆ ఆలోచనలతో బిపి పెరిగేది; ఆరోగ్యం చితికి పోయేది.

పల్లెటూళ్లన్నా, పల్లెటూరి పేద ప్రజలన్నా, రైతులన్నా అమిత ప్రీతి శ్రీరామమూర్తి గారికి. పల్లెటూళ్ల వార్తలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చేవారు. ఎప్పుడైనా ఆ క్షేత్ర

## శ్రద్ధాంజలి



మాకెంతో ఆప్తులు, గురుతుల్యులు

శ్రీనెల్లూరు శ్రీరామమూర్తిగారు

మరణించారంటే నమ్మలేకున్నాము.
వారి పవిత్రాత్మకు శ్రద్ధాంజలి
ఘటిస్తున్నాము.

దేవిరెడ్డి కృష్ణారెడ్డి.
నెల్లూరు. ఫోన్: 26867.



# నెల్లూరు ముచ్చట్లు
విమర్శకుడు

## శ్రీరామమూర్తి గారి పేరిట జాతీయ అవార్డు

నెల్లూరు శ్రీరామమూర్తి గారి స్మారకం ఒక ఉత్తమ పాత్రికేయుడిని ఏటా సన్మానించాలని జమీన్‌రైతు కమిటీ నిర్ణయించింది. ఒక్కొక్క రూపాయి 50 వేల నుంచి లక్ష రూపాయల లోపల నగదు పారితోషికం. ఏమైనంటే ఇవ్వాలని తలంపు. ఇందుకోసం తగుమొత్తం నిధిని సేకరించి, డిపాజిట్ చేయాలని నిర్ణయించారు.

జమీన్‌రైతు తరపున ఇప్పటికే స్వర్గీయ రామానాయుడి గారి పేరుతో ఒక అవార్డు ప్రతి సంవత్సరం ప్రదానం చేస్తున్నాం. అయితే అది రాష్ట్ర స్థాయి అవార్డు. ఆంధ్రదేశంలోని ప్రసిద్ధ సంపాదకులను, జర్నలిస్టులను సత్కరించే ఆ ఆనవాయితీ శ్రీరామమూర్తి గారు ప్రారంభించినదే. ఒకే సంస్థ నుంచి, ఇచ్చిన వారికే మళ్ళీ వేరొక పేరుతో అవార్డు ఇవ్వడంలో సమంజసత్వం వుండదనే ఉద్దేశ్యంతో శ్రీరామమూర్తి గారి స్మారక అవార్డును జాతీయ స్థాయి జర్నలిస్టులకు ఇవ్వాలని సంకల్పించాము. రామమూర్తి గారి జన్మదినం అక్టోబరు 17 తేది. అదే అవార్డు ప్రదానోత్సవం దినం అవుతుంది. రేపు అక్టోబరు 17 తేది నుంచే ఈ అవార్డును ప్రారంభించాలని సంకల్పం.

అదే రీతిలో రాష్ట్రంలోని మూడు ప్రధాన విశ్వ విద్యాలయాలలో జర్నలిజం కోర్సులో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు శ్రీరామమూర్తి గారి పేరిట బంగారు పతకం ఇవ్వాలని నిర్ణయించడం జరిగింది.

దేశ, విదేశాలలో వున్న శ్రీరామమూర్తి గారి స్నేహితులు, అభిమానులు ఆయనకు సముచిత స్మృతి చిహ్నం ఏర్పర్చే విషయంలో తగు సలహాలు సహకారం అందచేయాలని మనవి.

## ముఖ్యమంత్రి సంతాపం

జమీన్‌రైతు మేనేజింగ్ ఎడిటర్ శ్రీ నెల్లూరు శ్రీరామమూర్తి గారి మృతి పట్ల ముఖ్యమంత్రి శ్రీ కోట్ల విజయభాస్కర రెడ్డి తన ప్రగాఢ సంతాపం తెలియచేశారు. 20 తేది మంగళ వారం మధ్యాహ్నమే ఆయన హైదరాబాదు నుంచి ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.

* * *

శ్రీరామమూర్తి గారికి సంతాపం తెల్పుతూ అసంఖ్యాకంగా సందేశాలు వస్తూనే వున్నాయి. వాటన్నింటిని స్థలాభావం చేత ఈ వారం ప్రచురించ లేక పోతున్నాము. క్షమించండి! ఎందరో స్వయంగా వచ్చి సానుభూతి తెల్పుతున్నారు. వారందరికీ మా ధన్యవాదాలు.

## జనార్ధన రెడ్డి

మాజీ ముఖ్యమంత్రి శ్రీ నేదురుమల్లి జనార్ధన రెడ్డి 20 తేది నుంచి జిల్లాలో పర్యటిస్తున్నారు; 27 తేది సాయంత్రం వరకు వుంటారు.

## పెంచలయ్య

సమాచార మంత్రి శ్రీ పనల పెంచలయ్య కూడా జిల్లాలోనే పర్యటిస్తున్నారు.

## వెంకయ్య నాయుడు

అఖిల భారత బిజెపి ప్రధాన కార్యదర్శి శ్రీ ఎం. వెంకయ్య నాయుడు 24 తేది నెల్లూరు వచ్చారు; 25 తేది తిరిగి వెళ్లిపోయారు.

నాయుడు గారిని ఢిల్లీలో పార్టీ స్పోక్స్‌మన్‌గా వుండమన్నారట. స్పోక్స్‌మన్ అంటే పార్టీ వ్యవహారాల పై ఏ రోజు కారోజు పత్రికలకు సమాచార మందించే బాధ్యత. దేశ రాజధానిలో పలుకుబడి, దేశ వ్యాప్త ప్రాముఖ్యం వచ్చే అవకాశమున్నా, 365 రోజులూ ఢిల్లీలోనే వుండ వలసి వస్తుంది కాబట్టి స్వరాష్ట్రంతో స్వజనంతో సంబంధాలు క్షీణిస్తాయి. అందువల్ల దాన్ని నిరాకరించి, దక్షిణ భారతదేశంలో పార్టీని నడిపించే బాధ్యత స్వీకరించారు. నెలకి ఒక వారం ఢిల్లీ, తక్కిన సమయం దక్షిణాది రాష్ట్రాలలో పర్యటన - ఇదీ ఆయన కార్యక్రమం. ఆయన ఆరోగ్య రీత్యా ఇంతటి విర్విరామ తిరుగుడు క్షేమదాయకం కాదేమో - ఆలోచించారా?

## మెడికల్ ర్యాంకులు రద్దు

మొన్న జరిగిన మెడికల్ ఎంట్రన్స్ పరీక్షలో స్టేట్ ర్యాంకులు తెచ్చుకున్న ఎ. మాధవి, వి. అనితలకు వారి ర్యాంకులు రద్దు చేస్తూ ప్రభుత్వం అసాధారణ ఉత్తర్వు జారీ చేసింది. వీరిద్దరూ నెల్లూరులో ఎమ్‌సెట్ పరీక్ష వ్రాసారు. నెల్లూరులోని ఒక కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందారు. వీరిలో కుమారి మాధవి తండ్రి శ్రీ భిక్షం రాష్ట్ర ఉన్నత సాంకేతిక విద్యా శాఖ జాయింట్ డైరక్టరు; కుమారి అనిత, మాధవి రూమ్‌మేటు. శ్రీ భిక్షం, నెల్లూరు పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్, ఎమ్‌సెట్ పరీక్షల కో ఆర్డినేటరైన శ్రీ షమీయుల్లాతో కుమ్మక్కై ప్రశ్నా పత్రాలు బయటకు తెచ్చి తన కుమార్తెకు అందించాడని, వాటికి ఆ విద్యార్థిని ముందుగానే జవాబులు సిద్ధం చేసుకొని పరీక్ష వ్రాసిందని ప్రాథమిక విచారణలో తేలింది. ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎన్. బాలకృష్ణారెడ్డి ఈ విషయమై ప్రాథమిక దర్యాప్తు జరిపారు. ప్రభుత్వం ఈ ఇద్దరు అధికారులను సస్పెండ్ చేసింది.

ఉన్నతాధికారిగా ఉండి పరీక్షల నిర్వహణలో అక్రమాలకు పాల్పడడమే కాకుండా, చదువుకుని పరీక్షలు వ్రాసే విద్యార్థులకు అన్యాయం చేసిన ఈ ఇద్దరు అధికారులను ప్రాసిక్యూట్ చేసి, కఠినంగా శిక్షించడం అవసరం. ఈ ఉదంతం పై సిబిసిఐడి దర్యాప్తు జరుగుతూంది.

## వానలు

మిడిమేళపు ఎండలతో గొంతు తడార్చుక పోయే పరిస్థితిలో వుండిన నెల్లూరు జిల్లాను వరుణ దేముడు కరుణించాడు. నాలుగు రోజాల నుంచి జిల్లా వ్యాప్తంగా మంచి జల్లులు పడుతున్నాయి. పలు చోట్ల ఎండిన బావులలో జలవూరుతున్నది. మెట్ట తాలూకాలలో సేద్యపు పనులు ప్రారంభమైనాయి. పెన్నకు మాత్రం నీరు రాలేదు. సోమశిలలో నీటిమట్టం ఇంకా అడుగంటే వుంది. ఈ మాత్రం తొలకరి వానలు మరొక వారం కురిస్తే జిల్లా కరువు పీడ నుండి తప్పించు కుంటుంది.

## కృష్ణాపట్నం రేవుకు మరి రెండు నౌకలు

నాయుడు దశరథరామ రెడ్డి గారి కృషి వల్ల కృష్ణాపట్నం రేవుకు వచ్చిన స్టీమర్ నుంచి ఎరువుల అన్‌లోడింగ్ జరుగుతున్నది. త్వరలో మరి రెండు నౌకలు రానున్నాయట. పడమటి గాలుల వల్ల కండ్లేటి ముఖద్వారం మూసుకొని పోతుండడంతో కాకినాడ నుంచి డ్రెడ్జర్ తెప్పించి ఇసుక మేటలు తొలగించే ప్రయత్నం చేస్తున్నారు.

*

మహాశ్రీ రాజ్ హైరర్స్

బ్రాంచి: 24/1477, రామ్ నగర్, యం.జి. బ్రదర్స్ ప్రక్కవీధి
N.G.O. కళ్యాణ మండిరం ఎదురు వీధి దర్గామిట్ట, నెల్లూరు 524 004

ఫోన్: 27873 ☎

పత్తి సూరి

మాడరన్ బఫేస్టాల్స్, హాట్ కేసెస్, రెడ్ కార్పెట్స్, జంబో షామియానాలు, స్టేజి బల్లలు, కుర్చీలు, టేబుల్స్, పేపర్ రోల్స్ మొదలగునవి అన్ని కార్యాలకు మీకు కావలసిన సామగ్రి సమకూర్చి సహకరించగలము.

మాకు ఇంతకాలం సహకారం అందించిన ఖాతాదారులు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతాంజలి అర్పిస్తున్నాము.

మా బ్రాంచి తెరిచిన అచిరకాలంలోనే మీ మన్ననలు పొందినందుకు సంతోషిస్తున్నాము.

## ఉత్తరక్రియలు



మా తండ్రి

### శ్రీ నెల్లూరు శ్రీరామమూర్తి గారు

మేనేజింగ్ ఎడిటర్ – జమీన్‌రైతు

20.7.93 తేది మంగళవారం స్వర్గస్థులైనారు.

వారి కర్మక్రతువులు 30.7.1993 తేది శుక్రవారం శిలాప్రతిష్ఠ

31.7.1993 తేది శనివారం శిలోద్వాసన

నెల్లూరు, జమీన్‌రైతు భవనమున (నిప్పోఫ్యాక్టరీ ఎదురుగా) జరుగును.

వారి ఆత్మశాంతికై భగవంతుని ప్రార్థిస్తూ.......

యామినీ చంద్ర
కోసలరామ్
దోశేంద్రప్రసాద్



1993 జూన్ 3 తేదీ జమీన్‌రైతు రామానాయుడు అవార్డు సభలో పాల్గొన్నప్పుడు తీసిన ఆఖరి ఫోటో ! ఆయనలోని శారీరక బలహీనత స్పష్టంగా కన్పడిపోతున్నదిందులో !

ఆయనెంతో సంతృప్తిగా కన్పించారు. ఆ తర్వాత ఒపికున్నప్పుడు సాయంత్రం సమయంలో ఆఫీసుకు వచ్చి, కాసేపు కూర్చుని వెళ్లేవారు. పత్రికకు వ్రాయడం కూడా మానేశారు. రెండు వారాల నుంచి అదీ లేదు.

శ్రీరామమూర్తి గారు వయస్సు 68 సంవత్సరాలు; 1925 అక్టోబరు 17 తేదీ జన్మించారు; 1993 జూలై 20 తేదీ పరమపదించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు వున్నారు.

## అస్తమయం

(5 వపేజి కొరవ)

లేదు; ప్రశాంతంగా ఇహలోకం విడిపోయారు.

శ్రీరామమూర్తి గారిది మొదటి నుంచి ఆరోగ్యవంతమైన దేహం కాదు. ఆయనకు చిన్నతనంలోనే షుగర్ వ్యాధి సోకింది. తన తల్లిదండ్రులు తనకు వారసత్వంగా మిగిల్చిపోయిన ఆస్తి అదొక్కటేనని ఛలోక్తు లాడేవారు. టిపి వుంది. 1983 లో మొదటిసారి గుండెపోటు వచ్చింది. శారీరకంగా బలహీనుడైనాడు. అప్పటి నుంచి తరచు సమస్యలే. కంటికి కాటరాక్ట్ ఆపరేషన్ చేస్తే అది విఫలమైంది. దానితో మరీ క్రుంగి పోయారు. మధ్యలో రెండు సార్లు గుండెపోటు వచ్చింది. మళ్లీ మొన్న మే 16 తేది మరొక సారి హృదయ చలనం చెడింది. అప్పటి ను చి కోలుకోలేదు. డాక్టర్లు విశ్వప్రయత్నం చేశారు. డాక్టరు రామచంద్రా రెడ్డి గారు రకరకాల ప్రయత్నాలు చేశారు. ఆ ఓపిక లేని పరిస్థితులలోనే జూన్ 3 తేది రామానాయుడు జయంతి అవార్డు సభకు వచ్చారు. రామానాయుడి గారి విగ్రహాన్ని బెజవాడ గోపాల రెడ్డి గారి చేత ఆవిష్కరింప జేశారు. ఆ రోజు

## పంచాంగం

వరలక్ష్మి వ్రతము
తేది 24 శనివారం
గరుడపంచమి వ్రతము
తేది 25 ఆదివారము పగలు గంటలకు 10..24 కన్యాలగ్నమున సందుఉపనయనవివహావ్యాపారారంభము లకు
తే ది 28 బుధ వార ము ద గంటలకు 10.34 లకు మీనలగ్నముల గృహప్రవేశ వివాహములకు సుముహూర్తములు కలవు

### జూలై తిధులు

శ్రావణశుద్ధ
తే 24 శని పంచమి ఉ. గ. 6.48 వ
తరువాత షష్ఠి రా. గ. 4.55 వ
తే 25 ఆది సప్తమి రా. గ. 1.42 వ
తే 26సోమ అష్టమి రా.గ 11.25 వ
తే 27 మంగళ నవమి రా.గ.9.15 వ
తే 28 బుధ దశమి రా. గ. 7.40 వ
తే 29 గురు ఏకాదశి రా. గ. 6.00 వ
తే 30 శుక్ర ద్వాదశి సా. గ. 4.50వ

స్వయంపాకుల శ్రీనివాసులు, ఎం.ఏ.


జమీన్‌రైతు
సంవత్సర చందా రు 100/-
6 నె లలకు- రు 50/-
విడిప్రతి - రు 2.00



**In the Court of the Subordinate Judge, Gudur**
IA. 573/92 IA. 43/89 O.S. 108/78

K. Dhanamma - Petitioner

Vs.

Sannareddy Subrahmanyamreddy (died) and other - Respondents

To
R.7. Sannareddy Suklamma
W/o Prabhakar Reddy(Late)
3/490 Near Vijayalakshmi Talkies, Lakshmipuram, Stonehousepet, Nellore.

పై దావాలో వాది సన్నారెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి మరణించినందున మిమ్ములను R7గా వారసులుగా కలుపమని కోరుచూ పై పిటీషనర్ పిటిషన్ దాఖలు చేసినందున మీకు ఆక్షేపణలున్నచో 26.7.93న ఉదయం పై కోర్టునందు హాజరై మీరు గాని ఖూద్దున గాని ఆక్షేపణలు తెలుపుకోవలసినది గాన తెలియజేయడమైనది. లేనిచో మీ పరోక్షమున తీర్మానింపబడునని తెలియజేయడమైనది.

G. Subbalakshmi,
17.7.93 Advocate & Petitioner.



# మానవతామూర్తి, మంచికి మారుపేరైన వ్యక్తి



## నెల్లూరు శ్రీరామమూర్తి గారు

ఇక కన్పించరన్న నిజం నమ్మశక్యం గాకున్నది !

ఆ మహాత్మునికివే నా సజల నయన జోహార్లు.

డాక్టర్ జి. రామచంద్రా రెడ్డి
సింధూర నర్సింగ్ హోమ్, నెల్లూరు

# జర్నలిజపు జాతి ముత్యం - నెల్లూరు శ్రీరామమూర్తి!

'జమీన్ రైతు' సంపాదక వర్గంలో చేరిన తొలి దినాల్లోనే ఆయన మెల్లగా వెల్లడించే అభిప్రాయాలను బట్టి ముత్యపు చిప్పలో దాగిన జర్నలిజపు జాతిముత్యం శ్రీ శ్రీరామ మూర్తి అవుతారని తాను గ్రహించినట్లు కళా వివేకానంద గ్రంథాలయాన్ని స్థాపించిన భాషాభిమాని. ఆయన ఏ మాత్రం తొట్రుపడకుండా నోటితో అనర్గళంగా వేలకొలది పద్యాలు చెప్పేవారు. మేమంతా ఆయనను బసివి నాయుడు పొట్ట పద్యాల పుట్టఅనే వాళ్లం; మాచి ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా పత్రిక ఆపేయించారు. ఆ రోజు కలెక్టర్ మాట్లాడుతూ 'ఇఫ్ ది సీట్ హిట్లర్స్ జర్మనీ యూ షైల్ హ్యావ్ బీన్ పెన్సిటెంపెడ్' అనే మాటలు నాకు చెవుల్లో గింగుర్లు తిరుగుతున్నాయి. నేను బ్రతుకుతెరువు కోసం మరో ప్రెస్ పెట్టుకొన్నా పత్రిక తిరిగి ప్రారంభించాక పత్రికకు రాయమన్న సహృదయులు శ్రీశ్రీరామమూర్తి గారు.

శ్రీ బసివి నాయుడు గారిలోని స్నేహశీలత శ్రీ శ్రీరామమూర్తి గారికి వారసత్వంగా సంక్రమించాయి. అందువల్లే అందరి స్మృతి ఫలకాల్లో స్నేహశీలమైన సౌమ్యులు మిగిలి పోతారు. నేనైతే స్నేహితుడైన పత్రికాధిపతిని కోల్పోయాను. అప్పటి సంచికల్లో వుగాదికి బిరుదాలిచ్చే సంస్కృతి వుండేది. నేను వ్రాసిన వాటిని మరింత రమ్యంగా మలిచే వాడు. ముల్లు మొగ్గ శీర్షిక క్రింద రంధ్రాన్వేషి పేరుతో విమర్శలు రాస్తుంటే వ్యక్తిగతంగా ఆయనను నొప్పించినా.

కొరవ 15 పేజీలో

## డాక్టర్ మరుపూరు కోదండరామ రెడ్డి

ప్రఖ్యాత శ్రీ మరుపూరు కోదండ రామిరెడ్డి ప్రస్తుతించారు. అరవయ్యో దశకం వరకూ ముల్లు-మొగ్గ, రంధ్రాన్వేషి శీర్షికనిగా 'జమీన్‌రైతు' తండ్రి స్వర్గీయ నెల్లూరు వెంకటరామానాయుడు గారితోపాటు 'జమీన్‌రైతు' బిడ్డ శ్రీ శ్రీరామమూర్తి గారితో కలిసి పని చేసిన అటువంటి సారసత్వ సింహం కడుపున సింహమే పుడుతుందని శ్రీ శ్రీరామమూర్తి నిరూపించారు.

నూనూగు మీసాల అలనాటి యువ సంపాదకుడు, అదే ధోరణిలో 60 ఏళ్లు స్థానిక పత్రిక నడిపారంటే అది శ్రీరామమూర్తి ప్రజ్ఞకు, ప్రతిభకు



జమీన్‌రైతు జనకుడు స్వర్గీయ వెంకట్రామ నాయుడు గారికి సరైన స్మారక చిహ్నం ఏర్పరచ లేక పోయానన్న అసంతృప్తి శ్రీరామమూర్తి గారిలో మెదలుతూ వుండేది. మొన్న జూన్ 3వ తేదీ జమీన్‌రైతు భవన ప్రాంగణంలో రామానాయుడు గారి విగ్రహాన్ని శ్రీ బెజవాడ గోపాల రెడ్డి గారి చేత ఆవిష్కరింపజేస్తూ సంతృప్త మానసంతో తిలకిస్తున్న శ్రీరామమూర్తి గారు!

దినాలను శోకతప్త హృదయంతో మననం చేసుకున్నారు.

పొట్లపూడిలోని 'నెల్లూరు' వారి కుటుంబం జాతీయ వుద్యమంలో పాల్గొన్న దేశభక్తుల కుటుంబం. శ్రీ శ్రీరామమూర్తి గారి తండ్రి శ్రీ బసివి నాయుడు గారు స్వయంగా పొట్లపూడిలో నిదర్శనం. జాతీయోద్యమంలో నెల్లూరు - పొణకా - మరుపూరు కుటుంబాలకు మైత్రీ బంధం కుదిరింది. ఆ బంధం నేను పత్రికలో పని చేసేందుకు ఊతమయ్యింది. 1930లో పత్రిక ప్రారంభం కాగానే అప్పటి కలెక్టర్ గాన్ అందులో ప్రచురితమైన వార్తలు

# మిత్రుల స్మృతిలో చిరంజీవి!

అది 1946 వ సంవత్సరము. నేను, శ్రీ రామ మూర్తి నెల్లూరు వెంకటగిరి రాజాకళాశాలలో విద్యార్థులము. విద్యార్థి సంఘాలకు ఎన్నికలు జరిగె సమయం. నేను, ప్రాచ్యభాషాపరిషత్తు అధ్యక్ష పదవికి విద్యార్థి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశాను. ప్రత్యర్థి విద్యార్థి ఫెడరేషన్‌కు సంబంధించిన మిత్రుడు. ఆ ఎన్నికలో సహాయాన్ని అభ్యర్థించే నిమిత్తం నేను ప్రప్రథమంగా శ్రీ రామమూర్తిని కలుసుకోవడం జరిగింది. ఆయన సహాయ సహకారాలతో ఎన్నికలో నెగ్గే అవకాశం లభించింది. నాటి నుండి ఆయన పరమ పదస్తుడైనంత వరకు మామైత్రి ఒడిదుడుకులు లేకుండా నిరాఘాటంగా సాగింది. జీవితంలో ఏ సమస్య ఉత్పన్నమైనా ఆయన సలహా తీసుకొనేవాడిని. ఏ అవసరమొచ్చినా ఆయన సహాయాన్ని కోరేవాడిని.

శ్రీరామమూర్తి నలభై ఐదు సంవత్సరాలకు పూర్వం తన పిన తండ్రి స్వర్గీయ రామానాయుడు గారి కోరిక మేరకు పై చదువుకు స్వస్తిచెప్పి జమీన్‌రైతు సంపాదకవర్గంలో ప్రవేశించాడు. తన జీవితాన్ని జమీన్‌రైతుకే అంకితం చేశాడు. ఆ పత్రిక అభ్యున్నతే తన జీవితాశయంగా భావించాడు. రామానాయుడు గారి మరణంతో జమీన్‌రైతు మూత పడుతుందని కొందరు అభిప్రాయ పడడం జరిగింది. కాని ఆ అభిప్రాయాలు వట్టి భ్రమలు మాత్రమేనని రుజువు చేశాడు శ్రీ శ్రీరామమూర్తి. ఏ ఆశయాలతో రామానాయుడు గారు జమీన్‌రైతును స్థాపించారో, ఆ ఆశయాలకు అనుగుణంగా పత్రికను విజయవంతంగా నడిపాడు. పత్రిక స్థాయిని అన్ని విధాలా పెంపొందింప జేశాడు. దిన పత్రికలకు ఏవిషయంలోనూ తీసిపోదని పించాడు. జమీన్‌రైతు పాఠకుల సంఖ్యను

## పి.వి. రమణారెడ్డి

గణనీయంగా పెంచాడు.

పత్రికా రంగంలో తనకు శాశ్వతమైన స్థానాన్ని ఏర్పరచుకొన్నాడు. మేటి రచయిత అనిపించుకున్నాడు. ఏ సమస్యనైనా అన్ని కోణాల నుండి పరిశీలించడం ఆయన రచనలోని ప్రత్యేకత. ఏ విషయాన్ని గూర్చి వ్రాసినా దానిలోని మంచి చెడ్డలు రెంటినీ సమపాళ్లలో గుర్తించేవాడు. తన రచనలు పూర్తిగా ఏదో ఒక వైపుకు మొగ్గక సమదృష్టితో కూడి సహేతుకంగా

కొరవ 15 పేజీలో


## గూడూరు సబార్డినేట్ జడ్జి వారి కోర్టులో

E.P. No. 15/1992 :: O.S. No. 75/1990

Shaik Khasim Saheb పిటీషనరు(D.H.R.)

Vs

1.Shaik Masoom Saheb రెస్పాండెట్లు(J.D's) వగయిరా

### వేలము ప్రకటన

యీ నెంబరున పిటీషనరు(D.H.R) డిక్రీ బాకీ మొత్తం వగైరాలు రాబట్టు కొనుటకుగాను యీ దిగువ వివరించబడిన రెస్పాండెంట్ల తాలుకు షెడ్యూలు దాఖల స్థిరాస్థిని 2-8-93 వ తేదిన పగలు 10గం.లు మొదలు సాయంత్రం 5గం.లలోగా పై కోర్టు వారి ఎదుట బహిరంగముగా వేలము జరుపబడునని యిందు మూలముగా తెలియచేయడమైనది. వేలము పాట దారులు వేలము పాటను పాడుటకు పాల్గొన వలసినదిగా తెలియచేయడమైనది.

### షెడ్యూలు

నెల్లూరు రి.డి యిలాకా రాపూరు సబ్‌రిజిష్టారు యిలాకా రాపూరు మండలములోని "ఏపూరు" గ్రామములో రెస్పాండెంట్లుకు హక్కు స్వాధీనానుభవములోఉండు భూముల వివరము.

| వ.నెం. | పట్టా నెం. | సర్వే నెం. | పూర్తి విస్తీర్ణం ఎ.సెం | అనుభవ విస్తీర్ణం ఎ.సెం. | బాపత్తు | D.H.R.'s Value రూ.లు | Amine's Value రూ.లు |
|---|---|---|---|---|---|---|---|
| 1 | 143 | 196-1 A2 - 1B2 | 2-49 | 1-24 1/2 | మాగాణి | 15,000 | 20,000 |
| 2 | 241 | 196-1-A1 -B1 196-2-1A1 1B1 | 2.00 | 1.00 | మాగాణి | 10,000 | 15,000 |
| 3. | 43 | 117 | 2.49 | 1.24 | మెట్ట | 15,000 | 20,000 |

గూడూరు
12-7-93.

Y. రామారావు
పిటీషనరు తరపున అడ్వకేటు



పత్రికలో అధికార అనధికారుల లోపాలను ఎత్తి చూపుచూ.
ప్రజాసమస్యల పట్ల నిత్యం శ్రద్ధవహిస్తూ ఆకస్మికంగా దివికేగిన



శ్రీ నెల్లూరు శ్రీరామమూర్తి గారి

పవిత్రాత్మకు చిరశాంతిని కలుగ జేయమని
భగవంతుని ప్రార్థిస్తూ వారి కుటుంబానికి
మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాము.

ఇన్నమూరి వెంకటేశ్వర రావు.
ఇన్నమూరి ఉదయభాస్కర రావు.
విమల్ జంక్షన్, నెల్లూరు.


Edited, Printed and Published by N. Dolendra Prasad at Zaminryot Press, Offset Printing at Nayagara Paper Products Ltd, Nellore.